
'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సాక్షి
సత్యమేవ జయతే
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 235
బుధవారం 16-11-2022
SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLIGUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




జిన్‌పింగ్‌తో మోదీ కరచాలనం

6లో

జీ–20 సదస్సు సందర్భంగా బాలిలో మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కరచాలనం చేసుకోవడం దేశాధినేతలతో సహా అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సందర్భంగా ఇద్దరూ కాసేపు మాట్లాడుకుంటూ కనిపించారు.

పేరుకు ముందు హీరో అనే పదం అలంకారం కాదు..
అర్థవంతం అనిపించుకున్న అసాధ్యుడు..

నటనే శ్వాసగా.. ప్రయోగాలే ప్రాణంగా.. మంచితనమే ఆభరణంగా.. సాహసాల సహవాసం.!.. కృష్ణ ఆగమనంతోనే తెలుగు తెరకు సరికొత్త వెలుగులు..
కలర్ సినిమా తేనెమనసులుతో సినీరంగ ప్రవేశం..
ఆయనే తొలి గూఢచారి..116..
ఆయనే మొదటి కౌబాయ్.. మోసగాళ్ళకు మోసగాడు..
ఆయనే తొలి సినిమాస్కోప్ నిర్మాత..!
స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు సినిమాని స్కోపులో తీసి ఓ గొప్ప చరిత్రని ఆవిష్కరించిన ధీశాలి..!
తెలుగు సినిమాకు ఈస్ట్ మన్ కలర్ సొబగులు అద్దిన ఈనాడు సినిమా..
తెలుగులో మొదటి 6ట్రాక్ స్టీరియో సౌండ్ సిస్టంతో 70 ఎం ఎం సినిమాగా సింహాసనం నిర్మాణం తెలుగు బైస్కోపుకి సినిమా స్కోపు హంగులద్దిన ధీశాలి..
ఎన్ని ప్రయోగాలు.. ఎన్నెన్ని విజయాలు..
346 సినిమాల రికార్డు వరకు వెలిగిపోయిన సూపర్ స్టార్ శోభ!..
నిర్మాతల హీరోగా.. చిరస్థాయిగా నిలిచిపోయిన ప్రభ..



సాహసాల శపథం..
విజయాల పథం..

చుక్కల లోకానికి సూపర్ స్టార్


హీరో కృష్ణ పార్థివదేహం

గుండెపోటుతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కృష్ణ కన్నుమూత

- సినీ, రాజకీయ రంగ ప్రముఖుల దిగ్భ్రాంతి
- ప్రధాని మోదీ, ఏపీ, తెలంగాణ సీఎంల సంతాపం
- నేడు పద్మాలయా స్టూడియోస్‌కు కృష్ణ పార్థివదేహం
- మధ్యాహ్నం హైదరాబాద్ మహాప్రస్థానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

సాక్షి, హైదరాబాద్/ రాయదుర్గం/ గచ్చిబౌలి: 'అల్లూరి సీతారామరాజు'గా, ఆంధ్రా జేమ్స్ బాండ్‌గా అలరించడంతో పాటు 365 చిత్రాల్లో నటించి అఖిలాంధ్ర ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్రవేసిన 'అసాధ్యుడు', 'ఊరికి మొనగాడు', నటశేఖర బిరుదాంకితుడు సూపర్‌స్టార్ కృష్ణ (79) మంగళవారం కన్నుమూశారు. ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుకు గురైన ఘట్టమనేని కృష్ణను కుటుంబసభ్యులు హుటాహుటిన కాంటినెంటల్ ఆస్పత్రికి తరలించిన సంగతి తెలిసిందే. ఆయన ప్రాణాలు కాపాడేందుకు ఎనిమిది మందితో కూడిన వైద్యుల బృందం శ్రమించినా ఫలితం లేకపోయింది. తెల్లవారుజామున 4:09 గంటల

మిగతా 2వ పేజీలో ▶


తండ్రి పార్థివదేహం వద్ద కన్నీటి పర్యంతమవుతున్న మహేశ్‌బాబు

ఆయన ఓ లెజెండరీ
సూపర్‌స్టార్
కృష్ణ మృతిపట్ల ప్రధాని మోదీ ట్వీట్

చిత్ర పరిశ్రమపై
చెరగని ముద్ర
సినీనటుడు కృష్ణ మృతికి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ సంతాపం

2లో

ఆయనే అల్లూరి..
ఆయనే మన
జేమ్స్‌బాండ్
సూపర్‌స్టార్ కృష్ణ మృతికి సీఎం జగన్ సంతాపం

నేడు కృష్ణ పార్థివదేహానికి ముఖ్యమంత్రి నివాళి

సాహసమే అతడి ఊపిరి
డేరింగ్ అండ్ డాషింగ్
హిట్ పెయిర్

తండ్రీ కొడుకుల చిత్రాలు
- ప్రత్యేక కథనాలు 11, 12లో

ప్రపంచ జనాభా 800 కోట్లు
- ఫిలిప్పీన్స్‌లో జన్మించిన '800 కోట్ల' బేబీ
- 2023లోనే జనాభాలో చైనాను అధిగమించనున్న భారత్

6లో



జట్టుగా 175 సాధిద్దాం

విశాఖ ఉత్తర నియోజకవర్గ కార్యకర్తలతో భేటీలో సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం

- వ్యవసాయం, విద్య, వైద్య ఆరోగ్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాం
- సచివాలయాల వ్యవస్థతో ప్రతి పల్లెకూ పాలనను చేరువ చేశాం.. ఎన్నికల హామీల్లో 98%పైగా అమలు చేశాం
- పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇస్తున్నాం
- మునుపెన్నడూ లేని విధంగా సుపరిపాలన అందిస్తున్నాం
- అందుకే ప్రజలంతా మనవైపే..
- క్యాలెండర్ ప్రకారం సంక్షేమ పథకాలు అందించే బాధ్యత నాది
- మనం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలితాలతో మరో 30 ఏళ్లపాటు మనమే ఉండాలని ప్రజలు దీవిస్తారు
- వచ్చే ఎన్నికల్లో కేకే రాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



సాక్షి, అమరావతి: మనమంతా కలసికట్టుగా పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని, మరో 16 నెలల్లో రానున్న ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. మనం చేస్తున్న మంచి ప్రతి పల్లెలోనూ కనిపిస్తోందని, ప్రతి గ్రామం రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. పారదర్శకంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో వచ్చే ఎన్నికల్లో

మిగతా 2వ పేజీలో ▶



వైద్య నియామకాలకు
స్పెషల్ మెడికల్ బోర్డు
- వైద్య ఆరోగ్య శాఖ ప్రతిపాదనలు సిద్ధం
- మానవ వనరుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు పోస్టుల భర్తీ

3లో

పోలీసుల అదుపులో నిందితుడు


శవం గదిలో ఉండగానే..
- దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఢిల్లీ యువతి హత్య కేసులో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగుచూస్తున్నాయి. తనతో సహజీవనం చేస్తున్న శ్రద్ధా వాకర్‌ను దారుణంగా చంపేసి ముక్కలుగా చేసి ఫ్రిజ్‌లో దాచిన అఫ్తాబ్ అమీన్ పూనావాలా(28)నెల రోజు లకే మరో యువతితో అదే ఫ్లాట్‌లో గడిపాడు. ఆమె కూడా డేటింగ్ యాప్‌లోనే పరిచయం కావడం గమనార్హం.

- వివరాలు 6లో

వెలుగులోకి 'చీట్' ఫండ్స్
- తనిఖీల్లో బయటపడుతున్న అవకతవకలు.. మార్గదర్శి సహా రాష్ట్రవ్యాప్తంగా 18 సంస్థల్లో తనిఖీలు
- చిట్స్ సొమ్ము పెద్ద ఎత్తున దారి మళ్లినట్టు గుర్తింపు
- సంబంధిత సంస్థలపై చర్యలు తీసుకోవాలని జిల్లా రిజిస్ట్రార్లకు ఆదేశాలు

2లో


కాకినాడ మార్గదర్శిలో తనిఖీలు చేస్తున్న అధికారులు

క్లుప్తంగా

గవర్నర్ దంపతులతో హైకోర్టు సీజే దంపతుల భేటీ



గవర్నర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న హైకోర్టు సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

సాక్షి, అమరావతి: రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సుప్రవ హరిచందన్ దంపతులతో రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, సుచేతా మిశ్రా దంపతులు మంగళవారం రాత్రి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గవర్నర్ ఆహ్వానం మేరకు రాజ్ భవన్ చేరుకున్న సీజే దంపతులకు రాజ్ భవన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, ఇతర అధికారులు స్వాగతం పలికారు. సమకాలీన అంశాలపై గవర్నర్, సీజే చర్చించారు. గవర్నర్ కూడా గతంలో న్యాయవాది కావడంతో విభిన్న అంశాలపై వీరి సమావేశం సాగింది.

జీతాల బిల్లుకు సర్వీసు సర్టిఫికెట్లు జత చేయాలి

సాక్షి, అమరావతి: 25 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులందరూ సర్వీసు సర్టిఫికెట్లు జీతాల బిల్లుకు జత చేయాలని ఖజానా శాఖ మంగళవారం ఉత్తర్వులిచ్చింది. తమ ఎస్ఆర్‌లను ఏజీతో వెరిఫై చేయించుకోవాల్సి ఉన్నందున డీడీవోలందరూ తమ పరిధిలో 25 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగుల వివరాలను తెలుపుతూ సర్టిఫికెట్లను నవంబర్ జీతాల బిల్లులకు జతపరచాలని పేర్కొంది.

ప్రత్యేకాధికారుల పాలనాకాలం పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 10 పురపాలక సంఘాల ప్రత్యేకాధికారుల పాలనాకాలాన్ని పొడిగిస్తూ మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఈ నెల 5తో రాజాం, రాజమహేంద్రవరం కార్పొరేషన్, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, గుడివాడ, బాపట్ల, గూడూరు, శ్రీకాళహస్తి యూఎల్బీల్లో ప్రత్యేకాధికారుల పాలనాకాలం ముగిసింది. దీంతో వీటికి మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మెడ్‌టెక్ జోన్‌లో మెడికల్ ఎక్విప్‌మెంట్ ఎక్స్‌పో

సాక్షి, విశాఖపట్నం: మరో అంతర్జాతీయ సదస్సుకు విశాఖ వేదికగా మారనుంది. వరల్డ్ మెడ్‌టెక్ ఫోరం ఆధ్వర్యాన విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో డిసెంబర్ 11 నుంచి 13 వరకు ఇండియా ఇంటర్నేషనల్ మెడికల్ ఎక్విప్‌మెంట్ ఎక్స్‌పో నిర్వహించనున్నారు. ఈ ఎక్స్‌పోలో వరల్డ్ మెడ్‌టెక్ ఫోరం ప్రతినిధులు, 20 దేశాలకు చెందిన మెడికల్ ఎక్విప్‌మెంట్ సంస్థలు, ఆయా దేశాల మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు హాజరుకానున్నారు. వైద్య రంగంలో సాంకేతికత, అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జరుగుతున్న పరిశోధనలపై చర్చించనున్నారు.

వెలుగులోకి 'చీట్'ఫండ్స్

- తనిఖీల్లో బయటపడుతున్న అవకతవకలు
- మార్గదర్శి సహా రాష్ట్రవ్యాప్తంగా 18 సంస్థల్లో తనిఖీలు

సాక్షి, అమరావతి/విశాఖపట్నం/తిరుపతి: చిట్ ఫండ్ కంపెనీల్లో పెద్దఎత్తున అక్రమాలు బయటపడుతున్నాయి. ప్రజల నుంచి వస్తున్న వరుస ఫిర్యాదుల నేపథ్యంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కొద్దిరోజులుగా రాష్ట్రంలోని చిట్‌ఫండ్ కంపెనీల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. అక్టోబర్ 21, 31 తేదీల్లో డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులతో కలిసి రెండు విడతలుగా తనిఖీలు చేసి పలు అవకతవకలను గుర్తించింది. దానికి కొనసాగింపుగా మంగళవారం రాష్ట్రంలోని 18 సంస్థల్లో తనిఖీలు చేసింది. ప్రాథమిక పరిశీలనలో ఆయా కంపెనీల 2021–22 బ్యాలెన్స్ షీట్లను పరిశీలించినప్పుడు పెద్దఎత్తున నిధులు దారి మళ్లినట్టు గుర్తించారు. చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా వేలానికి ముందే చందాదారుల నుంచి చిట్ సొమ్మును కట్టించుకుంటూ దానికి 5 శాతం వడ్డీని చెల్లిస్తున్నట్టు తేలింది. చిట్ పాడుకున్న చందాదారుల నుంచి గ్యారంటీ తీసుకుంటున్న కంపెనీలు, తాము చిట్‌ను పాడినప్పుడు మాత్రం ప్రభుత్వానికి గ్యారంటీ చూపించడంలేదని స్పష్టమైంది. చందాదారులు ఆలస్యంగా చిట్ సొమ్ము కట్టారనే సాకు చూపించి పెనాల్టీలు వసూలు చేసి దానికి జీఎస్టీ చెల్లించకపోవడం, పెనాల్టీల పేరుతో చందాదారుల నుంచి ఎక్కువ సొమ్మును వసూలు చేయడం వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి.

ఉల్లంఘనలెన్నో!

పలు చిట్ కంపెనీలు 1982 చిట్‌ఫండ్ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నట్టు తనిఖీల్లో స్పష్టమైంది. చిట్ల సొమ్మును ఇతర కార్యకలాపాలకు మళ్లించినట్టు గుర్తించారు. చిట్ల సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయడం, రుణాలు ఇవ్వడం ద్వారా ఉల్లంఘనలకు పాల్పడ్డాయి. ఈ సొమ్ముతో ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నట్టు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా చెందిన చిట్ల సొమ్మును అనుబంధంగా కంపెనీలకు మళ్లించి వాడుకుంటున్నాయి. అకౌంట్ల నిర్వహణ, వ్యాపార రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించకుండా ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయి.

మార్గదర్శిలోనూ సోదాలు

విశాఖ జిల్లాలోని మార్గదర్శితో పాటు ఇతర చిట్‌ఫండ్ కంపెనీల్లో రికార్డులను అధికారులు పరిశీలించారు. నిధుల మళ్లింపుపై ఆరా తీశారు. తిరుపతిలోని మార్గదర్శి కార్యాలయంలోనూ సోదాలు నిర్వహించి చిట్స్ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయించుకుంటున్నారని, ఆ సొమ్ముతో వడ్డీ వ్యాపారం చేస్తున్నారని తేల్చారు.





మహేష్‌బాబుని పరామర్శిస్తున్న తెలంగాణ మంత్రి కేటీఆర్, మెగాస్టార్ చిరంజీవి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



నివాళులర్పిస్తున్న చంద్రబాబు

చుక్కల లోకానికి సూపర్‌స్టార్

▶ మొదటి పేజీ తరువాయి

సమయంలో కృష్ణ తుదిశ్వాస విడిచారు. అనంతరం ఆయన భౌతికకాయాన్ని నానక్‌రామ్‌గూడలోని స్వగృహానికి తరలించారు. ఉదయాన్నే తెలిసిన వార్తతో సినీ పరిశ్రమ దిగ్భ్రాంతికి గురయ్యింది. దేశవ్యాప్తంగా ఉన్న అభిమానులు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు. ప్రధాని మోదీ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు కె.చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ సహా పలువురు రాజకీయ, సినీరంగ ప్రముఖులు కృష్ణ మృతిపట్ల తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణ తనయుడు, సినీ హీరో మహేష్‌బాబుకు, ఇతర కుటుంబసభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు. కృష్ణ మృతికి నివాళిగా బుధవారం షూటింగ్‌లు నిలిపేయాలని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, తెలుగు చలన చిత్ర కార్మికుల సమాఖ్య నిర్ణయించాయి. కృష్ణ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో బుధవారం మధ్యాహ్నం మహాప్రస్థానంలో జరగనున్నాయి.

నేడు పద్మాలయ స్టూడియోకు కృష్ణ పార్థివదేహం

కృష్ణ పార్థివదేహాన్ని బుధవారం నానక్‌రాంగూడలోని విజయకృష్ణ నిలయం నుంచి జూబ్లీహిల్స్‌లోని పద్మాలయ స్టూడియోస్‌కు తరలించనున్నట్లు సినీ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అభిమానులు నివాళులు అర్పించవచ్చని చెప్పారు. తమ అభిమాన నటుడి చివరి చూపు కోసం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు హైదరాబాద్‌కు వచ్చారు. కృష్ణ భౌతికకాయాన్ని గచ్చిబౌలి స్టేడియంలో ఉంచుతారనే వార్తలతో తొలుత అక్కడికి, ఆ తర్వాత నానక్‌రామ్‌గూడకు వెళ్లారు.

బుర్రిపాలెం బుల్లోడు

కృష్ణ అసలు పేరు ఘట్టమనేని శివరామకృష్ణమూర్తి. స్వస్థలం తెనాలి సమీపంలోని బుర్రిపాలెం. నాగరత్నమ్మ, వీరరాఘవయ్య చౌదరి దంపతులకు 1943 మే 31న జన్మించారు. ఆయనకు ఇద్దరు తమ్ముళ్లు. పిల్లల చదువు కోసం తొలుత తెనాలి, ఆ తర్వాత ఏలూరులో సెటిల్ అయ్యారు. బీఎస్సీ పూర్తి చేసిన కృష్ణ సినిమాల్లో నటించాలనే తన చిన్ననాటి కలను నిజం చేసుకోవడమే కాకుండా ఏకంగా 365 సినిమాల్లో నటించారు. 1965లో విడుదలైన 'తేనె మనసులు' (ఆదుర్తి సుబ్బారావు డైరెక్టర్) కృష్ణ తొలి సినిమా. 1967లో బాపు దర్శకత్వంలో వచ్చిన 'సాక్షి' చిత్రంలో కృష్ణ సోలో హీరోగా నటించారు. అక్కడినుంచి ఆయన వెనుదిరిగి చూడలేదు. రోజుకు రెండు మూడు షిఫ్టులు పనిచేసేవారు. తెలుగులో అతి తక్కువ కాలంలో అత్యధిక సినిమాల్లో నటించిన స్టార్ హీరోగా గుర్తింపు పొందారు. 16 సినిమాలకు దర్శకత్వం (తెలుగులో 14, హిందీలో 2) వహించారు. 1970లో తన సోదరులతో కలిసి 'పద్మాలయా పిక్చర్స్' అనే చిత్రనిర్మాణ సంస్థను ఆరంభించి, ఎన్నో సినిమాలు నిర్మించారు. కొంతకాలం ఎగ్జిబిటర్‌గా, డిస్ట్రిబ్యూటర్‌గానూ సేవలందించారు. 1980లో హిందీ చిత్రరంగంలోనూ ప్రవేశించింది పద్మాలయా పిక్చర్స్.

తనకు తానే సాటి

నాలుగున్నర దశాబ్దాల సినీ జీవితంలో కృష్ణ ఎన్నో విజయాలు, మరెన్నో అవరోధాలు ఎదుర్కొన్నారు. ఫ్లాప్ వచ్చిన ప్రతిసారీ పడిలేచి మరింత బలంగా జనం ముందుకొచ్చి తనకు తానే సాటి అనిపించుకున్నారు. సినిమా ప్రయోగాలకూ, సాహసానికీ సూపర్‌స్టార్ ఒక సింబల్. 'తేనె మనసులు' తొలి సాంఘిక రంగుల చిత్రమైతే, ఆయన నటించిన వందో చిత్రం 'అల్లూరి సీతారామరాజు' తొలి సినిమా స్కోప్‌గా రూపొందింది. ఆయన ద్విపాత్రాభినయం చేసి, దర్శకత్వం వహించిన 'సింహాసనం' తొలి తెలుగు 70 ఎం.ఎం. సినిమా. తన మూడో చిత్రం 'గూఢచారి 116' తోనే తెలుగులో జేమ్స్‌బాండ్ సినిమాలకు ఆద్యుడయ్యారు. ఆ తర్వాత వచ్చిన 'ఏజెంట్ గోపి', 'రహస్య గూఢచారి', 'జేమ్స్‌బాండ్ 007' సినిమాలు ఆయన్ను 'ఆంధ్రా జేమ్స్‌బాండ్'గా నిలిపాయి. 'మోసగాళ్లకు మోసగాడు'తో కౌబాయ్ తరహా సినిమాల్లోనూ తనకు తిరుగులేదని చాటారు. ఎన్టీఆర్ చేద్దామనుకుని ఆ తర్వాత వద్దనుకున్న 'అల్లూరి సీతారామరాజు'ను పద్మాలయా బ్యానర్‌పై నిర్మించి, నటించి తెలుగు ప్రేక్షకులను మెప్పించారు. అందరి ప్రశంసలూ అందుకున్నారు. అదే సాహసంతో విజయనిర్మల దర్శకత్వంలో 'దేవదాసు' తీశారు. ఏఎన్ఆర్ 'దేవదాసు' అంతటి విజయం రాకున్నా, కృష్ణ 'దేవదాసు'లోని పాటలన్నీ ఆదరణ పొందాయి.



మహేష్‌బాబును ఓదారుస్తున్న తెలంగాణ సీఎం కేసీఆర్

ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లే స్ఫూర్తి

1951.. తెనాలి రత్నా టాకీస్... గోడపై 'పాతాళ భైరవి' సినిమా పోస్టర్. ఎన్టీఆర్–ఎస్వీఆర్ బొమ్మ ఎనిమిదేళ్ల కుర్రాడిని ఆకర్షించింది. మళ్లీ మళ్లీ చూశాడు.. ఆ సినిమా తర్వాత మరెన్నో సినిమాలు వచ్చినా, ఆ సినిమా పోస్టరు మాత్రం ఆ బాలుడి మదిలో నిలిచిపోయింది. కొన్నేళ్ల తర్వాత అదే తెనాలి. ఆ కుర్రోడే నడుచుకుంటూ వెళుతున్నాడు. ఓ ఇంటి దగ్గర గుమిగూడిన జనం.. కాళ్లకు బ్రేకులు పడ్డాయి. వందలమంది జనం. ఎవరి కోసమో ఉత్కంఠగా వేచి చూస్తున్నారు. ఏమిటోనని తానూ ఆ గుంపులో చేరిపోయాడు. అంతలో ఆ ఇంటిలోంచి ఏఎన్నార్ బయటకి వచ్చారు. ఒక్కటే కేకలు, ఈలలు..దేవుణ్ణి చూసినట్టుగా, జన్మ ధన్యమైందన్నంతగా జనం పరవశించిన సన్నివేశమది. సినిమా హీరోకి ఇంతటి ప్రజాదరణ ఉంటుందా? అని ఆశ్చర్యపోయాడా కుర్రాడు. అప్పుడే నిర్ణయించుకున్నాడు.. ఎప్పటికైనా తానూ సినిమా హీరోను కావాలని. అంతే ఆ నిర్ణయానికి తిరుగులేకుండా పోయింది. అనుకున్నది సాధించాడు. ఓ డేరింగ్ అండ్ డాషింగ్ హీరో వెండితెర ఏలేందుకు వచ్చేశాడు. ఆయనే ఘట్టమనేని కృష్ణ.

మల్టీస్టారర్ చిత్రాల్లోనూ...

మల్టీస్టారర్ చిత్రాల్లోనూ కృష్ణ నటించారు. తన అభిమాన నటుడు ఎన్టీఆర్‌తో కలిసి పలు సినిమాల్లో నటించారు. ఆయనతో కృష్ణ తీసిన సొంత చిత్రం 'దేవుడు చేసిన మనుషులు' ఘన విజయం అందుకుంది. ఎన్టీఆర్ అభిమాని అయినప్పటికీ ఆయనతో వృత్తిపరంగా పోటీపడటంలో ఎప్పుడూ ముందుండేవారు. ఎన్టీఆర్ 'దాన వీర శూర కర్ణ', కృష్ణ 'కురుక్షేత్రం' సినిమాలు ఒకేరోజు విడుదలయ్యాయి. అక్కినేనితో 'అక్కాచెల్లెళ్లు' నుంచి 'గురుశిష్యులు' వరకు నటించారు. శోభన్‌బాబు, కృష్ణంరాజులతో పలు చిత్రాల్లో స్క్రీన్ పంచుకున్నారు. తర్వాతి తరంలోని చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జునతోనూ నటించారు. అప్పట్లో సినిమా పత్రిక 'జ్యోతిచిత్ర' నిర్వహించిన బ్యాలెట్‌లో వరుసగా అయిదేళ్లపాటు సూపర్‌స్టార్‌గా ఎంపికయ్యారు. అప్పట్నుంచీ సూపర్‌స్టార్‌గా కొనసాగారు. 'అల్లూరి సీతారామరాజు' చిత్రంలో 'తెలుగు వీర లేవరా' పాటకు జాతీయ అవార్డు రాగా, ఉత్తమ నటుడిగా రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు, 2003లో ఎన్టీఆర్ జాతీయ అవార్డు అందుకున్నారు. 2009లో భారత ప్రభుత్వం ఆయనను 'పద్మభూషణ్' పురస్కారంతో సత్కరించింది.

రాజీవ్‌గాంధీ ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి ఎంట్రీ

అటు హీరోగా, ఇటు దర్శకునిగా ఫుల్ బిజీగా ఉన్న కృష్ణ అనూహ్యంగా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి అందర్నీ ఆశ్చర్యపరిచారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అంత్యక్రియలకు ఢిల్లీ వెళ్లిన కృష్ణకు.. రాజీవ్ గాంధీతో ఏర్పడిన పరిచయం ఆయన్ను రాజకీయాలవైపు తీసుకొచ్చింది. 1989 ఎన్నికల్లో ఏలూరు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. 1991లో రాజీవ్ గాంధీ హత్యకు గురైన ఘటన తీవ్రంగా కలచివేయడంతో అప్పటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఆ తర్వాత షూటింగ్‌లతో మళ్లీ బిజీ అయ్యారు. ఆయన నటించిన చివరి సినిమా శ్రీశ్రీ (2016).

భద్రాద్రి అల్లుడు

కృష్ణ మరణంతో బుర్రిపాలెంతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ముసలిమడుగులో విషాదం అలుముకుంది. ముసలిమడుగుకు చెందిన ఇందిరాదేవిని కృష్ణ వివాహమాడారు. 1965 అక్టోబర్ 13న పెద్ద కొడుకు రమేష్ బాబు పుట్టాడు. ఆ తర్వాత పద్మజ, మంజుల, మహేష్ బాబు, ప్రియదర్శిని.. ఇలా ఐదుగురు సంతానం ఉన్నారు.

వరుస విషాదాలు

నటి, దర్శకురాలు విజయనిర్మలను కృష్ణ 1969లో తిరుపతిలో పెళ్లి చేసుకున్నారు. అప్పటికే విజయనిర్మలకు నరేశ్ అనే కొడుకు ఉన్నాడు. విజయనిర్మల 2019 జూన్ 27న మరణించారు. రమేష్ బాబు ఈ ఏడాది జనవరి 8న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. కృష్ణ భార్య ఇందిరా దేవి కూడా ఈ ఏడాది సెప్టెంబర్ 28న మృతి చెందారు. ఇలా వరుసగా తీవ్ర విషాదాలు ఎదుర్కొన్నారు కృష్ణ.

ఆయన ఓ లెజెండరీ సూపర్‌స్టార్..

సినీనటులు కృష్ణ మృతిపట్ల ప్రధాని మోదీ ట్వీట్



సాక్షి, అమరావతి: కృష్ణ ఒక లెజెండరీ సూపర్‌స్టార్ అంటూ ప్రధాని మోదీ కీర్తించారు. కృష్ణ మృతిపట్ల సంతాపం తెలియజేస్తూ ఆయన మంగళవారం ట్వీట్ చేశారు. 'కృష్ణ తన అద్భుత నటనా కౌశలంతో, ఉన్నతమైన, స్నేహపూర్వకమైన వ్యక్తిత్వంతో ప్రజల హృదయాలను గెలుచుకున్న ఒక లెజెండరీ సూపర్‌స్టార్. ఈ విషాదకర సమయంలో మహేష్‌కు, వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి'.. అంటూ తెలుగులో మోదీ ట్వీట్ చేశారు.

చిత్ర పరిశ్రమపై చెరగని ముద్ర



సినీనటుడు కృష్ణకు గవర్నర్ సంతాపం

సాక్షి, అమరావతి : కృష్ణ మృతిపట్ల గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ మంగళవారం సంతాపం ప్రకటించారు. నటుడు, నిర్మాత, దర్శకుడుగా తెలుగు చలన చిత్ర పరిశ్రమలో కృష్ణ చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. కుటుంబ కథా చిత్రాలతోపాటు సామాజిక స్పృహ ఉన్న అనేక చిత్రాల్లో నటించి ఆయన ప్రేక్షకాదరణ పొందారన్నారు.

ఆయనే అల్లూరి.. ఆయనే మన జేమ్స్‌బాండ్




సాక్షి, అమరావతి : తెలుగు సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ మరణంపట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. టాలీవుడ్‌లో తన సుదీర్ఘ ఇన్నింగ్స్‌లో ఎక్కువమంది అభిమానులను కలిగి ఉన్న ఆయనే అల్లూరి.. ఆయనే మన జేమ్స్‌బాండ్ అని కొనియాడారు. నిజ జీవితంలో కూడా మనసున్న మనిషిగా, సినీరంగంలో తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్న ఆయన మరణం తెలుగు సినీ రంగానికి, తెలుగువారికి తీరని లోటు అంటూ ఆయన మృతికి తన సంతాపం వ్యక్తంచేశారు. అల్లూరి సీతారామరాజు పాత్రను చిరస్థాయిగా నిలిపి, తన కెరీర్‌లో ఎన్నో హిట్‌లు సాధించారని కీర్తించారు. ఆయన కుమారుడు మహేష్‌బాబుకు, కృష్ణ కుటుంబసభ్యులందరికీ ఈ కష్ట సమయంలో దేవుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నానని సీఎం జగన్ ట్వీట్ చేశారు.

నేడు హైదరాబాద్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సీఎం జగన్ ఈనెల 16న (బుధవారం) హైదరాబాద్‌కు వెళ్లి కృష్ణ పార్థివదేహానికి నివాళులర్పిస్తారు. ఉ.9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి 11.20కు పద్మాలయా స్టూడియోస్‌కు చేరుకుని కృష్ణకు నివాళులర్పిస్తారు. అనంతరం మ.1.30కు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

తెలుగు రాష్ట్రాల లెజెండ్



తెలుగు రాష్ట్రాల లెజెండ్, సినీ దిగ్గజం కృష్ణ మరణం బాధాకరం. 44 ఏళ్ల సినీ జీవితంలో రాత్రింబవళ్లు పనిచేస్తూ 350పైగా చిత్రాలు చేశారు. సినిమాలు, రాజకీయాల్లోనే కాకుండా సామాజిక సేవలోనూ మంచి పేరు సంపాదించారు. భావితరాలకు ఆయన ఆదర్శం. ఆయన లెగసీని కుమారుడు మహేష్‌బాబు ముందుకు తీసుకెళ్లాలి. – మాజీ సీఎం నారా చంద్రబాబు

చారిత్రక చిత్రంతో అందరినీ ఆకట్టుకున్నారు



మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుపై చారిత్రాత్మక చిత్రం తెరకెక్కించి కృష్ణ అందరినీ ఆకట్టుకున్నారు. నేను చదువుకొనే తొలినాళ్లలో కృష్ణ సినిమా పట్ల ఒక థియేటర్ యజమాని ఒక రకంగా మాట్లాడితే జరిగిన ఉద్యమం ద్వారానే రాజకీయాల్లోకి వచ్చా. స్నేహశీలి, మానవతావాది అయిన కృష్ణ మరణం కోలుకోలేనిది. – ఎం.వెంకయ్యనాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి

గొప్ప మిత్రుడిని కోల్పోయా..



సూపర్‌స్టార్ కృష్ణ మరణం తెలుగు సినీరంగానికి తీరని లోటు. నేను గొప్ప మిత్రుడిని కోల్పోయాను. కృష్ణ ముక్కుసూటిగా, అరమరికలు లేకుండా మాట్లాడే మనిషి. విలక్షణ నటుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా దేశానికి సేవ చేశారు. – తెలంగాణ సీఎం కేసీఆర్

తీవ్ర విచారకరం



కృష్ణ మరణవార్త తీవ్ర విచారం కలిగించింది. వృత్తిరీత్యా ఆయన క్రమశిక్షణ, నైతిక విలువలకు ఎవరూ సరితూగలేరు. ప్రజాజీవితంలో వ్యవహారశైలి ఎలా ఉండాలో ఆయన ఒక ఉదాహరణ. – కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ట్వీట్

జట్టుగా 175 సాధిద్దాం





విశాఖ ఉత్తర నియోజకవర్గ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

ఘన విజయం సాధించడం ద్వారా మరో 30 ఏళ్ల మనమే అధికారంలో ఉండాలని ప్రజలు దీవిస్తారన్నారు. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ కార్యకర్తలతో సీఎం జగన్ సమావేశమయ్యారు. ప్రతి కార్యకర్తతో విడివిడిగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అధికారంలోకి వచ్చాక నియోజకవర్గానికి చేసిన మంచి, అభివృద్ధిని గణాంకాలతో సహా వివరించారు. గత ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కేకే రాజు వచ్చే ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థిగా ఉంటారని చెప్పారు. ఆయన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని రావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

మీ అందరి భాగస్వామ్యంతో..

మరో 16 నెలల్లో ఎన్నికలు రానున్నాయి. అందుకోసం ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి. ఇంకా చాలా సమయం ఉంది కదా..! అప్పుడెప్పుడో చేయాల్సిన కార్యక్రమాలు ఇప్పుడే చేయాలా? అనుకోవచ్చు. ఎందుకు ఈ కార్యక్రమాలు చేపట్టామంటే రెండు కారణాలున్నాయి. మనం కలసి చాలా రోజులైంది. కలిసినట్లు ఉంటుందన్నది మొదటి కారణమైతే రెండోది.. గడప గడపకూ కార్యక్రమం ద్వారా ప్రభుత్వాన్ని ప్రతి వార్డులోకి, ప్రతి ఇంటి వద్దకు తీసుకెళ్లడంలో మీ అందరి భాగస్వామ్యం ఎంతో ముఖ్యం, అవసరం.

లక్ష్యాన్ని గుర్తు చేసేలా..

ఈరోజు రాష్ట్రంలో పరిపాలన చూస్తే.. ఇంత పారదర్శకంగా, వివక్ష, అవినీతికి తావులేకుండా పథకాలు గతంలో ఏ రోజూ సామాన్యుడికి చేరలేదు. రాష్ట్ర చరిత్రలో తొలిసారి ఇలా జరుగుతోంది. లంచాలకు ఆస్కారం లేకుండా పాలన సాగుతోంది. సచివాలయాలనే గొప్ప వ్యవస్థను మనం తీసుకొచ్చాం. ఎన్నికలప్పుడు మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో 98 శాతానికి పైచిలుకు నెరవేర్చాం. అలా నెరవేర్చిన తర్వాత ప్రజల దగ్గరకు వెళ్లి వారి ఆశీస్సులు కోరుతున్నాం. ఇటువంటి పరిస్థితుల్లో 175కి 175 నియోజకవర్గాల్లోనూ గెలుపు సాధించాలనే లక్ష్యంతో అడుగులు ముందుకు వేయాలి. వీటిని గుర్తు చేయడానికే ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నాం.

కుప్పంలోనూ క్లీన్ స్వీప్..

ఇంతకు ముందెన్నడూ లేని విధంగా ఇవాళ పరిపాలన జరుగుతోంది. కుప్పం లాంటి నియోజకవర్గంలో కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో మనం క్లీన్ స్వీప్ చేశాం. మున్సిపాల్టీ, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలన్నీ గెల్చుకున్నాం. గతంలో రాని ఫలితాలు ఇవాళ చూస్తున్నాం. దీనికి కారణం ప్రతి ఇంటిలోనూ సంక్షేమం, అభివృద్ధి కనిపిస్తోంది. పారదర్శకంగా పథకాలు అమలవుతున్నాయి. ప్రతి ఇంటికీ మేలు జరుగుతోంది. అలాంటప్పుడు 175 స్థానాలనూ సాధించాలని మనం అనుకున్న లక్ష్యం కచ్చితంగా సాధ్యమే.

క్యాలెండర్ ప్రకారం ఠంచన్‌గా..

విశాఖ రాష్ట్రంలో అన్నిటికన్నా పెద్ద నగరం. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో 76% ఇళ్లలో మన పథకాలు కనిపిస్తున్నాయి. దాదాపు 1.05 లక్షల ఇళ్లు ఉంటే 80 వేల ఇళ్లకు పథకాలు అందాయి. అంత పారదర్శకత కనిపిస్తోంది. ఎక్కడా తప్పు జరగకుండా కచ్చితంగా క్యాలెండర్ ప్రకారం నెల నెలా బటన్ నొక్కి పథకాలతో మేలు చేకూరుస్తున్నాం. ఈ నెలలో ఈ పథకం ఇస్తామని తొలిసారిగా బడ్జెట్ అన్నదానికి నిర్వచనం మార్చాం. గతంలో ఇలా ఎప్పుడూ క్యాలెండర్ ప్రకారం జరగలేదు. నాకు ఎన్ని సమస్యలున్నా అధిగమించి ప్రజల ఇబ్బందులే ఎక్కువని భావించి మేలు చేస్తున్నాం. అదే విధంగా మీరు చేయాల్సింది కూడా మీరు చేయాలి.

రూపురేఖలు మారిన పల్లెలు..

ఇవాళ మన గ్రామాల రూపురేఖలు సమూలంగా మారుతున్నాయి. ఆర్బీకేలు అడుగడుగునా రైతన్నలకు అన్ని సేవలు అందిస్తున్నాయి. గ్రామాల్లో వ్యవసాయం చేసే తీరు మారుతోంది. సచివాలయాల వ్యవస్థతో ఇంటి వద్దకే పథకాలు పారదర్శకంగా వస్తున్నాయి. పట్టణాల్లో అర్బన్ హెల్త్ క్లినిక్స్ కనిపిస్తున్నాయి. అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దిన పాఠశాలలు, ఇంగ్లిష్ మీడియం చదువులు, మౌలిక వసతులు బలోపేతం చేసిన ఆసుపత్రులు కళ్లెదుటే కనిపిస్తున్నాయి. డిజిటల్ లైబ్రరీలు కూడా రానున్నాయి. వ్యవసాయం, విద్య, వైద్య ఆరోగ్య రంగాలలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. మనం చేస్తున్న మంచి ప్రతి చోటా కనిపిస్తోంది. మొత్తంగా మనం వేస్తున్న అడుగులు ప్రతిఫలాన్ని ఇచ్చే పరిస్థితి వస్తోంది. ఇలాంటప్పుడు ప్రజలు మనల్ని గెలిపించి ఆశీర్వదిస్తూ మరో 30 ఏళ్లు మనమే ఉండాలని దీవిస్తారు. ఎలాంటి విభేదాలున్నా వాటిని పక్కనపెట్టి అందరూ కలసికట్టుగా అడుగులు వేయాలి.

ప్రతి గడపకూ వెళ్లాలి..

మీరు కచ్చితంగా ప్రతి గడపకూ వెళ్లాలి. ఆ ఇంట్లో అక్కచెల్లెమ్మలకు జరిగిన మంచిని వారికి వివరిస్తూ, గుర్తు చేస్తూ వారి ఆశీస్సులు తీసుకోవాలి. ఆ వార్డులో సహేతుక కారణాలతో ఎవరికైనా ప్రయోజనం చేకూరకుంటే దీన్ని పరిష్కరించాలి. ఆ విధంగా మమేకం కావాలి. ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే మనం దగ్గరుండి పరిష్కరించాలి. ఇలా నేను చేయాల్సింది నేను.. మీరు చేయాల్సింది మీరు చేయాలి. ఈ రెండింటి కాంబినేషన్ జరిగితే 175కి 175 సాధ్యమే.

వ్యవస్థలో గొప్ప మార్పులు..

మనం నలుగురికి మంచి చేయాలంటే అధికారంలో ఉంటేనే చేయగలుగుతాం. ఇవాళ వ్యవస్థలో గొప్ప మార్పులు జరుగుతున్నాయి. అవి కొనసాగాలంటే మనందరం కలసికట్టుగా అడుగులు వేయాలి.

రియల్ లైఫ్‌లోనూ 'సూపర్ స్టారే'

నటుడు ఘట్టమనేని కృష్ణకు ప్రముఖుల నివాళి

కోట్లాది అభిమానులను సంపాదించుకున్నారు



కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న సూపర్ స్టార్ కృష్ణ మరణం సినీ రంగానికి తీరని లోటు. కృష్ణ కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. – ఎంపీ విజయసాయిరెడ్డి

తెలుగు జాతికి తీరని లోటు



కృష్ణ మరణం సినీ ఇండస్ట్రీతో పాటు యావత్ తెలుగు జాతికి తీరని లోటు. ఆంధ్రుల అభిమాన నటుడు లేరనే విషాదకర వార్త నన్ను కలిచి వేసింది. – వైవీ సుబ్బారెడ్డి, టీటీడీ చైర్మన్

రాజకీయాలకు అతీతమైనవారు



సినిమా రంగంలో ధైర్యానికి మారుపేరు కృష్ణ. చరిత్రలో ఆయన నిలిచిపోతారు. రాజకీయాలకు అతీతంగా ఎంతో మందికి ఆయన ఆత్మీయులు. – సోము వీర్రాజు, ఏపీ బీజేపీ అధ్యక్షుడు

ప్రేక్షకుల గుండెల్లో చెరగని స్థానం



వినూత్న ప్రయోగాలతో తెలుగు ప్రజల గుండెల్లో కృష్ణ చెరగని స్థానాన్ని సంపాదించుకున్నారు. అతి కొద్ది రోజుల వ్యవధిలోనే మహేష్‌బాబు తల్లిదండ్రులను కోల్పోవడం బాధాకరం. – మంత్రి పెద్దిరెడ్డి

చిత్రసీమలో ఆయనది చెరగని ముద్ర



నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా చిత్ర సీమలో కృష్ణ తనదైన ముద్ర వేశారు. ఆయన మరణం సినీలోకానికి తీరని లోటు. – మంత్రి కారుమూరి

ఉన్నత వ్యక్తిత్వం ఆయన సొంతం



కృష్ణ ఉన్నత వ్యక్తిత్వం, విలువలు ఉన్న వ్యక్తి. నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడిన వ్యక్తి. 1989లో ఏలూరు ఎంపీగా కృష్ణ ఉన్నప్పుడు చెరుకు రైతులకు సకాలంలో పర్మిట్లు ఇప్పించారు. – మంత్రి కొట్టు సత్యనారాయణ

సినీ రంగం పెద్ద దిక్కుని కోల్పోయింది



సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు ఇది బాధాకరమైన రోజు. సినీ రంగం పెద్ద దిక్కును కోల్పోయింది. – మంత్రి ఆర్కే రోజా


ఏలూరు 20వ డివిజన్‌లో మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని


ప్రకాశం జిల్లా నాయుడుపల్లెలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మన ప్రభుత్వం


నంద్యాల జిల్లా కేఆర్‌ఆర్ తండాలో పథకాల లబ్ధిదారులతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


శ్రీకాకుళం జిల్లా కొన్నాయిపుట్టుగలో వృద్ధురాలితో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్

క్లుప్తంగా

పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం


పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఇళ్ల లబ్ధిదారులు

గోరంట్ల: శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం వానవోలు జగనన్న కాలనీలో లబ్ధిదారులు మంగళవారం జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు పెద్దఎత్తున పక్కా గృహాలను నిర్మిస్తుంటే పవన్ కళ్యాణ్ ఓర్వలేకపోతున్నారంటూ మండిపడ్డారు. ప్రభుత్వంపై బురద జల్లే చర్యలు మానుకోవాలని హితవు పలికారు.

వ్యర్థాలను నదుల్లో కలవనివ్వొద్దు..

- 'జగనన్న స్వచ్ఛ సంకల్పం' లక్ష్యం నెరవేరాలి
- మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



సాక్షి, అమరావతి: నదీ జలాల్లో వ్యర్థ పదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధికారులను ఆదేశించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం లక్ష్యం నెరవేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. మంత్రి మంగళవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమ అమలులో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఎస్టీపీల నిర్మాణ పనులు వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్లాంట్ల నిర్మాణం కోసం అవసరమైన స్థల సేకరణకు అన్ని పురపాలక సంఘాల కమిషనర్లు ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లతో సమన్వయం కావాలన్నారు. ఈ–ఆటోలు, క్లాప్ వాహనాలను సమకూర్చుకునేందుకు అవసరమైన చర్యలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నగరాల్లో ఎక్కడా డంపింగ్ యార్డులు లేకుండా చూడాలన్నారు. స్వచ్ఛాంధ్ర ఎండీ సంపత్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పవన్, బాబు తోడుదొంగలు

- పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా చేసేందుకు కుట్ర
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): జనసేన నేత పవన్ కళ్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తోడు దొంగలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. సంక్షేమ పథకాలు పేదవారికి అందకుండా చేసేందుకు ఆ ఇద్దరూ పనికట్టుకుని తిరుగుతున్నారని ఆరోపించారు. పొదలకూరులో మంగళవారం పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంపై పవన్‌కళ్యాణ్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పవన్‌కు పది పంటలను చూపిస్తామని, వాటిలో ఐదింటిని గుర్తించాలని సవాల్ విసిరారు. జగనన్న కాలనీల్లోకి వెళ్లి ఇళ్లు నిర్మించుకుంటున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. పొదలకూరులో అద్దె ఇళ్లలో ఉంటున్న పేదలకు పట్టణానికి అతి సమీపంలో కొండకింద స్థలాలు పంపిణీ చేస్తే టీడీపీ నేతలు కోర్టుకు వెళ్లిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఏమీ చేయలేరన్నారు.

బీజేపీని ఒంటరిని చేయాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీని ఒంటరిని చేయాలని సీపీఎం పేర్కొంది. బీజేపీయేతర పార్టీలను ఏకం చేసేందుకు వామపక్ష పార్టీలు చొరవ తీసుకోవాలని విజయవాడలో మంగళవారం జరిగిన సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశం అభిప్రాయపడింది. కేంద్ర విధానాలతో ధరలు పెరిగి ప్రజలపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రజా ఉద్యమాలపై కేంద్ర ప్రభుత్వ అణచివేత వైఖరిని ఖండించింది. బీజేపీని ఎదుర్కొనేందుకు ఏపీలోని బీజేపీయేతర పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలని పేర్కొంది. బీజేపీకి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఊతమిస్తున్న వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేనలు తమ వైఖరిపై పునరాలోచన చేయాలని సీపీఎం సూచించింది. అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలనే తీర్మానాన్ని ఆమోదించింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు తదితరులు హాజరయ్యారు.


వైద్య నియామకాలకు స్పెషల్ మెడికల్ బోర్డు

ప్రతిపాదనలు సిద్ధం చేసిన వైద్య ఆరోగ్య శాఖ

సాక్షి, అమరావతి: వైద్య ఆరోగ్య శాఖలో ఇప్పటికే పలు విప్లవాత్మక చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. వైద్య, ఆరోగ్య శాఖలో నియామకాల కోసం ప్రత్యేకంగా ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏపీ ఎంఎస్ఆర్‌బీ) ఏర్పాటు చేయనుంది. ఈమేరకు వైద్య ఆరోగ్య శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి మెంబర్ సెక్రటరీగా, జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారి సభ్యుడిగా బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

సీఎం ఆదేశాల మేరకు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మానవ వనరుల కొరతకు తావుండరాదని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి జగన్ 2019 నుంచి ఏకంగా 46 వేల పోస్టుల భర్తీ చేపట్టిన విషయం తెలిసిందే. వైద్య శాఖలో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేలా అత్యవసర అనుమతులు ఇచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీల గుర్తింపు, భర్తీ ప్రక్రియ నిరంతరాయంగా చేపట్టేందుకు ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 2012లో తమిళనాడు మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటైంది. ఈ బోర్డు ద్వారానే వైద్య శాఖలో నియామకాల ప్రక్రియ చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక బృందం తమిళనాడులో పర్యటించి ఇచ్చిన నివేదిక ఆధారంగా ఏపీ ఎంఎస్ఆర్‌బీ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. ఈ బోర్డు ద్వారానే వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించిన నియామకాలను చేపట్టనున్నారు.



కీలక పరిణామం

ఏపీ ఎంఎస్ఆర్‌బీ ఏర్పాటు వైద్య శాఖ చరిత్రలో కీలక పరిణామం కానుంది. ప్రభుత్వ ఆస్పత్రులను వేధిస్తున్న సమస్యల్లో మానవ వనరుల కొరతే ప్రధానం. సరిపడా వైద్యులు, వైద్య సిబ్బంది లేకపోవడం వైద్య సేవలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పెరిగిన జనాభా, రోగుల రద్దీకి అనుగుణంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బందిని సమకూర్చడం, మౌలిక సదుపాయాల కల్పనలో గత ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రులంటే నరకానికి చిరునామాగా 2019 ముందు వరకూ రాష్ట్రంలో పరిస్థితులు నెలకొన్నాయి. ఈ దుస్థితిని అరికట్టేందుకు వైద్య శాఖలో ఏకంగా రూ.16 వేల కోట్లకు పైగా నిధులతో సీఎం జగన్ నాడు–నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలు మార్చడంతో పాటు 17 కొత్త వైద్య కళాశాలలు, ఇతర సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నెలకొల్పుతున్నారు.

నిరంతర ప్రక్రియగా నియామకాలు



వైద్య ఆరోగ్య శాఖలో ఎక్కడ పోస్టు ఖాళీగా ఉన్నా వెంటనే నోటిఫై చేసి భర్తీకి చర్యలు తీసుకోవాలని, నియామకాల కోసం ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. ఈమేరకు బోర్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. వైద్య శాఖలో నియామకాలను నిరంతర ప్రక్రియగా కొనసాగించి ఎప్పటికప్పుడు ఆస్పత్రుల్లో వైద్య సిబ్బందిపై ఆడిట్ నిర్వహిస్తాం. ప్రస్తుతం వైద్య శాఖకు అవసరమైన మందులు, పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఏపీఎంఎస్ఐడీసీ ఉంది. ఇదే తరహాలో మానవ వనరుల కల్పనకు ఏపీ ఎంఎస్ఆర్‌బీ పని చేస్తుంది.

– ఎం.టి.కృష్ణబాబు, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి

పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట

ఐఐటీఎఫ్‌లో ఏపీ పెవిలియన్ ప్రారంభించిన మంత్రి బుగ్గన

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏపీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. వెనుకబడిన వర్గాలు, ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా పలు ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. మంగళవారం ప్రగతి మైదాన్‌లో ఏర్పాటు చేసిన ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ (ఐఐటీఎఫ్)లో ఏపీ పెవిలియన్‌ను ప్రారంభించిన అనంతరం మంత్రి రాజేంద్రనాథ్ మీడియాతో మాట్లాడారు. వోకల్ ఫర్ లోకల్, లోకల్ టు గ్లోబల్ థీమ్‌తో ఏర్పాటు చేసిన ఐఐటీఎఫ్‌లో ఏపీ సంప్రదాయ వస్తువులతో పెవిలియన్ నిర్వహిస్తున్నామన్నారు. హస్త కళాకారులకు ప్రోత్సాహకాలు అందించి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. నేత కార్మికుల కుటుంబాలకు ఏటా రూ.24 వేలు అందిస్తున్నామని, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వివరించారు.

రాష్ట్రంలో కొత్తగా 100 ఎకో టూరిజం ప్రాజెక్టులు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలో వంద పర్యావరణ పర్యాటక (ఎకో టూరిజం) ప్రాజెక్టులను ప్రారంభించాలని అటవీ శాఖ అధికారులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. వెలగపూడిలోని సచివాలయంలో మంగళవారం అటవీ శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రతి అటవీ శాఖ డివిజన్ పరిధిలో కనీసం 5 ఎకో టూరిజం ప్రాజెక్టులు నెలకొల్పాలని సూచించారు. విశాఖ, తిరుపతి జూలలో ప్రజలను ఆకర్షించే విధంగా కొత్త జంతువులను తీసుకురావాలని మంత్రి చెప్పారు. జగనన్న లేఅవుట్లలో నాటేందుకు మొక్కలను సమకూర్చాలన్నారు.

సబ్ స్టేషన్ల నిర్మాణంలో వేగం పెరగాలి

రాష్ట్రంలో మంజూరు చేసిన 33/11 కేవీ విద్యుత్ స్టేషన్ల నిర్మాణాలు మూడు నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి పెద్దిరెడ్డి ఆదేశించారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుంచి ఇంధనశాఖ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ ఉచిత విద్యుత్ కనెక్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని చెప్పారు. ఆక్వా జోన్ పరిధిలోని అర్హులైన రైతులకు సబ్సిడీపై విద్యుత్‌ను అందిస్తోందని తెలిపారు.

నెలాఖరులోగా ఈ–క్రాప్ రసీదుల జారీ

సాక్షి, అమరావతి: ఖరీఫ్–2022 సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్‌లో నమోదైన రైతులందరికీ ఈ నెలాఖరులోగా డిజిటల్ ఎస్ఎంఎస్‌లతో పాటు భౌతిక రసీదులు అందించాలని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ అధికారులను ఆదేశించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్న ఈ–క్రాప్ జాబితాలపై వచ్చిన ఫిర్యాదులన్నీ పరిష్కరించి తుది జాబితాలను 18 నుంచి ఆర్బీకేల్లో ప్రదర్శించాలని సూచించారు. జిల్లా, మండల వ్యవసాయ అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఖరీఫ్–21 సీజన్‌కు చెందిన పంటల బీమా పరిహారానికి సంబంధించిన సందేహాస్పద ఖాతాల వివరాలను సత్వరమే సవరించి రైతులకు సాయం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. స్పందన పోర్టల్‌లో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. 2020–21 సీజన్‌కు సంబంధించి సున్నా వడ్డీ పంట రుణాలపై వడ్డీ రాయితీతో పాటు ఖరీఫ్ 2020–21 పంటకాలంలో దెబ్బతిన్న పంటలకు పెట్టుబడి రాయితీ(ఇన్‌పుట్ సబ్సిడీ)ని ఈ నెల 29వ తేదీన జమ చేస్తున్నందున సత్వరమే వెలిడేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

పచ్చ మీడియానే బాబుకు ఊపిరి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రజిని



సాక్షి ప్రతినిధి, గుంటూరు: తన అనుకూల మీడియానే లేకపోతే రాజకీయాల్లో చంద్రబాబు అనే వ్యక్తే ఉండేవాడు కాదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని విమర్శించారు. గుంటూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మంత్రి రజిని మాట్లాడుతూ పేద ప్రజలకు మేలు జరుగుతుంటే టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు, పచ్చ మీడియా ఓర్చుకోలేకపోతున్నాయని అన్నారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగనన్న చిరస్థాయిగా వారి హృదయాల్లో నిలిచిపోతారనే అక్కసుతోనే విష ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం ఖర్చు చేసింది 11వేల కోట్ల రూపాయలే అయితే... ఏకంగా రూ.15వేల కోట్ల అవినీతి ఎక్కడి నుంచి జరుగుతుందో పవన్‌కళ్యాణ్ చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో కేవలం 1,059 మాత్రమే ఉన్న ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లను సీఎం జగన్ ఏకంగా 3,255కు పెంచారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, అనుబంధ ఆస్పత్రులను అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్ రూ.3,820 కోట్లను ఖర్చు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 10,032 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తమ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తుందని వివరించారు.

అంతా బాగున్నా అసత్యాల సేద్యమే

'ఈనాడు' కథనంలో వాస్తవాల్లేవు: వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మూడేళ్లుగా కరువు తీరా వర్షాలు కురుస్తున్నాయి. గతంలో చుక్కనీరు చూడని పెన్నాతో సహా నదులన్నీ ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఫలితంగా ఏటా సగటున అదనంగా 14 లక్షల టన్నుల దిగుబడులు మూడేళ్లుగా వస్తున్నాయంటే ఏ స్థాయిలో పంటలు సాగవుతున్నాయో అర్థంచేసుకోవచ్చు. గడిచిన ఖరీఫ్ సీజన్‌లో కూడా రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల ఉత్పత్తి నమోదవుతోందని ఓ వైపు ముందస్తు అంచనాలు చెబుతుంటే సాగు విస్తీర్ణం తగ్గడానికి వర్షాభావ పరిస్థితులే కారణమంటూ 'పొడిగట్టిన సేద్యం' శీర్షికన మంగళవారం ఈనాడులో ప్రచురించిన కథనంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కొన్నిచోట్ల అధికం.. మరికొన్నిచోట్ల సాధారణ వర్షపాతం

ఖరీఫ్–2022 సీజన్‌లో 805.7మి.మీ. వర్షపాతం కురవాల్సి ఉండగా, 800.9మి.మీ. కురిసింది. దక్షిణ కోస్తా, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాధారణ వర్షపాతం 680 మి.మీ.లు కాగా, 712మి.మీ. నమోదైంది. అనంతపురం, సత్యసాయి, కాకినాడ, విజయనగరం, బాపట్ల జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా, మిగిలిన జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.


ఉద్యాన పంటలకు సర్కారు ప్రోత్సాహం

ఇక ఖరీఫ్‌లో అన్ని పంటలు కలిపి సాధారణ విస్తీర్ణం 112.97 లక్షల ఎకరాలు కాగా, సాగైన విస్తీర్ణం 111.43 లక్షల ఎకరాలు. తగ్గిన విస్తీర్ణం కేవలం 1.54 లక్షల ఎకరాలు మాత్రమే. అదే వ్యవసాయ పంటల వరకు చూస్తే సాధారణ విస్తీర్ణం 85.32 లక్షల ఎకరాలు కాగా, 79.38 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఆ మేరకు తగ్గిన విస్తీర్ణంలో ఉద్యాన పంటలు సాగయ్యాయి. ఖరీఫ్‌లో ఉద్యానపంటల సాధారణ విస్తీర్ణం 27.64 లక్షల ఎకరాలు. కానీ, సాగైన విస్తీర్ణం 31.12 లక్షల ఎకరాలు. దాదాపు 3.48 లక్షల ఎకరాలకుపైగా పెరిగింది. మిగిలిన విస్తీర్ణంలో పట్టు తదితర పంటలు సాగయ్యాయి. ఖరీఫ్‌లోనూ ఉద్యాన పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఫలితంగా 2019–20లో 90,844 ఎకరాలు, 2020–21లో 1,42,565 ఎకరాలు, 2021–22లో 1,51,742 ఎకరాల మేర కొత్తగా ఉద్యాన పంటలు సాగులోకి వచ్చాయి. దిగుబడులు కూడా 288 లక్షల టన్నుల నుంచి 328 లక్షల టన్నులకు చేరాయి. ఖరీఫ్–2021లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 160 లక్షల టన్నులుంటే, ఖరీఫ్–2022లో 186లక్షల టన్నుల దిగుబడులు వస్తాయని ముందస్తు అంచనా వేశారు.

డ్రైస్పెల్స్ పేరుతో 'ఈనాడు' కాకిలెక్కలు

కనీసం 21రోజులపాటు వర్షపాతం నమోదు కాకపోవడాన్ని డ్రై స్పెల్ అంటారు. ఏటా సీజన్‌లో డ్రై స్పెల్స్ నమోదు కావడం సర్వసాధారణం. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే తప్ప డ్రై స్పెల్స్ వచ్చినంత మాత్రాన కరువు ఛాయలున్నట్లు కాదు. సీజన్‌లో అత్యల్ప వర్షపాతం నమోదు కావడం, పంటలు దెబ్బతినే స్థాయిలో కనీసం 2–5 వారాల పాటు తీవ్ర వర్షాభావ పరిస్థితులు (డ్రై స్పెల్) కొనసాగితే ఆ ప్రభావం పంటల దిగుబడిపై చూపుతుంది. టీడీపీ హయాంలో కరువు మండలాలు ప్రకటించని ఏడాది లేదనే చెప్పాలి. కానీ, గత మూడేళ్లుగా రాష్ట్రంలో కరువు పరిస్థితులు లేవు. వాస్తవాలిలా ఉంటే.. డ్రై స్పెల్స్ వల్లే సాగు విస్తీర్ణం తగ్గిందంటూ కాకిలెక్కలతో రైతులను గందరగోళ పరిచేలా 'ఈనాడు' ఎప్పటిలాగే ఓ కథనాన్ని వండి వార్చింది.

డ్రై స్పెల్స్ వల్ల నష్టం వాటిల్లలేదు



పొడి వాతావరణం (డ్రై స్పెల్) ఏర్పడినా ఏ విధమైన తేమ ఒత్తిడికి పంటలు గురికాలేదు. పంట నష్టం వాటిల్లలేదు. వివిధ కారణాలవల్ల తగ్గిన వ్యవసాయ పంటల స్థానంలో ఉద్యాన పంటలు సాగయ్యాయి. ప్రభుత్వ ప్రోత్సాహం వల్ల ఖరీఫ్–2022 సీజన్‌లో 3.48 లక్షల ఎకరాల్లో రైతులు ఉద్యాన పంటల వైపు మళ్లారు. రైతులను గందరగోళ పరిచేలా ఈనాడు కథనాలు ప్రచురిస్తోంది. 'పొడిగట్టిన సేద్యం' కథనంలో చేసిన ఆరోపణల్లో వాస్తవంలేదు.

– చేవూరు హరికిరణ్, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్

ద్వేషాన్ని ద్వేషంతో జయించలేం.
అది ప్రేమతో మాత్రమే సాధ్యం.
ఇదే శాశ్వత సత్యం.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, నవంబర్, 16

కనుమరుగైన నటశేఖరుడు

తెలుగు చలనచిత్ర సీమలో సాహసిగా, సూపర్ స్టార్‌గా, నటశేఖరుడిగా అత్యున్నత శిఖరాలు అధిరోహించి నాలుగున్నర దశాబ్దాలపాటు ప్రేక్షక నీరాజనాలందుకున్న సీనియర్ నటుడు కృష్ణ కన్నుమూశారు. ఆయనకు ముందూ తర్వాతా వెండితెరనేలిన నటీనటులు ఎందరో ఉన్నారు. పేరు ప్రఖ్యాతులు గడించినవారూ ఉన్నారు. కానీ సినీ పరిశ్రమలో అందరికీ తలలో నాలుకలా ఉంటూ మనసున్న మనిషిగా, మంచి వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్న విశిష్ట వ్యక్తి హీరో కృష్ణ. చిన్నతనంలో ఎన్టీఆర్, ఎస్వీ రంగారావు పోస్టర్లు చూసి, ఆ తర్వాత వారి సినిమాలు చూసి వ్యామోహంలో పడిపోయిన కుర్రాడొకడు పెరిగి పెద్దయి డిగ్రీ చదువులకెదిగినప్పుడు ప్రఖ్యాత నటుడు అక్కినేని నాగేశ్వరరావు సన్మానసభను కళ్లారా చూశాక ఇక సినిమా రంగమే తన సర్వస్వంగా భావించుకోవటం తెలుగు ప్రేక్షకుల అదృష్టం. ఆ నిర్ణయం వారికొక 'డేరింగ్ అండ్ డాషింగ్ హీరో'ను అందించింది. ఆ తర్వాత దశాబ్దాలపాటు తనదైన నటనతో, తనకే సొంతమైన సాహసాలతో తెలుగు సినీ ప్రేక్షకులను ఆయన అబ్బురపరిచారు. దేనిపైనైనా ఇష్టం కలగడం వేరు...ఆ ఇష్టాన్ని సాకారం చేసుకోవడానికి అవసరమైన కృషి, పట్టుదల కలిగి ఉండటం, లక్ష్య సాధన కోసం ఎన్ని కష్టాలకైనా సిద్ధపడటం వేరు. కృష్ణలో అవి పుష్కలంగా ఉండబట్టే అచిరకాలంలోనే తనకంటూ గుర్తింపు తెచ్చుకోగలిగారు. రెండు నట దిగ్గజాలు– ఎన్టీఆర్, ఏఎన్నార్ తమ నటనావైభవంతో వెండితెరను జిగేల్మనిపిస్తున్న కాలంలో ఇదేమంత సులభం కాదు. కానీ కృష్ణ దాన్ని సాధించారు. తనకు స్ఫూర్తినిచ్చిన ఎన్టీఆర్, ఏఎన్నార్‌లకే అనంతరకాలంలో ఆయన పోటీనిచ్చారు. నటుడిగా ఉంటూనే సినిమా రంగంలోని సమస్త విభాగాలపైనా పట్టు సాధించారు. నిర్మాతగా మారారు. దర్శకుడిగా పనిచేశారు. స్టూడియో అధినేత అయ్యారు.

ప్రేక్షకుల అభిరుచేమిటో, వారిని మెప్పించేదేమిటో తెలుసుకోవటం, మారుతున్న కాలానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవటం నటుడిగా దూసుకెళ్లటానికి దోహదపడతాయి. కృష్ణ సినీ జీవితంలో అపజయాలు లేవని కాదు. నటుడిగా ఆయన నిమ్నోన్నతాలు రెండూ చూశారు. కానీ విజయాలు సాధించినప్పుడు పొంగిపోవటం, వైఫల్యాలెదురైనప్పుడు కుంగిపోవటం కృష్ణకు అసలే పొసగనిది. అందుకే నిబ్బరంగా అడుగులేస్తూ అసాధ్యుడనిపించుకున్నారు. ప్రేక్షకులకు కావాల్సిందేమిటో గ్రహించటమే కాదు... వారికి ఎలాంటి అభిరుచులుండాలో కూడా నేర్పారు. కథల ఎంపికలో, సాంకేతికతలను కొత్త పుంతలు తొక్కించటంలో కృష్ణది ఒక విలక్షణమైన దారి. ఆ దారిలో నడవాలంటే అన్యులు భయపడేంతగా ఆ ప్రయోగాలుండేవి. యాదృచ్ఛికమే కావొచ్చుగానీ... ఆయన తొలి చిత్రం 'తేనెమనసులు' సాంఘిక చిత్రాల్లో తొలి కలర్ చిత్రం కాగా, అనంతర కాలంలో వచ్చిన 'గూఢచారి 116', 'మోసగాళ్లకు మోసగాడు', 'అల్లూరి సీతారామరాజు' వంటివి దేనికవే కొత్త ప్రయోగాలు. సినీ జగత్తులో ఏ కొత్త సాంకేతికత ప్రవేశించినా దాన్ని తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేయనిదే నిద్రపోని వ్యక్తిత్వం ఆయనది. ఆ సాంకేతికతకయ్యే వ్యయం తెలుగులో గిట్టుబాటు కాదని అందరూ అనుకునే రోజుల్లో ఆయన వెనకా ముందూ ఆలోచించకుండా వాటిని ప్రేక్షకులకు పరిచయం చేశారు. సినిమా వీక్షణను ఒక అపురూపమైన అనుభవంగా మిగిల్చారు. తొలి పూర్తి సినిమా స్కోప్, తొలి 70 ఎంఎం వంటివన్నీ కృష్ణ చేతుల మీదుగానే తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యాయి. వారిని చకితుల్ని చేశాయి. సమ్మోహన పరిచాయి. అప్పట్లో హాలీవుడ్ సినిమాలను ఏలుతున్న కౌబాయ్‌నీ, జేమ్స్‌బాండ్‌నీ మన వెండితెరకు పరిచయం చేసింది కూడా ఈ సూపర్ స్టారే. 'గూఢచారి 116'లో జేమ్స్‌బాండ్‌గా, 'మోసగాళ్లకు మోసగాడు'లో కౌబాయ్‌గా ఆయన చేసిన ఫైట్‌లూ, ఛేజింగ్‌లూ సాధారణ ప్రేక్షకులను అబ్బుర పరిచాయి. మనవాళ్లను మాత్రమే కాదు... తమిళ, మలయాళ, బెంగాలీ ప్రేక్షకులనూ కట్టిపడేశాయి. ఇంగ్లిష్, రష్యన్, స్పానిష్ భాషల్లో సైతం కొన్ని చిత్రాలు విడుదలయ్యాయి.

ఎన్టీఆర్ ఎంతో మనసుపడిన 'అల్లూరి సీతారామరాజు'ను తానే చేయాలని నిర్ణయించుకుని, దిగ్గజాలు అనుకున్నవారంతా వెనక్కిలాగుతున్నా దాన్ని తన వందవ చిత్రంగా ఎంపిక చేసుకుని కృష్ణ ఒక పెద్ద సాహసమే చేశారు. తెలుగువారి 'విప్లవజ్యోతి'ని కళ్లకు కట్టారు. దాన్ని శక్తిమంతంగా తీర్చిదిద్దారు. ఆ చిత్రం వాణిజ్యపరంగా విజయం సాధించటం కష్టమని జోస్యం చెప్పినవారంతా అది ఏకంగా 175 రోజులు ఆడటం చూసి 'ఔరా' అనక తప్పలేదు. తన సొంత చిత్రం 'అంతం కాదిది ఆరంభం' హిందీ అనువాదానికి సెన్సార్ అడ్డంకులెదురైనప్పుడు న్యాయస్థానాల్లో అవిశ్రాంతంగా పోరాడి వాటిని అధిగమించారు. మాస్ హీరోగా గుర్తింపు తెచ్చుకున్న కృష్ణ రాజకీయాల్లో సైతం తనదైన ముద్రవేశారు. లెక్కకు మిక్కిలి సాహసాలు చేసిన నటుడిగా, నిర్మాతల హీరోగా, సాధారణ సినీ కార్మిక కుటుంబాల బాగోగుల కోసం తపించిన వ్యక్తిగా కృష్ణ చిరకాలం గుర్తుండిపోతారు. ఉన్నత శిఖరాలకెదగటం, ప్రేక్షక హృదయాల్లో నిలిచిపోవటం, సంపద గడించటం సినీ రంగంలో చాలామందికి సాధ్యపడి ఉండొచ్చు. కానీ సమాజానికి ఎంతోకొంత తిరిగి అందించటం తోటి మనిషిగా తన కర్తవ్యమని ఎంచి, తన ఆలంబన అందరికీ చల్లని నీడనివ్వాలని, తన చుట్టూ ఉన్నవారంతా సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్న కృష్ణవంటివారు చాలా అరుదు. ఆ 'మనసున్న మనీషి'కి 'సాక్షి' నివాళులు.

అద్భుత ఆవిష్కరణకు ఘన గౌరవం

కరోనా మహమ్మారి కల్లోల కాలంలో ప్రపంచమంతా టీకాల కోసం ఎదురుచూపులు చూసింది. ఆ క్లిష్ట పరిస్థితుల్లో ఎన్నో దేశాలకు టీకాల సరఫరాదారుగా భారత్ నిలిచింది. అయితే, పాతికేళ్ల క్రితమే దేశ టీకాల చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖించింది శాంతా బయోటెక్ సంస్థ. సంకల్ప బలంతో, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో హెపటైటిస్–బి టీకాను ఆవిష్కరించింది. అది కూడా చవకగా అందజేసింది. దాన్ని సుసాధ్యం చేసింది... ఆ సంస్థ వ్యవస్థాపకులు, దీర్ఘదర్శి, రేపటితో 75వ వసంతంలోకి అడుగిడుతున్న 'పద్మభూషణ్' కె.ఐ. వరప్రసాద్‌రెడ్డి. ఈ నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం... దేశ ప్రగతిలో భాగస్వాములైన ప్రముఖులకు ఇచ్చే ప్రతిష్ఠాత్మక 'వై.ఎస్.రాజశేఖరరెడ్డి జీవన సాఫల్య పురస్కారం' ఆయనకు అందించింది.

సందర్భం


మాశర్మ

నేడు దేశం స్వాతంత్య్ర అమృతోత్సవాలు జరుపుకొంటోంది. పాతికేళ్ళ క్రితం స్వాతంత్య్ర స్వర్ణోత్సవాలు జరుపుకొంది. ఆ శుభవేళల్లో దేశ బయోటెక్ రంగంలో సువర్ణాక్షరాలుగా లిఖించిన తొలి అధ్యాయం పురుడు పోసుకుంది. తొట్ట తొలిగా పూర్తి స్వదేశీ వ్యాక్సిన్ రూపకల్పన జరిగిన శుభ సంరంభం అది!

సుమారు 30 ఏళ్ళ క్రితం దేశంలో హెపటైటిస్–బి అల్లకల్లోలం సృష్టిస్తోంది. ఎయిడ్స్ కంటే ప్రమాదకారిగా ప్రపంచాన్ని వణికిస్తోంది. జెనీవాలో జరుగుతున్న ఒక సమావేశానికి శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు వరప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. ఒక ప్రసంగకర్త మన దేశ సామర్థ్యంపై, మన ప్రభుత్వాల ఉదాసీనతపై, మనవారి ప్రతిభపై లోకువగా మాట్లాడారు. మనల్ని బిచ్చగాళ్ళ కింద జమకట్టారు. ఆ నిందను నిర్మూల్యం చేస్తూ అనేక దేశాలకు వ్యాక్సిన్లు పంపే మహోన్నత స్థితికి చేరుకున్నాం. హెపటైటిస్–బి వ్యాక్సిన్ స్ఫూర్తితో శాంతా బయోటెక్నిక్స్ 13 రకాల ఇతర అద్భుతమైన వ్యాక్సిన్లను సృష్టించే స్థాయికి చేరుకుంది.

లాభాపేక్ష లేకుండా అతి తక్కువ ధరలో పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాక్సిన్‌ను అందించాలన్నది శాంతా బయోటెక్నిక్స్ పెట్టుకున్న నియమం. దానిని సాధించడం ఆషామాషీ కాదు. విదేశాల నుంచి సాంకేతికతను దిగుమతి చేసుకోవడం ఖరీదైన వ్యవహారం. వరప్రసాద్‌రెడ్డి నాన్నగారు కొంత పొలం అమ్మి యిచ్చిన డబ్బుకు తోడు, బంధువులు, ఆత్మబంధువులు మరి కొంత ఇచ్చారు. అయినా అది సరిపోదు. అదిగో! అప్పుడే యూసఫ్ బిన్ అలావీ అబ్దుల్లా రూపంలో అమృత హస్తం చేయి చాచింది. అది మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చలువ. వరప్రసాద్ రెడ్డి పడుతున్న కష్టాలను గమనించిన పీవీ ఈ అబ్దుల్లాను పంపారు. అబ్దుల్లా ఒమన్ విదేశీ వ్యవహారాల మంత్రి. హెపటైటిస్–బి వ్యాక్సిన్ అవసరం తెలిసిన వ్యక్తి. తాను పెట్టుబడి పెట్టి, వ్యక్తిగత స్థాయిలో గ్యారంటీగా ఉంటూ బ్యాంక్ రుణాలు తెచ్చి, ఆ యజ్ఞంలో భాగస్వాములయ్యారు.

నిర్మాణం చేపట్టే నాటికి సుశిక్షితులైన శాస్త్రవేత్తలు లేరు. నిపుణత, సమర్థత, నిబద్ధత కలిగిన గొప్ప బృందాన్ని సమీకరించుకొని రంగంలోకి దిగింది. అనుమతులకు, అమ్మకాలకు, పంపకాలకు అడుగడుగునా అడ్డంకులే ఎదురయ్యాయి. వ్యాక్సిన్ సామర్థ్యంపై విదేశీ కంపెనీ దుష్ప్రచారం చేసింది. సత్ సంకల్పం కాబట్టి కాలమేఘాలు తొలిగిపోయాయి. శాంతా బయోటెక్ రూపొందించిన వ్యాక్సిన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. హెపటైటిస్ ఎంతో భయంకరమైన వ్యాధి. వేగంగా మనుషులను నిర్వీర్యులను చేస్తుంది. లివర్ సిరోసిస్ వచ్చి ఆరోగ్యం దెబ్బతింటుంది. కొంత మందిని శవాలుగా మార్చింది, కొంతమందిని జీవచ్ఛవాలు చేసింది. అందుకే అర్జెంటుగా వ్యాక్సిన్లు తయారు చేసి పుట్టిన ప్రతిబిడ్డకూ వాడాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఘోషించింది. అత్యవసరమే అయినప్పటికీ నాణ్యత, సమర్థతపై అన్ని పరీక్షలూ జరిగి తీరాల్సిందేనన్నది శాంతా సంస్థ పట్టుదల. అన్ని పరీక్షల్లో గెలిచి, నూటికి నూరు శాతం సంపూర్ణమైన అర్హత సంపాయించుకున్న తర్వాతే వ్యాక్సిన్లను మార్కెట్‌లో ప్రవేశపెట్టింది. అలా వరప్రసాద్ రెడ్డి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు.

ఈ ప్రయాణంలో, శాంతా సంస్థ అడుగడుగునా మానవత్వాన్ని చాటుకుంది. అది భారత్ నుంచి లాహోర్‌కు సుహృద్భావ యాత్రగా బస్సు వేసే చారిత్రక సందర్భం. ఆ బస్సు కంటే హెపటైటిస్ వ్యాక్సిన్లే మాకు ముఖ్యమని పాకిస్తాన్ వేడుకుంది. ఆ సందర్భంలో ప్రధానమంత్రి కార్యాలయం శాంతా బయోటెక్నిక్స్‌ను సంప్రదించింది.


ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా 'వైఎస్ రాజశేఖరరెడ్డి జీవన సాఫల్య పురస్కారం' అందుకుంటున్న 'శాంతా బయోటెక్' వరప్రసాద్ రెడ్డి

మానవీయ కోణంతో మిలియన్ వ్యాక్సిన్లను శాంతా సంస్థ ప్రధాన మంత్రి కార్యాలయం ద్వారా పాకిస్తాన్‌కు ఉచితంగా అందించి మానవత్వాన్ని చాటుకుంది. భారతీయ ఖ్యాతిని, ఆత్మను నిలబెట్టింది. యునిసెఫ్ విషయంలోనూ ఎంతో ఉదారాన్ని చూపించింది. యితఃపూర్వం ఒక్కొక్క వ్యాక్సిన్ 18 డాలర్లకు కొనుగోలు చేసే యునిసెఫ్‌కు కేవలం 23 సెంట్లకే అందజేసింది. 'శాంతా' చూపిన ఈ వితరణశీలత వల్ల యునిసెఫ్ ప్రపంచంలోని ఎన్నో పేద దేశాలకు ఉచితంగా హెపటైటిస్ వ్యాక్సిన్లు అందించి పుణ్యం మూట గట్టుకుంది.

శాంతా బయోటెక్నిక్స్ వేసిన తొలి అడుగు అతి పెద్దది, అతి గొప్పది. అతి తక్కువ ధరకే వ్యాకిన్ అందించిన ప్రభావంతో మార్కెట్‌లో వ్యాక్సిన్ ధరలు 40వ వంతుకు పడిపోయాయి. అనేక బహుళజాతి సంస్థలు శాంతా సంస్థవైపు చూడడం మొదలుపెట్టాయి. ఆ తర్వాత బయోటెక్ రంగంలో ఎన్నో కంపెనీలు పుట్టుకొచ్చాయి. వీటన్నిటికి స్ఫూర్తిగా నిలిచి తొలి గవాక్షం తెరిచింది మాత్రం శాంతా బయోటెక్నిక్స్ అన్నది మరువ రానిది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, కాలమిస్ట్

సందర్భం


డా‌॥ పైడిపాల

జీవితం దేవుడిచ్చిన వరం. ఆ వరాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకొని, ఆ జీవన సాఫల్యాన్ని తృప్తిగా ఆస్వాదిస్తూ, తోటివారికి తోడు పడుతూ జీవిత పరీక్షలో కృతార్థులమయ్యా మని చెప్పగల ఆత్మవిశ్వాస సంపన్నులు అరుదు. అలాంటి అరుదైన వ్యక్తులలో ఒకరు తెలుగుతేజం డాక్టర్ కోడూరి ఈశ్వర వరప్రసాద్ రెడ్డి.

జన్మనిచ్చిన తల్లిదండ్రులు శాంతమ్మ, వెంకట రమణారెడ్డి గార్లనే కాదు – అక్షర భిక్ష పెట్టిన గురువులను కూడా విస్మరించని సంస్కారవంతుడు వరప్రసాద్ రెడ్డి. మాతృమూర్తి పేరుతోనే 'శాంతా బయోటెక్'ను నెలకొల్పారు. చాగంటి వారి వ్యాఖ్యానంతో బాపు బొమ్మలతో 'మాతృ వందనం' అనే పుస్తక ప్రచురణతో పాటు, రెండు దశాబ్దాలుగా ప్రతి సంవత్సరం 'మాతృ వందనం' కార్యక్రమం జరుపుతున్నారు. కొంత మంది లబ్ధ ప్రతిష్ఠుల మాతృమూర్తులను సత్కరించడం, ఒక వేద పండితుణ్ణి సన్మానించి ఆధ్యాత్మిక ప్రవచనం ఏర్పాటు చెయ్యడం, రెండు ఆసుపత్రులలో నిత్యాన్నదానాలను నిర్వహించడం మొదలైనవి ఆయన అపారమైన మాతృభక్తికి నిదర్శనాలు. 'తల్లీ నిన్ను దలంచి', 'తండ్రీ నిన్ను దలంచి', 'తండ్రి పరమ పూజ్యుడు', 'అమ్మకు జేజే నాన్నకు జేజే గురువుకు జేజే' వంటి పుస్తకాలను వెలువరించి జననీ జనకులకు ఎంతటి ఉన్నత స్థానమివ్వాలో ఆచరణాత్మకంగా సూచించారు.

సమాజ వికాసానికి విద్య గీటురాయి అని వరప్రసాద్ విశ్వాసం. ఆ అభిప్రాయంతోనే అనేక విద్యా సంస్థలను పోషిస్తున్నారు. తను చదువుకొన్న నేలబడి మొదలుకొని కాకినాడ ఇంజనీరింగ్ కళాశాల వరకు – అన్నిటికీ భవన నిర్మాణాలకు విరాళాలనిచ్చారు. తన ఉన్నతికి కారకులైన గురువులనెందరినో సత్కరించారు. మద్రాసులోని కేసరి పాఠశాల, నటుడు మోహన్‌బాబు విద్యానికేతన్, సరస్వతీ విద్యాలయ శాఖలు... ఇలా ఎన్నో విద్యా సంస్థలకు కోట్ల కొలది రూపాయలను విరాళాలుగా ఇచ్చారు. 6 విద్యా సంస్థలలో ఉత్తమ విద్యార్థులకు ఏటేటా శాంతమ్మ గారి పేర స్వర్ణ పతకాలను బహూకరిస్తున్నారు. అబ్దుల్ కలాం సూచన మేరకు 11 లక్షల మంది విద్యార్థులను తన ఉపన్యాసాలతో ఉత్తేజితుల్ని చెయ్యడం, 'ఫోకస్' సంస్థకు బాసటగా నిలిచి యువ ఉద్యోగులకు నీతి నిజాయితీల విలువను చాటడం – విద్య పట్ల ఆయన ఆసక్తికి కొన్ని ఉదాహరణలు.

వేద పాఠశాలల నిర్మాణ నిర్వహణలకు ఆర్థిక సహాయం, వేద విద్యార్థులకు ఉపకార వేతనాలివ్వడం, 100 గంటలపాటు వేదాలను రికార్డు చేయడానికి, వేద సంబంధ పుస్తకాలను ప్రచురించడానికి చేయూతనివ్వడం – సనాతన ఆర్ష ధర్మం పట్ల ఆయన అభిమానానికి తార్కాణాలు. అనేక దేవాలయాలకు విరాళాలివ్వడమే గాక శ్రీపురం, వేదాద్రిలలోని అన్నదానాలకు భూరి విరాళాలివ్వడం ఆయన దానధర్మ నిరతికి సాక్ష్యాలు.

అనేక అనాథాశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు నిధులివ్వడం, కేన్సర్ బారినపడి చివరి మజిలీకి చేరువవుతున్న అభాగ్యులకు 'స్పర్శ' వంటి సంస్థల ద్వారా ప్రశాంతతను చేకూర్చడం ఆయన మానవతా దృష్టికి మచ్చు తునకలు. వైద్యులకు, నర్సులకు శిక్షణనిచ్చే 'పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్', కార్నియాపై పరిశోధనలకు ఊతమిచ్చిన ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి మొదలైన వైద్య సంస్థలకు సహకారం, వికలాంగులకు బధిరాంధులకు ఉపకరణాలు సమకూర్చడం అభినందనీయం.

చిన్నతనం నుండి వరప్రసాద్ రెడ్డికి సంగీత సాహిత్యాలంటే మక్కువ. శ్రావ్యమైన పాటలను బాల్యం నుంచి పదిలపరచుకొనే అలవాటున్న ఆ రస పిపాసి అనేక మ్యూజిక్ ఆల్బమ్స్‌ను రూపొందించారు. హాసం, శాంత–వసంత ట్రస్ట్ ప్రచురణలుగా శతాధిక గ్రంథాలను ప్రచురించారు. మరి కొన్నిటికి ఆర్థిక సహాయం చేశారు. మిత్రులు ఎంబీఎస్ ప్రసాద్ సంపాదకులుగా హాస్య సాహిత్యాలకు పెద్ద పీట వేస్తూ మూడేళ్లకు పైగా 'హాసం' పత్రికను నడిపారు. డా.సి. నారాయణ రెడ్డి, ముళ్లపూడి వెంకటరమణ, రావి కొండల రావు, తనికెళ్ల భరణి వంటి రచయితల రచనలతో పాటు సుమారు 50 పుస్తకాలను ప్రచురించారు. స్వయంగా 'మనసు పలికే...', 'పరిణత వాణి' వంటి పుస్తక రచనలు చేశారు.

ప్రతి మగాడి విజయం వెనుక ఓ స్త్రీ ఉంటుందన్న సామెతగా ఆయన నిస్వార్థ సేవకు సర్వదా సానుకూలంగా సహకరిస్తున్న వసంత ధర్మపత్నిగా లభించడం ఆయన అదృష్టం. 'పద్మభూషణ్' నుంచి తాజాగా వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం వరకు వందల పురస్కారాలు అందుకొన్న వరప్రసాద్ సార్థక నామధేయులు.

వ్యాసకర్త రచయిత, సినీ పరిశోధకుడు
(రేపు డా॥ వరప్రసాద్ రెడ్డి 75వ జన్మదినోత్సవం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, **తిథి:** బ.అష్టమి తె.4.10 వరకు (తెల్లవారితే గురువారం) తదుపరి నవమి, **నక్షత్రం:** ఆశ్లేష సా.4.31 వరకు తదుపరి మఖ, **వర్జ్యం:** తె.5.36 నుండి 7.21 వరకు (తెల్లవారితే గురువారం), **దుర్ముహూర్తం:** ప.11.21 నుండి 12.06 వరకు **అమృతఘడియలు:** ప.2.46 నుండి 4.31 వరకు.

సూర్యోదయం : 6.09
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

బాధాకరం



లెజెండరీ నటుడు, సూపర్ స్టార్ కృష్ణ గారు మరి లేరని వినడం ఎంతో బాధ కలిగించింది. మహేశ్‌బాబు, ఆయన కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే శక్తి రావాలని ప్రార్థిస్తున్నా.

– సిమ్రన్ బగ్గా, నటి

నివాళి



మీ ఆత్మకు శాంతి కలగాలి కృష్ణ గారు. మిమ్మల్ని మిస్ అవుతున్నాం.

– మహమ్మద్ కైఫ్, క్రికెటర్

చాయ్ చరిత్ర



మీ దేశానికి సముద్రం నుంచి వ్యాపించి వుంటే దాన్ని మీరు టీ అంటారు. భూమి మీదుగా వచ్చి వుంటే దాన్ని చాయ్ అంటారు. ఎందుకంటే, ఫ్యూజియన్ (చైనా), తైవాన్ రేవుల్లోని తీరప్రాంత ఉచ్చారణలో 'టె' అంటారు. మాండరిన్‌లో 'చా' అని వాడతారు.

– డేనియల్ హాలండ్, విశ్లేషకుడు

నలుగురు తాత్వికులు



భారత్‌లో జన్మించినవారిలో అత్యంత ప్రభావవంతమైన నలుగురు తత్వవేత్తలు... వాళ్లకు ఉన్న సహజ లక్షణం, వారి సంకల్పాన్ని చాటడానికి వారు ఆశ్రమాలను నెలకొల్పడమో, వాటిని వేదికగా మలుచుకోవడమో చేశారు. బుద్ధుడు–జేతవనం, ఆదిశంకరుడు – నాలుగు మఠాలు, బోధిధర్మ– షావోలిన్, వివేకానందుడు – రామకృష్ణ మఠం.

– జోసెఫ్ టి నూనీ, రచయిత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

వికేంద్రీకరణ 'శ్రీబాగ్'లోనే ఉంది

మద్రాసు నగరంలోని స్వాతంత్య్ర సమర యోధుడు కాశీనాథుని నాగేశ్వరరావు నివాస గృహం పేరే 'శ్రీ బాగ్.' ఆ భవనంలో 1937 నవంబర్ 16న ఆంధ్ర, రాయలసీమ నాయకుల మధ్య ఒప్పందం జరిగింది. అదే 'శ్రీ బాగ్ ఒప్పందం'గా జన వ్యవహారంలో నిలిచిపోయింది. ఈ ఒప్పందం ప్రకారం...

1. విశ్వవిద్యాలయం, రాజధాని, హైకోర్టు ఒకచోట కేంద్రీకృతం కాకుండా విశ్వవిద్యాలయం విశాఖపట్నంలో అలాగే ఉంచి... హైకోర్టు, రాజధానిలలో ఏది కావాలో కోరుకొనే అవకాశం సీమవాసులకు ఇవ్వాలి. 2. కృష్ణ, తుంగభద్ర, పెన్నానదీ జలాల వినియోగంలో రాయలసీమ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. 3. అనంతపురంలోనూ ఆంధ్ర విశ్వవిద్యాలయ కేంద్రం ఉంచాలి. 4. శాసన సభలో జనరల్ స్థానాలు జిల్లాల వారీగా సమాన నిష్పత్తిలో ఉండాలని నిర్ణయించారు.

ఈ విధంగా 1937 నాడే ఆంధ్ర – రాయలసీమ పెద్దలు పాలనా, అభివృద్ధి వికేంద్రీకరణకు తొలి అడుగు వేశారు. ఈ ఒప్పందంపై నమ్మకంతోనే ఆంధ్రరాష్ట్రం సాధనలో సీమవాసులు ముందుండి పోరాడారు. 1952లో సిద్ధేశ్వరం అలుగు శంఖు స్థాపన చేస్తామని ముందుకొచ్చిన ఉమ్మడి మద్రాసు ప్రభుత్వ ఆఫర్‌ను కూడా కాదనుకొని నిలిచారు. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. కర్నూలులో రాజధాని, గుంటూరులో హైకోర్టు ఏర్పడినాయి. మూడేళ్ళకే 1956లో కర్నూలు రాజధాని హైదరాబాదు చేరింది. సీమలోని సిద్ధేశ్వరంను వదిలేసి నాగార్జున సాగర్ నిర్మాణం చేపట్టారు. శ్రీ బాగ్ ఒప్పందం అటకెక్కింది.

దశాబ్దాల తర్వాత తెలంగాణ విడిపోయింది. శ్రీబాగ్ ఒప్పందం పునాదిగా 1953 నాటి ఆంధ్ర రాష్ట్రమే మనముందు ఇప్పుడు నిలిచింది. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల వారూ శ్రీ బాగ్ సాక్షిగా వికేంద్రీకరణ స్ఫూర్తిని చాటాలి. కేవలం పాలనా రంగంలోనే కాక జలవికేంద్రీకరణ, అభివృద్ధి వికేంద్రీకరణల కోసం అడుగు ముందుకు వేయాలి.

– డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, అనంతపురం
(నేడు శ్రీ బాగ్ ఒప్పందం జరిగిన రోజు)


పేదల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయద్దు

అభిప్రాయం


కైలే అనిల్ కుమార్

పేదలందరికీ ఇళ్ల నిర్మించి ఇవ్వడం అంటే కేవలం వారు తలదాచుకోవడానికి గూడు కల్పించడమే కాదు... సమాజంలో సగౌరవంగా తలెత్తుకు బతికే ఆత్మవిశ్వాసాన్ని కూడా కల్పించడమే. అందుకే సొంత ఇల్లు పేదల ఆత్మగౌరవ సూచిక. పేద, బడుగు, బలహీన వర్గాలకు ఇంటిస్థలం కాగితం చేతికివ్వడం అంటే ఆత్మగౌరవ పతాకాన్ని వారి చేతికిచ్చినట్లే. ప్రభుత్వం రాష్ట్రంలో 31 లక్షల మంది మహిళల పేరిట ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లను నిర్మింపజేస్తోంది. ఇదంతా ఉచితమే. పేదల మీద భారం లేకుండా సొంత ఇంటి కలను నిజం చేసే బాధ్యతను ముఖ్యమంత్రి జగన్ తీసుకున్నారు. ఫలితంగా 31 లక్షల కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించింది.

రాష్ట్రంలోని ఏ ప్రాంతానికి వెళ్లి చూసినా... ప్రభుత్వం కల్పించే మౌలిక వసతుల వ్యయం కలిపితే ఇంటి స్థలం, ఇల్లు ఖరీదు రూ. 5 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు ఉంటుంది. పట్టణాలుగా రూపుదిద్దుకోనున్న 17 వేల 'జగనన్న కాలనీ'లలో ఇళ్ల ఖరీదు మనం చూస్తుండగానే రెట్టింపు కావడం తథ్యం. ఒక పేద కుటుంబం అన్ని సంక్షేమ పథకాలనూ అందుకుంటూ సొంత ఇంట్లో ఉంటే... మెరుగైన జీవితం వారికి తప్పకుండా దక్కుతుంది. ఆయా కుటుంబాల అభ్యున్నతికి బాటలు పడతాయి. దశాబ్దం తిరిగే సరికి... సమాజంలో గణనీయమైన మార్పును మనం చూస్తాం. అభివృద్ధికి నిర్వచనం... నేటి కంటే రేపు బాగుండటం అని ముఖ్యమంత్రి పదేపదే చెబుతుంటారు. దానికి సాక్ష్యంగా 'వైఎస్సార్ జగనన్న' కాలనీలు సగర్వంగా తలెత్తుకుని నిలబడతాయి. పేదల ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవ సూచీలుగా నిలిచే జగనన్న కాలనీలు... మహిళా సాధికారతకు శాశ్వత చిరునామా కానున్నాయి. 31 లక్షల ఇళ్ల పట్టాలు మహిళల పేరిటే ప్రభుత్వం ఇవ్వడం ముఖ్యమంత్రి ముందుచూపునకు నిదర్శనం. స్త్రీ ఆలోచనకు



అనుగుణంగా నడిస్తే ఆ కుటుంబాలు తప్పకుండా బాగుపడతాయి. బాగుపడ్డ కుటుంబాల సమాహారంగా జగనన్న కాలనీలు రూపుదిద్దుకోనున్నాయి.

రాష్ట్రంలో ప్రతి నలుగురిలో ఒకరు వైఎస్సార్ జగనన్న కాలనీవాసి కానున్నారు. ఒక్కో ఇంట్లో నలుగురు సభ్యులు ఉంటారనుకున్నా... కోటీ పాతిక లక్షల మంది ఈ కాలనీల్లో నివసిస్తారు. రాష్ట్ర జనాభాలో నాలుగోవంతు మందికి ఆవాసం కల్పించే కాలనీలకు సకల సౌకర్యాల కల్పన బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంది. పేరుమోసిన రియల్ ఎస్టేట్ సంస్థల వెంచర్లలో కూడా కల్పించలేనన్ని మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోంది. సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా పైపులైన్లు, భూగర్భ డ్రెయినేజీ, అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్లు అన్ని కాలనీల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఇంటర్నెట్ సదుపాయం కల్పించడానికీ భూగర్భ కేబుళ్లు వేస్తున్నారు. పేదలకు 'క్వాలిటీ లైఫ్' అందించడానికి ప్రభుత్వం చేపట్టిన మహాయజ్ఞం ఇది.

పేదలు ఆత్మగౌరవంతో జీవిస్తూ అభివృద్ధి పథంలో అడుగులు వేయడానికి రంగం సిద్ధమవుతున్న తరుణంలో... వాస్తవాలు గ్రహించకుండా, రాజకీయాల కోసం పేదల ఇళ్ల నిర్మాణాన్ని వాడుకోవడం సమంజసం కాదని పవన్ కల్యాణ్ గ్రహించాలి. ఆత్మగౌరవంతో జీవించడానికి తొలి అడుగు పడుతున్న సమయంలో పేదల ఆత్మవిశ్వాసాన్ని రాజకీయాల కోసం దెబ్బతీస్తే భవిష్యత్ తరం ఆయన్ని క్షమించదు. ఇంటిని కేవలం ఇటుకలు, సిమెంట్‌తో నిర్మితమైన ఓ కట్టడంగా మాత్రమే కాకుండా... పేదల జీవితంగా పవన్ గుర్తించాలి. నిరుపేదల జీవితాలను రాజకీయం చేయడం వల్ల నష్టపోయేది పేదలే కాదు... పవన్ కూడా. నిర్మాణాత్మకంగా వ్యవహరించే ఆలోచన ఆయనకు ఉంటే... బడుగుల జీవితాలు బాగుపడుతున్న తీరును అభినందించాలి. పేదల ఆత్మగౌరవానికి భంగం కలిగించవద్దని వినయంగా మనవి చేస్తున్నా.

వ్యాసకర్త ఎమ్మెల్యే; పామర్రు, కృష్ణా జిల్లా
మొబైల్: 99494 18777

భక్త పరాధీనత

భగవంతుడు దేనికీ కట్టుబడడుగానీ ఒక్క భక్తికి మాత్రం కట్టుబడుతాడట. తననే నమ్ముకున్న భక్తులు ఎటువంటి కష్టాల్లో ఉన్నా, వాళ్లను ఆ కష్టాల్లోంచి బైట పడేస్తాడుట. భక్తులు అతడిని భక్త పరాధీనుడనీ, ఆర్త త్రాణ పరాయణుడు అనీ కీర్తించేది అందుకే. ఈ లక్షణాలు భగవంతునికి ఉన్న కల్యాణ గుణాలు. భాగవతుల జీవితాల్లో ఇందుకు తార్కాణాలు కనిపిస్తాయి.

రాముడూ, లక్ష్మణుడూ, వానర సైన్యమూ లంక దరిదాపుల్లోకి చేరుకున్నారు. అప్పటికే చీకటి పడుతోంది. మర్నాడు పొద్దున్నే యుద్ధం. అందుకని వానర సైన్యం రామలక్ష్మణులతో... ''మహాత్ములారా, మీరు ముందుండి రేపు మాచేత యుద్ధం చేయించాల్సినవారు. అందుకని ఈ రాత్రికి మీరు విశ్రాంతి తీసుకోండి. భోంచేసి బాగా నిద్రపోండి. రాక్షసుల నుండి మీకు ఏ ఆపదా రాకుండా వంతుల వారీగా మేం రాత్రల్లా మేల్కొని కాపలా ఉంటాం'' అని చెప్పింది. రామలక్ష్మణులు సరే అన్నారు. పడుకోవటానికి పక్కలూ అన్నీ సరిజేసుకున్నారు. వానరులు చుట్టూ తిరుగుతూ పహారా కాస్తున్నారు. పదకొండూ పన్నెండు దాటింది. సముద్రం మీంచి చల్లటి గాలి వీస్తోంది. పైగా, పైన వెన్నెల. రోజల్లా రాళ్ళు, కొమ్మల వంతెన మీద నడుస్తూ వచ్చారేమో, అలసట అధికంగా ఉంది. ఎంత ఆపినా, నిద్ర ఆగటం లేదు. వాళ్లకు తెలియకుండా నిద్ర పట్టేసింది. తెల్లారి చూస్తే పరిస్థితి ఎలా ఉంది? వానరులంతా నిద్రపోయి ఉన్నారు. రామలక్ష్మణులు ధనుర్బాణాలు ధరించి వాళ్లను రక్షిస్తూ చుట్టూ తిరుగుతున్నారు.

జ్యోతిర్మయం

భగవద్గీతలో భగవంతుడు 'అనన్యాశ్చింత యంతో మాం యే జనాః పర్యుపాసతే, తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం' అంటాడు. ''ఎవరైతే నన్నే చింతిస్తూ, నన్నే ఉపాసిస్తారో అట్టివారి యోగ క్షేమాల బాధ్యత నేను వహిస్తాను'' అని దీని అర్థం. అట్లా అని చెప్పి భగవంతుడు శరణాగతత్రాత బిరుదాంకితుడు అయినాడు.

– దీవి సుబ్బారావు

వ్యవసాయ బావిలో పడిన ఏనుగు



బంగారుపాళెం: వ్యవసాయ బావిలో ఏనుగు పడిన ఘటన సోమవారం రాత్రి చిత్తూరు జిల్లా బంగారుపాళెం మండలంలోని గాండ్లపల్లె వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... పలమనేరు రేంజ్ టేకుమంద బీట్ పరిధిలోని గాండ్లపల్లె సమీపంలోని కౌండిన్య అటవీ ప్రాంతం నుంచి సుమారు 15 ఏనుగులు గుంపుగా వ్యవసాయ పొలాలపైకి వచ్చాయి. స్థానికులు కేకలు వేయడంతో అటవీ ప్రాంతంలోకి వెళ్లాయి. వాటిని అనుసరిస్తూ వెళ్లిన ఓ ఏనుగు జగన్నాథనాయుడుకు చెందిన వ్యవసాయ బావిలో పడింది. మంగళవారం ఉదయం రైతులు, గ్రామస్తులు గుర్తించి అటవీశాఖ, పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పలమనేరు అటవీశాఖ రేంజ్ అధికారి నయిమ్‌ఆలీ, బంగారుపాళెం సీఐ నరసింహారెడ్డి, ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి, రెస్క్యూ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుంది. జిల్లా ఫారెస్టు అధికారి చైతన్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జేసీబీ సాయంతో బావి పక్కన గొయ్యి తీశారు. దాన్ని ఆసరాగా తీసుకున్న ఏనుగు బయటకు వచ్చి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ ప్రతి ఏటా ఏనుగులు సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు కౌండిన్య అటవీ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుంటాయని, ఆ తర్వాత తమిళనాడు అటవీ ప్రాంతంలోకి వెళ్తాయన్నారు.

రాష్ట్రంలో గంజాయికి అడ్డుకట్ట

ఎర్రచందనం అక్రమ రవాణా నియంత్రణకూ గట్టి చర్యలు

- త్వరలో తిరుపతిలో పక్క రాష్ట్రాలతో సమన్వయ సమావేశం
- రాష్ట్రంలో 1.32 లక్షల కిలోల గంజాయి స్వాధీనం.. 1,599 కేసులు
- ఏడాదిలోగా 6,500 సిబ్బంది నియామకానికి అవకాశం
- ఎస్పీ, సీపీలకు కేసుల విచారణ బాధ్యత.. దోషులకు వేగంగా శిక్షలు
- రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

దొండపర్తి (విశాఖ దక్షిణ): రాష్ట్రంలో గంజాయి, ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పారు. ఇందులో భాగంగా త్వరలోనే పొరుగు రాష్ట్రాల అధికారులతో తిరుపతిలో సమన్వయ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గంజాయి కట్టడిపై పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో దృష్టి సారించిందని చెప్పారు. ఈ ఏడాది 1.32 లక్షల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, 1,599 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నిందితులు 12 రాష్ట్రాలకు చెందిన వారని, వారందరినీ త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. సైబర్ కేసులను ఛేదించడానికి అధికారులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. రాష్ట్రంలో పోలీసు సిబ్బంది కొరతను అధిగమించేందుకు ఏడాదిలోగా 6,500 మంది నియామకానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

లోక్ అదాలత్ ద్వారా 47 వేల కేసులు పరిష్కారం

రాష్ట్ర వ్యాప్తంగా లోక్ అదాలత్ ద్వారా 47 వేల కేసులు పరిష్కారమయ్యాయని, వీటిలో పెండింగ్‌తో పాటు విచారణలో ఉన్న 36 వేలు ఐపీసీ కేసులు ఉన్నాయన్నారు. లక్ష వరకు పెట్టీ కేసులను కూడా పరిష్కరించినట్లు చెప్పారు. న్యాయ వ్యవస్థతో సమన్వయం చేస్తూ ఒకే లోక్ అదాలత్‌లో ఇంత పెద్ద సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేసిన రాష్ట్రంలోని పోలీస్ అధికారులను, సిబ్బందిని అభినందించారు.

దోషులకు సత్వరమే శిక్ష పడేలా సమగ్ర విచారణ

దోషులకు సత్వరమే శిక్ష పడేలా నేర నిరూపణలో వేగవంతమైన, సమగ్ర దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం స్వయంగా ఎస్పీలే నాలుగైదు పెండింగ్ కేసులు పర్యవేక్షించేలా ఆదేశించామని, దీని వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. ప్రధానంగా విశాఖ నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ పర్యవేక్షణలో దిశ స్టేషన్‌లో నమోదైన మైనర్ బాలికపై అత్యాచార కేసులో నిందితుడికి 20 ఏళ్ల శిక్ష పడేలా చేశారని తెలిపారు. ఇదే తరహాలో రాష్ట్రంలో మరో రెండు నెలల్లో 120 కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశాఖలో ప్రధాని మోదీ పర్యటన విజయవంతానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని డీజీపీ అభినందించారు. విశాఖలో నేరాలు అదుపులో ఉన్నాయని చెప్పారు. హత్యలు, అత్యాచారాలు, రోడ్డు ప్రమాదాలు తగ్గాయని వివరించారు. ఈ సమావేశంలో, విశాఖ డీఐజీ హరికృష్ణ, విశాఖ నగర సీపీ సీహెచ్ శ్రీకాంత్, డీసీపీ (లా అండ్ ఆర్డర్) సుమిత్ సునీల్ గరుడ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలై కుమార్‌కు 'శ్రేష్ట దివ్యాంగజన్' జాతీయ అవార్డు

గతంలోనూ పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు



సుబ్బయ్య తిరుమలై కుమార్

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): 'శ్రేష్ట దివ్యాంగజన్' జాతీయ అవార్డుకు విజయవాడ రైల్వే డివిజన్ కమర్షియల్ విభాగంలో బుకింగ్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సుబ్బయ్య తిరుమలై కుమార్ ఎంపికయ్యారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ వికలాంగుల సాధికార విభాగంలో 2021 సంవత్సరానికి గానూ అందించే ఈ అవార్డును డిసెంబర్ 3న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఆయన అందుకోనున్నారు.

అంతర్జాతీయ, జాతీయ అవార్డులు

సుబ్బయ్య తిరుమలై కుమార్ పారా స్పోర్ట్స్‌లో పలు అంతర్జాతీయ, జాతీయస్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. అంతర్జాతీయ స్థాయిలో ఆసియా పారా గేమ్స్‌లో 6 సార్లు, కామన్ వరల్డ్ వెల్త్ గేమ్స్, ప్రపంచ గేమ్స్‌లో 2 సార్లు, ఐపీసీ వరల్డ్ పారా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ స్విమ్మింగ్, అథ్లెటిక్, ఆర్చరీ ఈవెంట్‌లో పాల్గొని 11 బంగారు, 5 వెండి, 4 కాంస్య పతకాలు, జాతీయస్థాయిలో 28 బంగారు, 7 వెండి, 4 కాంస్య పతకాలు సాధించారు.

3 నెమళ్ల మృత్యువాత

రామకుప్పం (చిత్తూరు): విద్యుత్ షాక్ తో మూడు నెమళ్లు మృత్యువాత పడిన ఘటన చిత్తూరు జిల్లా రామకుప్పం మండలంలోని అత్తికుప్పం వీరాశి చెరువు వద్ద మంగళవారం వెలుగుచూసింది. నెమళ్లు విద్యుత్ స్తంభం ఎక్కిన సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. రెండు స్తంభంపైనే పడిపోగా, ఒకటి మాత్రం కిందపడి ఉంది.

ముగ్గురు కార్మికుల దుర్మరణం

- విజన్ డ్రగ్స్ ఫ్యాక్టరీలో పేలుడు
- ఒక్కొక్కరికీ రూ.22.50 లక్షల పరిహారం



ప్రమాదం జరిగరిన విజన్ డ్రగ్స్ ఫ్యాక్టరీ

దేవరపల్లి/కొవ్వూరు: తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నం పంచాయతీ పరిధిలోని కొండగూడెం వద్ద గల విజన్ డ్రగ్స్ ఫ్యాక్టరీలో మంగళవారం జరిగిన ఘోర ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళితే.. మంగళవారం ఉదయం 11.40 గంటల సమయంలో విజన్ డ్రగ్స్ ఫ్యాక్టరీలోని కాలమ్ మిక్సిన్ యూనిట్ చాంబరు వద్ద పనులు నిర్వహిస్తుండగా.. అది పేలిపోయి ఈ ఘోర ప్రమాదం సంభవించింది. ఘటనలో దేవరపల్లి మండలం గౌరీపట్నంకు చెందిన కెమిస్ట్ ఆండ్రు వీరవెంకటసత్యనారాయణ (45) త్యాజంపూడికి చెందిన సూపర్‌వైజర్ వెంగళ రత్నబాబు (35), చాగల్లుకు చెందిన డిప్యూటీ మేనేజరు దొంగా మహీధర్ అలియాస్ ముసలియ్య (35) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ముగ్గురూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియవలసి ఉంది. జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, జిల్లా జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, కొవ్వూరు ఆర్డీవో ఎస్. మల్లిబాబు, చీఫ్ అగ్నిమాపక అధికారి కె.రాముడు ఫ్యాక్టరీని సందర్శించి, ప్రమాదం జరిగిన కాలమ్ యూనిట్ చాంబర్‌ను పరిశీలించారు.

కుటుంబానికి రూ.22.50 లక్షలు పరిహారం

ప్రమాదంలో మృతి చెందిన ఒక్కొక్క కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.20 లక్షలు, ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.2.50 లక్షలు పరిహారం అందజేస్తాయని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రకటించారు. చట్ట పరంగా వచ్చే పీఎఫ్ రూ.6 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఫ్యాక్టరీలో ఉద్యోగం, ఇల్లు లేని కుటుంబానికి ఇళ్ల మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. కాగా, ఆస్పత్రి మార్చురీలో హోం మంత్రి తానేటి వనిత మృతదేహాలను పరిశీలించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

శ్రీవారి సర్వ దర్శనానికి 36 గంటలు



ఆలయం వెలుపల మంత్రి ధర్మాన

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. 31 క్యూ కంపార్ట్‌మెంట్‌లు నిండాయి. సర్వ దర్శన టోకెన్లు లేనివారికి 36 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటలు పడుతోంది. సోమవారం అర్ధరాత్రి వరకు 69,814 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 29,228 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.4.17 కోట్లు వేశారు. మరోవైపు తిరుమలలో చలి తీవ్రత బాగా పెరిగింది.

స్వామి సేవలో ప్రముఖులు

శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ గురుమూర్తి, తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కన్నడ నటుడు గణేశన్ ఉన్నారు.

గిరిజనుల గుండె చప్పుడు సీఎం జగన్

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర
- గిరిజన సంస్కృతి, సంప్రదాయాలతో హోరెత్తిన సాగరతీరం



విల్లు ఎక్కుపెట్టిన ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర

బీచ్ రోడ్డు (విశాఖ తూర్పు): దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా గిరిజనుల అభివృద్ధి కోసం అనేక పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తూ వారి గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించారని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ బిర్సా ముండా జయంతి సందర్భంగా మంగళవారం విశాఖలో గిరిజన గౌరవ దిన వారోత్సవాలను రాజన్నదొర ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజనులకు 2 లక్షల పుడక భూములను పంపిణీ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గిరిజన నాయకులు, సమరయోధుల గురించి, గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాల గురించి ప్రపంచానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతకుముందు గిరిజన కార్నివాల్‌ను ఉపముఖ్యమంత్రి ప్రారంభించారు. తమ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నృత్యాలు చేస్తూ సాగరతీరాన్ని హోరెత్తించారు. గిరిజన కళాకారులతో రాజన్నదొర నృత్యం చేసి ఆకట్టుకున్నారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన గిరిజన స్టాల్స్ అలరించాయి. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, భాగ్యలక్ష్మి, కళావతి, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి పాల్గొన్నారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుచానూరు: శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి చేపట్టారు. అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామాగ్రి తదితరాలను నీటితో శుద్ధి చేశారు. ఆ తర్వాత నామకోపు, శ్రీచూర్ణంతో పాటు పలు సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ఈ నెల 20 నుంచి 28 వరకు జరుగనున్నాయి. ఇందుకోసం ఈనెల 19న లక్ష కుంకుమార్చన, అంకురార్పణ నిర్వహిస్తారు.

ఓపియాయిడ్ మందుల విక్రయంపై వాల్‌మార్ట్ సయోధ్య

బెంటన్‌విల్లె: అమెరికాలో తమ గొలుసుకట్టు మందుల దుకాణా ల్లో విక్రయించిన అధిక డోసుల ఓపియాయిడ్ ఔషధ విక్రయాలపై దాఖలైన ఫిర్యాదులపై సయోధ్యకు దిగ్గజ రిటైల్ సంస్థ వాల్‌మార్ట్ ముందుకు వచ్చింది. ఈ కేసుల పరిష్కారానికి రూ.25 వేల కోట్లు చెల్లిస్తామంటూ ప్రతిపాదించింది. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్లలో ఉన్న విధంగానే నొప్పి నివారణకు వాడే ఈ ఔషధాలను దుకాణాలు విక్రయించాయి. అయితే, అధిక డోసుల కారణంగా రోగులు కొందరు చనిపోయారు. దీనిపై రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు వాల్‌మార్ట్‌పై దావాలు వేశాయి. ఇలాంటి కేసులనే ఎదుర్కొంటున్న సీవీఎస్ హెల్త్, వాల్‌గ్రీన్ కంపెనీలు కూడా రూ.40 వేల కోట్లు చెల్లించి రాజీ కుదుర్చుకునేందుకు ప్రతిపాదించాయి.

క్లుప్తంగా...

40 మందితో కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ల జాబితా

సాక్షి, న్యూఢిల్లీ: గుజరాత్ ఎన్నికల నేపథ్యంలో అధికార బీజేపీని ధీటుగా ఎదుర్కొనేందుకు, ప్రచార పర్వాన్ని నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. ఇందులో భాగంగా తొలిదశ ఎన్నికల్లో ప్రచారం చేసేందుకు స్టార్ క్యాంపెయినర్లను బరిలో దింపనుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు పార్టీ మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా, సీఎంలు అశోక్ గెహ్లాట్, భూపేష్ భగేల్, నేతలు సచిన్ పైలట్, కమల్‌నాథ్‌తోపాటు, ఏపీకి చెందిన నేత, ఏఐసీసీ కార్యదర్శి ఉషా నాయుడు ఉన్నారు.

గుజరాత్‌లో పాత రికార్డుల్ని బద్దలు కొడతాం: అమిత్ షా

అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పాత రికార్డులన్నీ బద్దలు కొట్టి విజయ దుందుభి మోగిస్తుందని కేంద్ర మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. అత్యధిక సీట్లు, ఓట్లతో మరోసారి తమ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమన్నారు. సదానంద అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కనుభాయ్ పటేల్ మంగళవారం వేసిన నామినేషన్‌కు అమిత్ షా ఆయన వెంట వచ్చారు. భూపేంద్ర పటేల్‌ను మళ్లీ సీఎంను చేస్తామని చెప్పారు.

జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌కు బెయిల్

న్యూఢిల్లీ: ఆర్థిక నేరగాడు సుకేష్ చంద్రశేఖర్ ప్రమేయమున్న రూ.200 కోట్ల మనీ లాండరింగ్ కేసులో బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌కు ఊరట లభించింది. ఢిల్లీ కోర్టు మంగళవారం ఆమెకు బెయిల్ మంజూరు చేసింది. రూ.50 వేల వ్యక్తిగత పూచీకత్తు కింద ప్రత్యేక న్యాయమూర్తి శైలేంద్ర మాలిక్ జాక్వెలిన్‌కు బెయిల్ మంజూరు చేశారు. ఈ కేసులో ఈడీ అనుబంధ చార్జిషీటులో ఆమెపై మొదటిసారిగా అభియోగాలు నమోదయ్యాయి. సుకేష్ నుంచి జాక్వెలిన్ ఖరీదైన బహుమతులు అందుకున్నారని ఆరోపణలున్నాయి.

రైళ్లలో ఇక స్థానిక ఆహారం

న్యూఢిల్లీ: రైళ్లలో ప్రయాణికులకు ఇకపై స్థానిక, ప్రాంతీయ ఆహారం కూడా అందుబాటులోకి రానుంది. ఈ మేరకు ఇండియన్ రైల్వే కేటరింగ్, టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ)కి రైల్వే బోర్డు అనుమతి మంజూరు చేసింది. అలాగే మధుమేహ వ్యాధిగ్రస్తులకు, చిన్నారులకు, ఆరోగ్యపరంగా ప్రత్యేక అవసరాలు ఉన్నవారికి తగిన ఆహారం అందజేయాలని సూచించింది. తృణధాన్యాలతో తయారు చేసిన ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంది. రైళ్లలో కేటరింగ్ సేవలను మరింత మెరుగుపర్చడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వేబోర్డు తెలియజేసింది.

అమెరికా కంపెనీగా నమ్మించి మోసం

వాషింగ్టన్: అమెరికాలో స్థాపించిన కంపెనీ అంటూ ప్రచారం చేసుకున్న పుష్‌వుడ్ అనే సంస్థ అక్కడి అధికారులను మోసగించినట్లు తేలింది. వాస్తవానికి ఈ కంపెనీ రష్యాలోని సైబీరియా కేంద్రంగా పనిచేస్తున్నట్లు వెల్లడయ్యింది. పుష్‌వుడ్ కంపెనీ అమెరికాలో సైన్యంతోపాటు పలు కీలక సంస్థలకు సాఫ్ట్‌వేర్‌ను సరఫరా చేస్తోంది. గూగుల్, యాపిల్ ప్లేస్టోర్లలో ఉన్న వందలాది యాప్‌లలో పుష్‌వుడ్ సాఫ్ట్‌వేర్ ఉపయోగించారు. తమ రష్యా మూలాలను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించలేదని పుష్‌వుడ్ వ్యవస్థాపకుడు మ్యాక్స్ కోనోవ్ చెప్పారు.

రాష్ట్రాల వాటా ఇవ్వలేకపోతే జీఎస్టీ రద్దు చేయండి : మమత

జార్గమ్ (పశ్చిమ బెంగాల్): వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అంశంలో కేంద్ర ప్రభుత్వంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాల్సిన పన్నుల వాటాలు ఇవ్వలేకపోతే కేంద్రం జీఎస్టీనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలు తమకు న్యాయంగా రావాల్సిన డబ్బుల్ని బిచ్చంగా అడగాలా అని మమత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆదివాసీల ప్రాబల్యమున్న బేల్‌ఫారి ప్రాంతంలో మంగళవారం ఒక ర్యాలీనుద్దేశించి మాట్లాడిన మమత రాష్ట్రాలకు ఇవ్వాల్సిన బకాయిలు సక్రమంగా చెల్లిస్తారా లేదంటే గద్దె దిగిపోతారా అని ప్రశ్నించారు. గ్రామీణ ఉపాధి పథకం నిధులు విడుదల చేయలేకపోతే అధికారాన్ని వదులుకోవాలని మమత అన్నారు.


జార్గమ్‌లో ఆలూ బజ్జీలు వేస్తున్న మమత

బంధం బలోపేతం

ఇండో-యూఎస్ సంబంధాలపై మోదీ • జీ 20 సదస్సులో బైడెన్‌తో సుదీర్ఘ చర్చలు
చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో షేక్‌హ్యాండ్ • పలువురు దేశాధినేతలతో ఇష్టాగోష్ఠి


జీ 20 సందర్భంగా బైడెన్‌తో మోదీ

బాలి: అమెరికాతో భారత సంబంధాలపై ఆ దేశాధ్యక్షుడు జో బైడెన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ లోతైన చర్చలు జరిపారు. సమీప భవిష్యత్తులో అత్యంత కీలకంగా మారనున్న పలు అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, సాంకేతిక పరిజ్ఞానాల వంటి రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యం తాలూకు పురోగతిని సమీక్షించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపైనా చర్చించారు. జీ 20 సదస్సు సందర్భంగా ఇద్దరు నేతలు మంగళవారం విడిగా సమావేశమయ్యారు. అంతర్జాతీయ, ప్రాంతీయ పరిణామాలపైనా బైడెన్‌తో మోదీ చర్చించినట్టు విదేశాంగ శాఖ వెల్లడించింది. ''క్వాడ్, ఐ2యూ2 తదితర నూతన గ్రూపుల్లో భారత్, అమెరికా సన్నిహిత సంబంధాల పట్ల ఇరువురూ సంతృప్తి వెలిబుచ్చారు. ఇండో-యూఎస్ బంధాన్ని బలోపేతం చేసేందుకు మద్దతుగా నిలుస్తున్నందుకు బైడెన్‌కు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఏడాది భారత సారథ్యంలో జరిగే 18వ జీ 20 సదస్సు సందర్భంగా కూడా ఈ సహకారం ఇలాగే కొనసాగుతుందని విశ్వాసం వెలిబుచ్చారు'' అని వివరించింది. ఇరువురి మధ్య ప్రయోజనాత్మక చర్చలు జరిగినట్టు విదేశాంగ శాఖ తెలిపింది. గత వారం కాంబోడియా రాజధాని నాంఫెన్‌లో ఆసియాన్ ఇండియా శిఖరాగ్రం సందర్భంగా భారత, అమెరికా విదేశాంగ మంత్రులు చర్చలు జరపడం తెలిసిందే.

జిన్‌పింగ్‌తో కరచాలనం

జీ 20 సదస్సు సందర్భంగా బాలిలో మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కరచాలనం చేసుకోవడం దేశాధినేతలతో సహా అందరి దృష్టినీ ఆకర్షించింది. ఇండోనేషియా అధ్యక్షుడు ఏర్పాటు చేసిన స్వాగత విందు ఇందుకు వేదికైంది. అటుగా వెళ్తున్న జిన్‌పింగ్ ఆగి మోదీకి షేక్‌హ్యాండిచ్చారు. ఇద్దరూ కాసేపు మాట్లాడుకుంటూ కన్పించారు. అధికారిక భేటీ కూడా ఉంటుందని ప్రచారమైనా అలాంటిదేమీ జరగలేదు. భారత్, చైనా మధ్య కొన్నేళ్లుగా ఉద్రిక్తతలు పెరగడం తెలిసిందే. 2020లో గాల్వన్ లోయలో చైనా సైన్యం భారత సైనికులపై దొంగ దెబ్బ తీసి 20 మందికి పైగా పొట్టన పెట్టుకున్న తీరుపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలొచ్చాయి. అప్పటినుంచీ మోదీ, జిన్‌పింగ్‌ల ముఖాముఖి జరగలేదు. సెప్టెంబర్‌లో షాంఘైకో ఆపరేషన్ ఆర్గనైజేషన్ వార్షిక శిఖరాగ్రం సందర్భంగా ఇరువురూ కలుసుకున్నారు.

సునాక్‌తో మోదీ ముచ్చట్లు

కొంతకాలంగా అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న క్షణం రానే వచ్చింది. గత నెలలో బ్రిటన్ ప్రధానిగా ఎన్నికై, ఆ ఘనత సాధించిన తొలి భారత సంతతి వ్యక్తిగా చరిత్ర సృష్టించిన రిషి సునాక్‌తో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. బాలిలో జీ 20 సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు కాసేపు ముచ్చటించారు. సునాక్ పీఎం అయ్యాక వారిరువురూ భేటీ కావడం ఇదే తొలిసారి. నేతలిద్దరూ సరదాగా మాట్లాడుకున్నారంటూ ప్రధాని కార్యాలయం ట్వీట్ చేసింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడొడొ, ఇతర దేశాధినేతలు, ఐఎంఎఫ్ చీఫ్, ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు తదితరులతోనూ మోదీ ముచ్చటించారు. రిషి, మాక్రాన్, విడొడొతో బుధవారం ఆయన సుదీర్ఘ చర్చలు జరపనున్నారు.


జీ 20 సందర్భంగా సునాక్‌తో మోదీ

ప్రపంచ జనాభా 800,00,00,000

ఫిలిప్పీన్స్‌లో జన్మించిన '800 కోట్ల' బేబీ

- గత 12 ఏళ్లలోనే 100 కోట్లు పెరిగిన జనం
- 2023లో జనాభాలో చైనాను అధిగమించనున్న భారత్



ఐక్యరాజ్యసమితి/బీజింగ్: భూగోళంపై జనాభా మరో మైలురాయికి చేరుకుంది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం జనాభా 800 కోట్ల మార్కును దాటేసింది. '800 కోట్ల' శిశువు మంగళవారం భూమిపై కన్నుతెరిచింది. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జన్మించిన చిన్నారి పాపతో ప్రపంచ జనాభా 800 కోట్లకు చేరినట్లు ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఇది వేడుక చేసుకోవాల్సిన సందర్భమేనని, అదే సమయంలో కోట్లాది మంది శాంతియుతంగా జీవించడానికి అనువైన ప్రపంచాన్ని ఎలా సృష్టించాలో అందరూ ఆలోచించాలని సూచించింది. ''800 కోట్ల ఆశలు, 800 కోట్ల స్వప్నాలు, 800 కోట్ల అవకాశాలు. మన భూ గ్రహం ఇక 800 కోట్ల మంది ప్రజలకు ఆవాసం'' అంటూ ఐక్యరాజ్య సమితి జనాభా నిధి(యూఎన్ఎఫ్‌పీఏ) ట్వీట్ చేసింది. పేదరిక నిర్మూలన, ఆరోగ్య రంగంలో పురోగతి, అందరికీ విద్య వంటి అంశాల్లో మానవ జాతి సాధిస్తున్న విజయాలు ప్రపంచ జనాభా వృద్ధికి కారణాలని పేర్కొంది. 1800 సంవత్సరం వరకూ 100 కోట్లలోపే ఉన్న ప్రపంచ జనాభా మరో వందేళ్లలోనే 200 కోట్లకు చేరిందని ప్రకటించింది. యూఎన్ఎఫ్‌పీఏ ఇంకా ఏం చెప్పిందంటే..

- ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశం చైనా. వచ్చే ఏడాదికల్లా.. అంటే 2023లో జనాభాలో భారత్ అగ్రస్థానానికి చేరుకుంటుంది.
- ప్రపంచవ్యాప్తంగా జనాభా గత 12 ఏళ్లలోనే 100 కోట్లు పెరిగింది.
- కొన్నేళ్లుగా జనాభా వృద్ధి నెమ్మదించింది. అయినప్పటికీ 2037 నాటికి 900 కోట్లకు, 2057 నాటికి 1,000 కోట్లకు చేరుకోనుంది.
- 2080 దశకం నాటికి జనాభా 1,040 కోట్లకు చేరుకుంటుంది. అదే గరిష్ఠ స్థాయి. 2100 సంవత్సరం దాకా పెద్దగా మార్పు ఉండదు.
- 2023లో భారత్‌లో జనాభా సగటు వయస్సు 28.7 సంవత్సరాలు. ఇది చైనాలో 38.4, జపాన్‌లో 48.6 ఏళ్లు. ప్రపంచ జనాభా సగటు వయస్సు 30.3 ఏళ్లు. భారత్ యువ జనాభాతో కళకళలాడనుంది.
- ప్రస్తుతం భారత్ జనాభా 141.2 కోట్లు. చైనా జనాభా 142.6 కోట్లు. 2050లో భారత్ జనాభా 166.8 కోట్లు, చైనా జనాభా 131.7 కోట్లు కానుంది.

స్థిరంగా భారత్ జనాభా వృద్ధి!

న్యూఢిల్లీ: భారత్ జనాభా వృద్ధిలో స్థిరత్వం ఏర్పడనుందని యూఎన్ఎఫ్‌పీఏ వెల్లడించింది. జనాభా పెరుగుదల ఎక్కువ, తక్కువ కాకుండా, స్థిరంగా కొనసాగే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది. ప్రభుత్వ విధానాలు, మెరుగైన ఆరోగ్య వ్యవస్థలు, కుటుంబ నియంత్రణ వంటి చర్యలు ఫలితాలను ఇస్తున్నట్లు పేర్కొంది. టోటల్ ఫెర్టిలిటీ రేటు (సగటున ఒక్కో మహిళ జన్మనిచ్చే శిశువుల సంఖ్య) 2.2 కాగా, రాబోయే రోజుల్లో ఇది 2కు పడిపోతుందని అంచనా వేసింది.

వైద్యుల నిర్లక్ష్యానికి యువ క్రీడాకారిణి బలి


ప్రియ (ఫైల్)

చెన్నై: ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం ఓ యువ క్రీడాకారిణి నిండు ప్రాణాలను బలి తీసుకుంది. ఈ ఘటన తమిళనాడులోని పెరియార్ నగర్ గవర్నమెంట్ పెరిఫెరల్ హాస్పిటల్‌లో చోటుచేసుకుంది. వ్యాసర్పాడికి చెందిన ఆర్.ప్రియ(17) బీఎస్సీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫస్టియర్ చదువుతోంది. ఫుట్‌బాల్ క్రీడాకారిణి అయిన ప్రియ కుడి మోకాలి లిగమెంట్ దెబ్బతింది. దీంతో ఆమె పెరియార్ నగర్ గవర్నమెంట్ పెరిఫెరల్ హాస్పిటల్‌కు వెళ్లింది. పరీక్షించిన వైద్యులు ఈ నెల 7న మోకాలికి ఆపరేషన్ చేసి, కంప్రెషన్ బ్యాండేజీ వేశారు. బ్యాండేజీ గట్టిగా వేయడంతో లోపల రక్త స్రావం అయి గడ్డ కట్టి, మిగతా కాలికి సరిగ్గా రక్త ప్రసరణ జరలేదు. వైద్యులు గమనించకపోవడంతో పరిస్థితి విషమించింది. దీంతో ఆమెను రాజీవ్‌గాంధీ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (ఆర్‌జీజీజీహెచ్) రెఫర్ చేశారు. వైద్యులు ఈనెల 8న ఆమె కుడి కాలిని తొలగించారు. ఇంటెన్సివ్ కేర్‌లో చికిత్స కొనసాగుతుండగానే కిడ్నీలు, లివర్, గుండె విఫలమై మంగళవారం ప్రియ తుదిశ్వాస విడిచిందని రాష్ట్ర ఆరోగ్య మంత్రి సుబ్రమణియన్ చెప్పారు. నిర్లక్ష్యం వహించిన గవర్నమెంట్ పెరిఫెరల్ హాస్పిటల్‌కు చెందిన ఇద్దరు వైద్యులను సస్పెండ్ చేశామన్నారు. ప్రియ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారంతోపాటు ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది.

ప్రపంచ శాంతి కోసం.. చేతులు కలుపుదాం

జీ 20 సదస్సులో మోదీ పిలుపు
- ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి దౌత్య మార్గంలో ముగింపు పలకాలి
- ఇంధన దిగుమతులపై ఆంక్షలొద్దు
- పశ్చిమదేశాలను కోరిన ప్రధాని

బాలి: ప్రపంచ శాంతి కోసం అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీ-20 దేశాల అధినేతలకు పిలుపునిచ్చారు. ఉక్రెయిన్-రష్యా ఘర్షణకు త్వరగా ముగింపు పలకాల్సిన అవసరం ఉందన్నారు. సమస్య పరిష్కారంపై తక్షణమే దృష్టి పెట్టాలని.. ఈ దిశగా కాల్పుల విరమణతోపాటు దౌత్య మార్గం కోసం అన్వేషించాలని చెప్పారు. ఇంధన దిగుమతుల విషయంలో భారత్‌పై ఎలాంటి ఆంక్షలు విధించవద్దని పశ్చిమ దేశాలకు సూచించారు. ఆంక్షలను తాము వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇండోనేషియాలోని బాలిలో జీ-20 శిఖరాగ్ర సదస్సులో మంగళవారం సభ్యదేశాల అధినేతలను ఉద్దేశించి ప్రధాని మోదీ సుదీర్ఘంగా ప్రసంగించారు. వాతావరణ మార్పులు, కోవిడ్-19 మహమ్మారి, ఉక్రెయిన్-రష్యా యుద్ధం వంటివి ప్రపంచాన్ని అతలాకుతలం చేశాయని అన్నారు. గ్లోబల్ సప్లై చైన్లు దెబ్బతిన్నాయని, ఫలితంగా అన్ని దేశాల్లో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సదస్సులో నరేంద్ర మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే..

పేదలకు నిత్య జీవితమే ఒక పోరాటం

''వచ్చే ఏడాది జీ-20 కూటమికి భారత్ నాయకత్వం వహించబోతోంది. గౌతమ బుద్ధుడు, మహాత్మా గాంధీ జన్మించిన పవిత్రమైన గడ్డపై మనం కలుసుకోబోతున్నాం. ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించడానికి మనమంతా ఒక అంగీకారానికి రావాలి. కీలకమైన అంశాలపై ప్రపంచ దేశాల నడుమ ఏకాభిప్రాయం కోసం భారత్ పనిచేస్తుంది. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆహార, ఇంధన భద్రత ప్రమాదంలో పడింది. అత్యవసర, నిత్యవసర సరుకులు అందరికీ అందడం లేదు. అన్ని దేశాల్లో పేదల అగచాట్లు మరింతగా పెరిగిపోతున్నాయి. నిత్య జీవితం వారికి ఒక పోరాటంగా మారిపోయింది. సవాళ్లను ఎదుర్కొనేందుకు అనవసరమైన ఆర్థిక సామర్థ్యం వారికి లేదు. పేదల సమస్యలకు ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు కూడా పరిష్కారం చూపడం లేదన్న నిజాన్ని గుర్తించడానికి సంకోచించాల్సిన పనిలేదు. బడుగు వర్గాలకు తోడ్పడే సంస్కరణలను తీసుకురావడంలో విఫలమవుతున్నాం. జీ-20పై ప్రపంచానికి ఎన్నో ఆశలున్నాయి. మన కూటమికి ప్రాధాన్యం ఎన్నోరెట్లు పెరిగింది.


డిన్నర్‌కు వెళ్తూ సంప్రదాయ వేషధారణలో మోదీ

క్లీన్ ఎనర్జీ, పర్యావరణ పరిరక్షణ

ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ గుర్తింపు పొందింది. ప్రపంచం అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలంటే భారత్‌లో ఇంధన భద్రత ఉండడం చాలా ముఖ్యం. అందుకే ఇంధన సరఫరాపై ఎలాంటి ఆంక్షలు లేకుండా చూడాలి. ఎనర్జీ మార్కెట్‌లో స్థిరత్వం సాధించాలి. క్లీన్ ఎనర్జీ, పర్యావరణ పరిరక్షణకు భారత్ కట్టుబడి ఉంది.

'న్యూ వరల్డ్ ఆర్డర్' సృష్టించాలి

ఉక్రెయిన్‌లో శాంతి కోసం అందరూ చొరవ చూపాల్సిన సమయం వచ్చింది. 'న్యూ వరల్డ్ ఆర్డర్'ను సృష్టించే బాధ్యత మన భుజస్కంధాలపై ఉంది. భూగోళంపై శాంతి, సామరస్యం, భద్రత కోసం ఉమ్మడి కృషి సాగించాలి.

డ్రాఫ్ట్ స్టేట్‌మెంట్

ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రను ఖండిస్తూ జీ-20 సదస్సులో ఒక ముసాయిదా నివేదికను విడుదల చేశారు. ఈ నివేదికపై సదస్సులో చర్చ జరిగింది. ఉక్రెయిన్ నుంచి రష్యా తన సైన్యాన్ని బేషరతుగా పూర్తిస్థాయిలో ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌ను ప్రస్తావించారు. జీ-20 సదస్సుకు రష్యా తరపున విదేశాంగ మంత్రి లావ్‌రోవ్ హాజరయ్యారు.

ప్రవాస భారతీయులతో మోదీ భేటీ

ఇప్పటి ఇండియాకు, 2014 ముందు నాటి ఇండియాకు మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఊహించలేనంత వేగంతో ఇప్పుడు భారత్ అభివృద్ధి మార్గంలో ముందుకు సాగుతోందని అన్నారు. ఆయన మంగళవారం ఇండోనేషియాలోని బాలిలో ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. మోదీ, మోదీ అంటూ బిగ్గరగా నినదిస్తూ వారు ఆయనకు స్వాగతం పలికారు. 21వ శతాబ్దంలో ప్రపంచానికి భారత్ ఒక ఆశారేఖగా మారిందని మోదీ వివరించారు. డిజిటల్ టెక్నాలజీ, ఆర్థికం, ఆరోగ్యం, టెలికాం, అంతరిక్షం తదితర రంగాల్లో భారత్ సాధించిన విజయాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. భారత్ గొప్పగా ఆలోచిస్తోందని, గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుంటోందని వెల్లడించారు.

మా గెలుపునకు మలుపు: జెలెన్‌స్కీ

ఖెర్సన్ నగరాన్ని విముక్తం చేయడం రష్యాతో జరిగే యుద్ధంలో కీలక మలుపు కానుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో మిత్ర పక్షాల సైన్యాలు ఫ్రాన్సులోని నార్మండీలోకి ప్రవేశించిన డీ-డేతో దీనిని ఆయన పోల్చారు. జెలెన్‌స్కీ మంగళవారం జీ-20 భేటీని ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. రష్యా దురాగతాలపై ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. జీ-20 వేదికను రష్యాలేని జీ-19గా మార్చాలని కోరారు.

సందడిగా జీ-20 శిఖరాగ్ర సదస్సు

జీ 20 శిఖరాగ్ర సదస్సులో బాలిలో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యింది. కూటమిలోని సభ్యదేశాల అధినేతలు హాజరయ్యారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అతిథ్య దేశం ఇండోనేషియా ప్రధాని జోకో విడొడో ఘనంగా స్వాగతం పలికారు. ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను అందరూ పాటించాలని ప్రపంచ దేశాలకు విడొడో విజ్ఞప్తి చేశారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి త్వరగా తెరపడాలని ఆకాంక్షించారు. జీ-20 అధ్యక్ష బాధ్యతలను ఇండోనేషియా నుంచి భారత్ స్వీకరించనుంది. 2023లో కూటమికి భారత్ నాయకత్వం వహించనుంది. భారత ప్రధాని మోదీ బుధవారం ఇండోనేషియా ప్రధాని విడొడో, స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, సింగపూర్ ప్రధాని లీ సీన్ లూంగ్‌తో సమావేశం కానున్నారు.

గుజరాత్ 'చేతికి' చిక్కేనా?

ఒకప్పుడు గుజరాత్ కాంగ్రెస్‌కు కంచుకోట. నరేంద్ర మోదీ గుజరాత్ పగ్గాలు చేపట్టాక అదంతా గత వైభవంగా మారిపోయింది. గత 27 ఏళ్లుగా అధికారం కోసం పోరాటం చేస్తోంది. మరి ఈ సారైనా కాంగ్రెస్ పార్టీ అధికారం చేజిక్కించుకోగలదా ? అంతర్గత సమస్యల్ని దాటుకొని మోదీ సొంత గడ్డపై విజయకేతనం ఎగురవేయగలదా ?

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ సొంతంగా అధికారంలో ఉన్న రాష్ట్రాలు రెండే రెండు. రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అధికారం దక్కాలంటే వీలైనన్ని ఎక్కువ రాష్ట్రాల్లో విజయం సాధించాలని కాంగ్రెస్ తీవ్రంగా ప్రయత్నం చేస్తోంది. గుజరాత్‌లో 27 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీపై ఉన్న వ్యతిరేకత కలిసివస్తుందని భావిస్తోంది. కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడైన మల్లికార్జున ఖర్గే ఈ ఎన్నికల్ని ఒక సవాల్‌గా తీసుకున్నారు. మొత్తం 182 స్థానాలున్న గుజరాత్ అసెంబ్లీలో 2002 నుంచి బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ సీట్లు తగ్గుతూ వస్తున్నాయి. గత ఎన్నికల్లో బీజేపీ 99 సీట్లు సాధిస్తే, కాంగ్రెస్ 77 సీట్లలో గెలిచింది. 2012 ఎన్నికలతో పోల్చి చూస్తే 16 స్థానాల బలాన్ని పెంచుకుంది. ఎక్కువ స్థానాలను స్వల్ప మెజార్టీతోనే పోగొట్టుకుంది. అందుకే ఈ సారి విజయం తమదేనని గట్టిగా విశ్వసిస్తోంది. బీజేపీ, ఆప్‌లు ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నప్పటికీ కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో బలంగా ప్రచారం నిర్వహిస్తోంది. 125 ప్లస్ లక్ష్యంగా కేంద్ర మాజీ మంత్రులు, ఇతర రాష్ట్రాల్లో కీలక నేతలు బూత్ స్థాయిలో ప్రచారం చేస్తున్నారు.



ఆప్ ప్రభావం

ఆప్ తొలిసారిగా బరిలో దిగడంతో ముక్కోణపు పోటీ నెలకొంది. ఆప్ ఏ పార్టీ విజయావకాశాలను దెబ్బ తీస్తుందన్నది అంతుచిక్కడం లేదు. ఆప్ పట్టణ ప్రాంత ఓటర్లను ప్రభావితం చేసి బీజేపీ ఓటు బ్యాంకునే కొల్లగొడుతుందన్నది కాంగ్రెస్ ధీమా. దిగ్గజ నేత అహ్మద్ పటేల్ లేకుండా ఎదుర్కొంటున్న తొలి ఎన్నికలు కావడం, పీసీసీ అధ్యక్షుడు జగదీశ్ ఠాకూర్ ఇతర నేతల్ని కలుపుకొని పోతూ ఎంతవరకు పనిచేయగలరన్న సందేహాలైతే ఉన్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

గుజరాత్ సమరం

అనుకూలం
- బీజేపీ 27 ఏళ్ల పాటు అధికారంలో ఉండడంతో ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకత
- కాంగ్రెస్‌కి సంప్రదాయంగా వస్తున్న ఓటు బ్యాంకు ఠాకూర్, కొలి వంటి ఓబీసీలు, ఖామ్ ఓటర్ల (క్షత్రియ, హరిజన, ఆదివాసీ, ముస్లిం) అండదండలు
- ఆరు దఫాలుగా బీజేపీ చేతిలో ఓడిపోతున్నా కాంగ్రెస్ 40% ఓటు షేర్ సాధించడం
- గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్‌కున్న పట్టు ఇంకా కొనసాగుతుండటం

ప్రతికూలం
- రాష్ట్రస్థాయిలో బలమైన నేతల కొరత, పార్టీలో అంతర్గత పోరు
- గత 30 ఏళ్లలో 60 అర్బన్, సెమీ అర్బన్ సీట్లలో ఒక్కదాంట్లోనూ నెగ్గలేకపోవడం
- రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర పైనే కేంద్ర నాయకత్వం దృష్టి సారించడం
- 2017-2022 మధ్య కాలంలో హార్దిక్ పటేల్ సహా 16 మంది ఎమ్మెల్యేలు బీజేపీ గూటికి చేరడం

గదిలో శవం ఉండగానే..

- మరో యువతిని ఫ్లాట్‌కు తెచ్చుకున్న అఫ్తాబ్
- రక్తం ఆనవాళ్లను చెరిపేందుకు గూగుల్‌లో అన్వేషణ
- ఢిల్లీలో యువతి హత్య కేసులో దిగ్భ్రాంతికర నిజాలు


అఫ్తాబ్‌ను అడవికి తీసుకెళ్తున్న పోలీసులు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన యువతి హత్య కేసులో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగుచూస్తున్నాయి. తనతో సహజీవనం చేస్తున్న శ్రద్ధా వాకర్‌ను దారుణంగా చంపేసి ముక్కలుగా చేసి ఫ్రిజ్‌లో దాచిన అఫ్తాబ్ అమీన్ పూనావాలా(28) నెల రోజులకే మరో యువతితో అదే ఫ్లాట్‌లో గడిపాడు. ఆమె కూడా డేటింగ్ యాప్‌లోనే పరిచయం కావడం గమనార్హం. శ్రద్ధ రక్తం మరకలు జాడలు లేకుండా ఏం చేయాలో గూగుల్‌లో వెతికాడు. డీఎన్ఏ పరీక్షలకు దొరక్కుండా మరకలను హైపోక్లోరిక్ యాసిడ్‌తో తుడిచేశాడు. చిన్నపాటి రంపంతో శరీర భాగాలను ముక్కలుగా కోశాడు. ఫ్రిజ్‌లో ఉంచిన శరీర భాగాలను ఇతరులు వచ్చినపుడు అనుమానం రాకుండా ఉండేందుకు కప్‌బోర్డులోకి మార్చేవాడని పోలీసుల విచారణలో వెల్లడైంది. యువతి శరీరభాగాలను కనుగొనేందుకు మంగళవారం ఢిల్లీ మెహ్రౌలీ పోలీసులు చత్తర్‌పూర్ అటవీ ప్రాంతంలో మూడు గంటలపాటు అఫ్తాబ్‌ను తిప్పారు. ముఖంపై ముసుగు తొడిగి, కెమెరా సిబ్బంది, జర్నలిస్టులు వెంటరాగా అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. సహజీవనం చేస్తున్న శ్రద్ధా వాకర్ అనే మహారాష్ట్ర యువతిని గొంతు పిసికి చంపడంతోపాటు, 35 ముక్కలుగా నరికి ఫ్రిజ్‌లో ఉంచి వేర్వేరు చోట్ల పడేసిన దారుణ ఘటన తెలిసిందే. హత్యకు దారి తీసిన ఘటనల క్రమాన్ని నమోదు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎవరి కంటా పడకుండా శరీర భాగాలను అతడు ఎలా పడవేయగలిగాడనే నిర్ధారించే పనిలో ఉన్నాం. దీంతోపాటు పూనావాలా, శ్రద్ధా వాకర్ మధ్య స్నేహం మొదలైన డేటింగ్ యాప్ 'బంబుల్'నిర్వాహకుల నుంచీ వివరాలు రాబడతాం'అని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వివరించారు. కోర్టు పూనావాలాకు అయిదు రోజుల పోలీస్ కస్టడీ విధించింది. తన కూతురు శ్రద్ధను పొట్టనబెట్టుకున్న అఫ్తాబ్‌ను ఉరి తీయాలని తండ్రి వికాస్ వాకర్ డిమాండ్ చేశారు. ఈ ఘటనలో లవ్ జిహాద్ కోణం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఢిల్లీ పోలీసులపై తనకు విశ్వాసం ఉందన్నారు.

సాక్షి విజయనగరం

బుధవారం । 16 । నవంబర్ । 2022

18న ఇంటర్వ్యూలు

విజయనగరం ఫోర్ట్: కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యసిబ్బంది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.పద్మలీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనస్తీయా టెక్నీషియన్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ఓటీ టెక్నీషియన్, ల్యాబ్ అటెండెంట్ కేటగిరీలకు చెందిన 7 పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. విద్యార్హత ఒరిజినల్ ధ్రువపత్రాలతో అభ్యర్థులు హాజరు కావాలని కోరారు.



వైభవంగా పూర్ణాహుతి

నెల్లిమర్ల రూరల్: పుష్యమి నక్షత్రంలో భాగంగా పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

కొత్తవలస: విజయవాడలో ఈ నెల 19, 20వ తేదీల్లో జరగబోయే రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల, మహిళల షూటింగ్ బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక పోటీలను జామి మండలం అలమండ శ్రీరామస్ స్కూల్ వద్ద బుధవారం నిర్వహిస్తామని షూటింగ్‌బాల్ జిల్లా కార్యదర్శి పి.ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్‌కార్డు, పాస్‌ఫొటో, స్పోర్ట్స్ డ్రెస్, షూతో హాజరు కావాలని సూచించారు. మరింత సమాచారం కోసం సెల్: 93989 89176 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

డిసెంబర్ 3,4 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు

విజయనగరం పూల్‌బాగ్: విజయనగరం జిల్లా ఎస్ఎఫ్ఐ 30వ జిల్లా మహాసభలు డిసెంబర్ 3, 4 తేదీల్లో బొబ్బిలిలో జరగనున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ తెలిపారు. స్థానిక ఎల్‌బీజీ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. మహాసభలు విజయవంతం చేసేందుకు మేధావులు, విద్యావేత్తలు ఆర్థిక, హార్దిక సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ రామకష్ణ పాల్గొన్నారు.

ఎన్ఎమ్ఎమ్ఎస్ దరఖాస్తు గడువు పెంపు

విజయనగరం పూల్‌బాగ్: ప్రస్తుత (2022–23) విద్యాసంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25న వరకు గడువు పొడిగించినట్టు డీఈఓ కె. వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినల్ రోల్స్, ఎస్‌బీఐ ఒరిజినల్ ఫీజు రసీదును విజయనగరం కోటలోని స్ట్రాంగ్‌రూమ్‌లో ఈనెల 26లోగా సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు www. bse.a p.gov.in website ని సంప్రదించాలని సూచించారు.

రైతులకు అండగా డీసీఎమ్ఎస్

- డీసీఎమ్ఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన



జెండా ఎగురవేస్తున్న డాక్టర్ భావన

విజయనగరం ఫోర్ట్: డీసీఎమ్ఎస్ ఎల్లవేళలా రైతులకు అండగా ఉంటుందని డీసీఎమ్ఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన తెలిపారు. 69వ అఖిల భారత సహకార వారోత్సవాలు సందర్భంగా జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలో సహకార జెండాను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహకార సంస్థలను బలోపేతం చేయడమే అఖిల భారత సహకార వారోత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. లాభసాటి వ్యవసాయం చేసేలా అన్నదాతలకు తోడ్పాటునందిస్తున్నట్టు వెల్లడించారు. విత్తనాలు, ఎరువులు రాయితీపై అందించడంతో పాటు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అవనాపు విక్రమ్, డైరెక్టర్లు పి.నారాయణమూర్తి, బి.బంగారునాయుడు, జొన్నాడ శ్రీకాంత్, సహకార విద్యాధికారి జి. శ్రీనివాసరావు, బిజినెస్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

18న జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రాజెక్టుల ప్రదర్శన

విజయనగరం పూల్‌బాగ్: జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్ జిల్లా స్థాయి ప్రాజెక్టు ప్రదర్శన ఈ నెల 18న విజయనగరం పూల్‌బాగ్‌లోని శ్రీచలపతి స్కూల్‌లో జరగనుందని డీఈఓ కె.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు మూడు నుంచి ఐదు ప్రాజెక్టులు ప్రదర్శించవచ్చన్నారు. ఒక ప్రాజెక్టుకు ఒక విద్యార్థి, ఒక ఉపాధ్యాయుడిని పంపించాలని హెచ్‌ఎంలకు సూచించారు. బాలల్లో పరిశోధనా దృక్పథం పెంపొందించేందుకు జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్ దోహదపడుతుందన్నారు. సమస్యా పరిష్కారం కోసం శాస్త్రీయ పద్ధతిని అలవాటుపడేలా చేస్తుందని, బాల శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇది చక్కని వేదికగా పేర్కొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



చదురుగుడిలో పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న పైడితల్లి



వనంగుడిలో ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు మంగళవారం వనంగుడి, చదురుగుడిలలో పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు బంటుపల్లి వెంకటరావు, ఏడిద రమణ, మూలా పాపారావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. – విజయనగరం టౌన్

ధాన్యం సంపద



నూర్పిడి చేసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగుకు వాతావరణం అనుకూలించింది. వరి కోతలు, నూర్పిడి పనులు చకచకా సాగుతున్నాయి. వంగర మండలం కొప్పర గ్రామానికి చెందిన శీలంకి పకీరునాయుడు, సాదెం అప్పలనాయుడు సాగుచేసిన సంపద రకం వరి వంగడం ఎకరాకు 38 బస్తాల దిగుబడి రావడంతో రైతులు సంబరపడుతున్నారు. ఈ ఏడాది 8 నుంచి 10 బస్తాల వరకు దిగుబడి పెరిగిందని రైతులు చెబుతున్నారు. – వంగర

17 నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

- జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ అప్పలనాయుడు

విజయనగరం:

రాష్ట్ర స్థాయిలో నిర్వహించబోయే సీఎం ప్రైజ్‌మనీ కప్ క్రీడా పోటీలకు నియోజకవర్గ స్థాయి జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థచీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు తెలిపారు. 17 సంవత్సరాల వయస్సు పైబడిన క్రీడాకారులు ఎంపిక పోటీలకు అర్హులుగా పేర్కొన్నారు. క్రికెట్ క్రీడను పురుషులకు మాత్రమే నిర్వహిస్తామన్నారు.

కబడ్డీలో పాల్గొనే బాలుర క్రీడాకారులు 55 నుంచి 85 కేజీల లోపు, బాలికలు 55 నుంచి 75 కేజీల లోపు బరువు కలిగి ఉండాలన్నారు. క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు జెరాక్సు కాపీతో పాటు పాస్‌ఫొటోను వెంట తీసుకురావాలన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఆయా తేదీల్లో నియోజకవర్గాల్లో నిర్వహించే ఎంపిక పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

నియోజకవర్గం	క్రీడాంశం	తేదీ	పోటీలు నిర్వహించేవేదిక
విజయనగరం	కబడ్డీ, వాలీబాల్, క్రికెట్	21	రాజీవ్ స్టేడియం
రాజాం	కబడ్డీ, వాలీబాల్, క్రికెట్	17	జీసీఎస్ కళాశాల, రాజాం
ఎస్.కోట	కబడ్డీ, వాలీబాల్, క్రికెట్	22	కొత్తవలస
నెల్లిమర్ల	కబడ్డీ	19	జెడ్పీహెచ్ఎస్ అలుగోలు
	వాలీబాల్	18	జెడ్పీహెచ్ఎస్ భోగాపురం
బొబ్బిలి	కబడ్డీ, వాలీబాల్	20	జెడ్పీహెచ్ఎస్ పక్కి
	క్రికెట్	20	బొబ్బిలి

మహిళా రైతు ముందడుగు



- చకచకా రైతు ఉత్పత్తి సంఘాలు
- ఇప్పటివరకూ జిల్లాలో 1677 సంఘాల ఏర్పాటు
- కొత్త వ్యవసాయ ఉత్పత్తులవైపు మహిళా రైతులు
- కిచెన్ గార్డెన్‌లు, కూరగాయల సాగులో రాణింపు
- పౌల్ట్రీల నిర్వహణతో సరికొత్త ఆదాయం

రాజాం: విజయనగరం

జిల్లాలో అధిక మందికి వ్యవసాయమే జీవనాధారం. పొదుపు సంఘాల్లోని అధిక మంది సభ్యులు వ్యవసాయ పనులు చేస్తూనే జీవనం సాగిస్తున్నారు. వీరికి అందించే బ్యాంకు లింకేజీ, సామాజిక పెట్టుబడి, సీఐఎఫ్, గ్రూపు అంతర్గత అప్పులు, స్త్రీ నిధి రుణాలతో వ్యవసాయాధారిత ఉత్పత్తుల యూనిట్లను నెలకొల్పి ఆర్థికాభివృద్ధికి చేయూతనివ్వాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఆరు నెలలు కిందట రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ అవకాశాన్ని మహిళలు అందిపుచ్చుకుంటున్నారు. సంఘాలుగా ఏర్పడుతున్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో 40,417 పొదుపు సంఘాల పరిధిలో ఇప్పటివరకు 1677 రైతు ఉత్పత్తి సంఘాలు ఏర్పాటయ్యాయి. వీటిలో 16,913 మంది మహిళలు సభ్యులుగా చేరారు.

అర్హులు ఎవరు?

రైతు ఉత్పత్తి మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉండాలంటే సాగు భూమి కలిగి ఉండాలి. సాగుపై ఆసక్తి ఉండి 18 నుంచి 58 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన పొదుపు సంఘాల సభ్యులు అర్హులు. సంఘంలో చేరే మహిళల వాటా ధనం కింద రూ.100లు , సభ్యత్వ రుసుం రూ.500లు చెల్లించాల్సి ఉంటుంది. 15 నుంచి 20 మంది సభ్యులతో సంఘం ఏర్పాటుచేసుకోవాలి. ఈ సంఘాలకు పంటల సాగు, నాణ్యమైన దిగుబడుల సాధన, గిట్టుబాటు ధరల కల్పన, మార్కెట్ సదుపాయంపై సెర్ప్ అధికారులు అవగాహన కల్పిస్తారు.

పనితీరు, ప్రయోజనం ఇలా...

రైతులు పండించిన నాణ్యమైన ఉత్పత్తులను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు కల్తీ చేసి అధిక ధరకు విక్రయిస్తున్నారు. దీనివల్ల ఓ వైపు రైతులు, మరోవైపు వినియోగదారులు నష్టపోతున్నారు. వ్యాపారులు లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ సమస్యను అధిగమించేలా మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు పనిచేయనున్నాయి. సంఘాల్లోని సభ్యులు తాము పండించిన దిగుబడిని విక్రయించుకునేలా అధికారులు రైతు వేదికల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ప్రతీ మండలం నుంచి మహిళా రైతు ఉత్పత్తి సంఘాల నుంచి ఐదుగురు సభ్యులను ఫార్మర్ ప్రొడ్యూసర్ కమిటీగా నియమించారు. వీరు దిగుబడుల వివరాలు సేకరించి సెర్ప్ ప్రతినిధులు ద్వారా వ్యాపారులకు చేరవేస్తారు. స్వయంగా దుకాణాలు ఏర్పాటుచేసిన విక్రయిస్తారు. ఈ సంఘాల్లోని మహిళలకు ఆరు నెలలు దాటితే రాయితీ రుణాలు, పలు రకాల పంటల విత్తనాలను ప్రభుత్వం అందించనుంది. మరోవైపు పౌల్ట్రీల నిర్వహణతో మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు డీఆర్‌డీఏ కృషిచేస్తోంది.



మంచి సాయం అందిస్తున్నారు

నేను రైతు ఉత్పత్తి సంఘంలో సభ్యురాలిగా చేరాను. నాకు మా ఇంటి సమీపంలోని పంట పొలంలో కూరగాయలు సాగుపై అవగాహన కల్పించారు. రాయితీపై బెండ విత్తనాలు అందించారు. ఇప్పుడు ఈ పంట కోత దశలో ఉంది. మంచి దిగుబడి వచ్చింది. ఇంటి కూర ఖర్చు కూడా ఒడ్డెక్కుతుంది.

– పి.అప్పలనరసమ్మ, పెనుబాక, రైతు ఉత్పత్తి సంఘం సభ్యురాలు

పంటల సాగుపై అవగాహన



ప్రతీ గ్రామం నుంచి మహిళా రైతులను ఎంపికచేసి సంఘటితం చేశాం. జిల్లాలో అన్నిచోట్ల మహిళా రైతు ఉత్పత్తి సంఘాలు ప్రారంభమయ్యాయి. సంఘాల సభ్యులకు శిక్షణ ఇస్తున్నాం. రానున్న రోజుల్లో సాగుపై మరింత అవగాహన కల్పించి, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకుంటాం. మహిళా రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ సంఘాలు దోహదపడతాయి.

– ఎ.చిరంజీవి, వైకేపీ ఏరియా కోఆర్డినేటర్, రాజాం

మహిళా రైతులే అర్హులు



పొదుపు సంఘాల్లోని మహిళా రైతులను మాత్రమే రైతు ఉత్పత్తి సంఘాల్లో సభ్యులుగా తీసుకుంటున్నాం. ఇప్పటివరకూ రాజాం నియోజకవర్గ పరిధిలో 300 లు వరకూ సంఘాలు ఏర్పాడ్డాయి. 400 మంది వరకూ సభ్యులు ఉన్నారు. వీరికి నూతన సాగు పద్ధతులు, మద్దతు ధరకు పంట విక్రయం, వేసవిలో కూరగాయల సాగు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– కె.హేమలత, రైతు ఉత్పత్తి సంఘాల ఏపీఎమ్, రాజాం

గరుడుబిల్లిలో పంజా విసిరిన పులి

- ఆవును హతమార్చిన బెంగాల్‌టైగర్
- బోను ఏర్పాటు చేస్తామన్న అటవీశాఖ అధికారులు
- జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు రెండు రోజులు సెలవు ప్రకటన




పులి దాడిలో మృతిచెందిన చూడి ఆవు



గరుడుబిల్లిలో పులి పాదముద్రలు

బొండపల్లి: పులి మళ్లీ అలజడి రేపింది. రెండు నెలల వ్యవధిలో ఈ ప్రాంతంలో ఐదు ఆవులను హతమార్చిన బెంగాల్‌టైగర్... తాజాగా బొండపల్లి మండలంలోని గరుడుబిల్లి గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఆనుకొని ఉన్న పశువులశాలపై మంగళవారం వేకువజామున దాడిచేసింది. గ్రామానికి చెందిన వెంపడాపు రామ్మూర్తికి చెందిన చూడి ఆవును పొట్టనపెట్టుకుంది. పులి సంచారంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. పులి దాడిచేసిన విషయాన్ని సర్పంచ్ బొద్దల కృష్ణవేణి అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. ఈ మేరకు అటవీశాఖ ఆఫీసర్ కె.వి.ఎస్.రాజు తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతిచెందిన ఆవుకు పశువైద్యాధికారితో పంచనామా నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఎ.వేదవతి ఘటనా స్థలాన్ని పరిశీలించి, గ్రామస్తులందరూ అప్రమత్తంగా ఉండాలంటూ దండో వేయించారు. పులి దాడి చేసిన ప్రాంతం హైస్కూల్‌కు ఆనుకొని ఉండడంతో పాఠశాలకు రెండు రోజులు సెలవు ప్రకటించినట్టు డిప్యూటీ ఈఓ కె.వాసుదేవరావు తెలిపారు. ఘటనా స్థలానికి సమీపంలో పులి మళ్లీ సంచరించే అవకాశం ఉండడంతో బోను, ఉచ్చును ఏర్పాటు చేస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు. రాత్రి పూట ఎవ్వరూ బయట తిరగొద్దని సూచించారు.

పుస్తకపఠనంతో విజ్ఞానం




పుస్తక ప్రదర్శనను సందర్శించిన జెడ్పీ సీఈఓ డాక్టర్ అశోక్‌కుమార్

విజయనగరం అర్బన్:

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని జెడ్పీ సీఈఓ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్ తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. డిజిటల్ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు పలుపుస్తకాలను గ్రంథాలయానికి వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి ఎస్.లలిత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యకు తొలి ప్రాధాన్యం

- ప్రతి పిల్లాడు చదువుకోవాలన్నదే ప్రభుత్వ ఆలోచన
- హైస్కూల్స్, ప్రైమరీ స్కూల్స్‌కు డిజిటల్, స్మార్ట్ టీవీలు
- నెలరోజుల్లో గృహనిర్మాణాలు ప్రారంభించకపోతే రద్దు
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లిరూరల్ (గరివిడి): విద్యారంగానికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యమిస్తోందని, ప్రతి పిల్లాడు ఉన్నతంగా చదువుకోవాలన్నదే లక్ష్యంగా ముందుకు సాగుతోందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆర్థిక కష్టాలతో పేదకుటుంబాల పిల్లలు చదువుకు దూరంకారాదన్న ఉద్దేశంతో అమ్మఒడి, జగనన్న విద్యాకానుకలు, గోరుముద్ద, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి బృహత్తర పథకాలను అమలు చేస్తున్నట్టు వివరించారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. రాష్ట్రంలో 70 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని, రానున్న విద్యా సంవత్సరంలో ప్రతీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మాణంతో పాటు వాచ్‌మన్‌ను నియమించి సీసీ కెమెరాలు అమర్చుతామని తెలిపారు. హైస్కూల్స్‌లో ప్రతీ తరగతి గదికి డిజిటల్ టీవీలు, ప్రైమరీ స్కూల్స్‌లో ఒక తరగతి గదిలో స్మార్ట్ టీవీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రతీ విద్యార్థికి ట్యాబ్‌లు అందజేస్తామని చెప్పారు. వారంలో రెండు రోజులు స్థానిక ప్రజాప్రతినిధులు స్కూల్స్‌ను సందర్శించి విద్యాశాఖ అధికారులకు విలువైన సమాచారం ఇవ్వాలన్నారు. బొండపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని సర్పంచ్ స్వప్న మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఉన్నత పాఠశాల అప్‌గ్రేడేషన్‌కు చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహనిర్మాణశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో గరివిడి మండలంలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో 1995 మందికి ఇళ్లు మంజూరు చేశామని, 176 ఇళ్ల పనులు నేటికీ ప్రారంభించలేదని అధికారులు మంత్రికి వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ... ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించనివారికి నెల రోజులు సమయం ఇవ్వాలని, అప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభించపోతే నోటీసులు అందించి రద్దు చేయాలన్నారు. ఆ స్థలాలను కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి కేటాయించాలని సూచించారు. శతశాతం ఈ క్రాప్ నమోదు చేయాలని, వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలని అధికారులను కోరారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జాయింట్ కలెక్టర్ మయూరఅశోక్, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎమ్‌సీ చైర్మన్ దన్నాన జనార్దన్, డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, డీపీఓ నిర్మలాదేవి, ఆర్డీఓ అప్పారావు, ఎంపీడీఓ జి.భాస్కరరావు, తహసీల్దార్ టి.గోవింద్, వైస్ ఎంపీపీ రామకృష్ణరాజు, రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ డైరెక్టర్ బమ్మిడి అప్పలస్వామి, అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్ఎంఎంఎస్ ఫీజు గడువు పెంపు

పార్వతీపురం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఫీజు గడువును ఈనెల 25వరకు పొడిగించినట్లు డీఈఓ ఎస్‌డీవీ రమణ తెలిపారు. 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి నిర్వహించే ఈపరీక్షల పూర్తి వివరాలకు సంబంధిత ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఇన్ నందు గానీ డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

టాటా మ్యాజిక్ దగ్ధం



కాలిపోతున్న టాటా మ్యాజిక్

గుర్ల: మండలంలోని గుజ్జింగివలస వద్ద షార్ట్ సర్క్యూట్‌తో టాటా మ్యాజిక్ వాహనం మంగళవారం దగ్ధమైంది. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి నష్టం జరగలేదు. విజయనగరం నుంచి ప్రయాణికులతో చీపురుపల్లి వెళ్తున్న టాటా మ్యాజిక్ వాహనం బ్యాటరీ నుంచి అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. గమనించిన డ్రైవర్, ప్రయాణికులు వాహనం దిగి దూరంగా వెళ్లారు. మంటల్లో టాటా మ్యాజిక్ పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు.

కారు ప్రమాదంలో సాలూరువాసి మృతి

- మరో నలుగురికి గాయాలు
- తమిళ నాడు రాష్ట్రంలో దుర్ఘటన



బొన్నాడ శ్రీనివాసరావు (ఫైల్)

సాలూరు: తమిళ నాడు రాష్ట్రంలోని పొల్లూరు రైల్వే వంతెన వద్ద మంగళవారం వేకువజామున 3 గంటల సమయంలో జరిగిన రోడ్డు దుర్ఘటనలో సాలూరు పట్టణంలోని అక్కేనవీధికి చెందిన బొన్నాడ శ్రీనువాసరావు(40) మరణించారు. అలాగే అదే కారులో ప్రయాణిస్తున్న సాలూరు వాసులు మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. కారు ప్రమాదం, బొన్నాడ శ్రీను మరణ వార్త తెలుసుకున్న ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖమంత్రి పీడిక రాజన్నదొర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వెంటనే ఆయన కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడులతో మాట్లాడి మృతదేహం త్వరగా సాలూరు వచ్చేలా, గాయాలపాలైన వారికి మెరుగైన చికిత్స అందేలా అక్కడి అధికారులతో మాట్లాడాలని కోరారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే బొన్నాడ శ్రీను మరణవార్తతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

హెచ్ఎంపై పోక్సో కేసు నమోదు

సాలూరు: మండలంలోని కురుకూటి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న కృష్ణారావుపై పోక్సోకేసు నమోదైనట్లు రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో, ఎస్సీ, ఎస్టీ చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ. 519.00
శ్రీకాకుళం	రూ. 519.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	52,640-00
బంగారం(22సి. 10గ్రా.)	48,260-00
వెండి (కిలో)	67,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

దళారులను నమ్మి మోసపోవద్దు

- రైతులకు జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు సూచన
- సోమలింగాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



సోమలింగాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెరకముడిదాం: వరిపంట పండించిన రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా పరిషత్‌చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు హితవు పలికారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని సోమలింగాపురం గ్రామంలో పీఏసీఎస్, రైతుభరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణల ఆధ్వర్యంలో మండలానికి సంబంధించి ఈ ఏడాది 16,500 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా ప్రభుత్వం నేరుగా రైతుల అక్కౌంట్లకే ధాన్యం డబ్బులను జమ చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది రైతులు సాగుచేసిన వరి పంట మంచి దిగుబడి వచ్చే పరిస్థితి మండలంలో ఉండడంతో రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. రైతులంతా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తనకు తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు.

ఆర్బీకేలను సద్వినియోగం చేసుకోవాలి

అనంతరం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ధాన్యం సేకరణను పలు రైతు భరోసా కేంద్రాలలో ఏర్పాటు చేశామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు ధాన్యం నేరుగా కేంద్రాలకు వారి గోనెలతోనే సరఫరా చేస్తే అందుకైన ఖర్చులు కూడా ప్రభుత్వమే ఇస్తుందని తెలిపారు. రైతులు తేమశాతాన్ని పరిశీలించి 17 శాతం ఉండే విధంగా ధాన్యం ఆరిన తరువాత కేంద్రాలకు తీసుకువస్తే మంచి ధర వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్వీ రమణరాజు, ఎంపీపీ తాడ్డికృష్ణవేణి, తాడ్డివేణుగోపాలరావు, కోట్ల మోతీలాల్‌నాయుడు, కేఎస్ ఆర్‌కే ప్రసాద్, వైస్ ఎంపీపీ తలచట్ల హరిబాబు, బూర్లె నరేష్‌కుమార్, అగ్రికల్చర్ జేడీ వి.టి.రామారావు, పౌరసరఫరాలశాఖ డీఎం ఎ.కె.మీనా, డీఎస్‌ఓ మధుసూదనరావు, డీసీఓ రమేష్, స్థానిక సర్పంచ్ ఆబోతుల అప్పారావు, ఎంపీటీసీ ఎస్.సీతారామరాజు, ఎస్.కృష్ణమూర్తిరాజు, ఎంపీడీఓ పి.రామకృష్ణ, తహసీల్దార్ బి.రత్నకుమార్ పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలుశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నేతన్న నేస్తంతో ఆర్థిక భరోసా



గంగన్నపాడులో చేనేత కార్మికులతో మాట్లాడుతున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

- సీఎం వైఎస్ జగన్ మేలు మరువలేమన్న చేనేత కార్మికులు

తెర్లాం: చేనేత కార్మికులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న 'నేతన్న నేస్తం' పథకం ద్వారా ఆర్థిక భరోసా కలిగిందని, ఆయన మేలు ఎన్నటికీ మరువలేమని తెర్లాం మండలం గంగన్నపాడు గ్రామానికి చెందిన చేనేత కార్మికులు బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుతో అన్నారు. ఈ మేరకు గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శంబంగి చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న నేతన్న నేస్తం పథకం వస్తోందా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ తమకు నేతన్న నేస్తం పథకం వస్తోందని, ఈ పథకం ద్వారా తమ ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ అవుతున్నాయని చెప్పారు. గతంలో ఆర్థిక ఇబ్బందులతో బాధపడేవారమని, వైఎస్ జగన్ సీఎం అయిన తరువాత నేతన్న నేస్తం పథకం అమలు చేయడంతో కష్టాలు తీరాయని ఆనందం వ్యక్తం చేశారు. తమకు గుర్తింపు కార్డులు లేవని వారంతా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఆయన చేనేత, జౌళిశాఖ ఎ.డితో ఫోన్‌లో మాట్లాడారు. గంగన్నపాడు చేనేత కార్మికులకు వెంటనే గుర్తింపు కార్డులుగానీ, ధ్రువీకరణ పత్రాలుగానీ అందజేయాలని కోరారు.

మైలాన్ పరిశ్రమ వితరణ



వసతిగృహం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ తదితరులు

- రూ.కోటి 50 లక్షలతో వసతిగృహం నిర్మాణానికి శంకుస్థాపన

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వసతి గృహం నిర్మాణానికి మైలాన్‌పరిశ్రమ రూ.కోటి 50 లక్షలు వితరణగా అందజేసింది. ఆ సొమ్ముతో వసతిగృహం నిర్మాణానికి నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైలాన్ పరిశ్రమ విద్య కోసం నిధులు మంజూరు చేయడం సంతోషదాయకమని ప్రశంసించారు. విద్య, వైద్యం, తాగునీటికి పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గంలో సహకారం అందించాలని కోరారు. పరిశ్రమలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఇతర ప్రాంతాల వ్యక్తులకు పరిశ్రమలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని, పరిశ్రమ యాజమాన్యం ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని సూచించారు. స్థానికుల నుంచి తిరుగబాటు రాక ముందే సమస్యలు పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ అంబేడ్కర్ గురుకులాల జిల్లా కన్వీనర్ బి.చంద్రావతి, ఎంపీపీ మహంతి కల్యాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, మైలాన్‌పరిశ్రమ సీఎస్ఆర్ ప్రతినిధులు మిచేల్‌డొమినికా, మల్లికార్జున్ నగిసీ, ప్లాంట్ హెడ్ అంజనీకుమార్, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, పి.లక్ష్మీనారాయణ, పైడి రమణ, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గిరిజన విద్యార్థులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు

పార్వతీపురం: గిరిజన విద్యార్థులకు జిల్లా స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలను బుధవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి బి.సూర్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనజాతీయ గౌరవ దినం సందర్భంగా పార్వతీపురం గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పార్వతీపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పోటీలలో దాదాపు 400మంది విద్యార్థులు పాల్గొంటారని, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, బాడ్మింటన్, ఆర్చరీ, అథ్లెటిక్స్‌తో పాటు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, డ్యాన్స్ తదితర విభాగాల్లో పోటీలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ పోటీలలో విజేతలు ఈనెల 18నుంచి 21వరకు విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. క్రీడల పర్యవేక్షణ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎం.వాసుదేవారావు నాయుడు ఆధ్వర్యంలోనూ, సాంస్కృతిక విభాగానికి సంబంధించి పోటీలు సీహెచ్. మోహన్ రాయుడు ఆధ్వర్యంలో పోటీలు జరగనున్నాయని వివరించారు.

శాస్త్రీయ సంగీతంలో సుష్మకు డాక్టరేట్



గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా డాక్టరేట్ తీసుకుంటున్న సుష్మ

విజయనగరం టౌన్: విజయనగరం పట్టణానికి చెందిన ఎం.ఆముక్త మాల్యద సుష్మ శాస్త్రీయ సంగీతంలో సమర్పించిన పరిశోధనకు తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ నెల 11, 12 తేదీల్లో యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె రింగురోడ్డులో ఉన్న తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ విజయనగరంలో జన్మించిన తాను సంగీతంలో ఓనమాలను చాగంటి రాజ్యలక్ష్మి వద్ద నేర్చుకున్నానని, అనంతరం విశాఖలో మండా సుధారాణి వద్ద శాస్త్రీయ సంగీతంలో పట్టుసాధించినట్లు తెలిపారు. ఎంబీఏ, ఎంఏ మ్యూజిక్‌లో గోల్డ్ మెడల్ సాధించి, శాస్త్రీయ సంగీతంలో పీహెచ్‌డీ చేసినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు హరిప్రియా,నరసింహల ఆశీస్సులతో తన ప్రయాణం ముందుకు సాగిందని, పెళ్లయిన తర్వాత భర్త శ్రీరామ్ సహకరించడంతో డాక్టరేట్ అందుకోగలిగానని సంతోషం వ్యక్తం చేశారు. సుష్మకు డాక్టరేట్ లభించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వెండి పతకం



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బరువును ఎత్తుతున్న రమణ

నెల్లిమర్ల రూరల్: ముంబైలో ఈ నెల 15 నుంచి జరుగుతున్న 69వ ఆల్ ఇండియా రైల్వే వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కొండవెలగాడ గ్రామానికి చెందిన కోరాడ రమణ వెండి పతకం సాధించాడు. పురుషుల విభాగంలో స్నాచ్ 118 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్ 151 కేజీలు, మొత్తంగా 269 కేజీల బరువును ఎత్తి పతకం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా రమణకు జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, ఆర్టీసీ రీజనల్ చైర్మెన్ బంగారమ్మ అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ అధికారుల నిజాయితీ



ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రయాణికుడు

విజయనగరం క్రైమ్: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి పోగొట్టుకున్న రెండు తులాల బంగారు ఆభరణాన్ని తిరిగి అప్పగించి ఆర్టీసీ అధికారులు నిజాయితీ నిరూపించుకున్నారు. భీమవరం నుంచి బత్తిలి వెళ్తున్న బస్సులో ప్రయాణిస్తున్న ఎం.హుస్సేన్..తనకు చెందిన సుమారు రెండు తులాల బంగారు వస్తువు పోయినట్లు గుర్తించి, విజయనగరం విచారణ కేంద్రం వద్ద వివరాలు చెప్పాడు. దీంతో హుస్సేన్ బస్ టికెట్ ఆధారంగా సంబంధిత బస్ డ్రైవర్‌కు ఆర్టీసీ అధికారులు ఫోన్ చేసి సంప్రదించారు. బస్సులో బంగారం ఉందని గుర్తించి ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ సత్యం, కంట్రోలర్ కృష్ణలు హుస్సేన్ వివరాలు పరిశీలించి, బస్సు డ్రైవర్ స్వామి, కృష్ణల చేతుల మీదుగా తిరిగి అందజేశారు. ఈ మేరకు ప్రయాణికుడు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపాడు.

జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గం ఏర్పాటు



నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న దృశ్యం

పార్వతీపురం టౌన్: జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకుడు, పంచాయతీరాజ్ ఈఈ ఎంవీఆర్ కృష్ణాజీ అధ్యక్షతన మంగళవారం పార్వతీపురం పట్టణంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా ఎం.రత్నకుమార్, ప్రధాన కార్యదర్శిగా డి.చంద్రమౌళి, కోశాధికారిగా ఎం.డి ఫరూక్, ఉపాధ్యక్షులుగా కేవీ నాగేశ్వరరావు, కె.చిన్నారావు, సంయుక్త కార్యదర్శులుగా సీహెచ్ సీతారాం, కిల్లక రాజు, తాడంగి సాయిబాబు, పల్ల సురేష్‌లు ఎంపికయ్యారు.

బొలెరో బోల్తా పడి నలుగురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం టౌన్: కొమరాడ మండలంలో బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో నలుగురికి గాయాలయ్యాయి. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన బొజ్జ సూర్యనారాయణ, బొమ్మిడాల కాశిశెట్టి, బొజ్జ ప్రదీప్, బొలెరో డ్రైవర్ కొర్నాన లక్ష్మణ్‌లు కొమరాడ నుంచి ఉల్లిభద్ర వెళ్తుండగా సోమినాయుడు వలస గ్రామం దాటిన తరువాత వీల్ బోల్ట్ యాక్సిల్ విరిగిపోవడంతో వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో నలుగురికీ గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. క్షతగాత్రుల్లో బొజ్జ సూర్యనారాయణ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

మోటార్ సైకిల్ ఢీకొని వ్యక్తికి..



గాయపడిన శాంతినాయుడు

పార్వతీపురం మండలం పుట్టూరు గ్రామానికి చెందిన పి. శాంతినాయుడు మోటార్ సైకిల్ ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. సోమవారం రాత్రి స్థానిక వెంకంపేట గోరీల నుంచి వైకెఎం కాలనీకి శాంతినాయుడు నడుచుకుంటూ వెళ్తుండగా అంటీ టీకొట్టు సమీపంలో ఎదురుగా మోటార్ సైకిల్‌పై వస్తున్న వ్యక్తి ఢీకొట్టాడు. ఈ సంఘటనలో శాంతినాయుడు తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు.

సైకిల్ ఢీకొని వృద్ధుడికి..



చికిత్స పొందుతున్న వీరయ్య

వీరఘట్టం మండల కేంద్రానికి చెందిన నత్తల వీరయ్య పొలానికి నడుచుకుంటూ వెళ్తుండగా జోగింపేట బ్రిడ్జి మలుపు దగ్గర గుర్తు తెలియని వ్యక్తి మోటార్ సైకిల్ తో ఢీకొనడంతో గాయాల పాలయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే వీరఘట్టం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్లగా అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

అయ్యప్ప విగ్రహాన్ని తాకిన సూర్యకిరణాలు



స్వామి పాదాలను తాకిన సూర్యకిరణాలు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని దుర్గచెట్టు ఆవరణలో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయంలోని మూలవిరాట్‌ను మంగళవారం వేకువజామున సూర్యకిరణాలు స్పర్శించాయి. ఈ మందిరంలో ఏటా కార్తీకమాసం నుంచి సంక్రాంతి వరకు ప్రతి రోజూ ఈ అద్భుతం జరుగుతుందని ఆలయ ట్రస్టీ, ప్రముఖ నాడీ జ్యోతిష్యుడు, గురుస్వామి మురపాక కాళిదాసు శర్మ తెలిపారు. అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములు ఈ కిరణ స్పర్శను అధికసంఖ్యలో తిలకించారు.

విజయనగరం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి నెల్లిమర్ల

- ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన కలెక్టర్



ఎ.సూర్యకుమారి, కలెక్టర్

విజయనగరం అర్బన్: చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న నెల్లిమర్ల మండలాన్ని విజయనగరం రెవెన్యూ డివిజన్ పరిధిలో మిళితం చేసేందుకు అనుగుణంగా సంబంధిత ప్రాథమిక నోటిఫికేషన్‌ను కలెక్టర్ ఎ.సూర్యకుమారి మంగళవారం జారీ చేశారు. ప్రభావిత వ్యక్తులు అభ్యంతరాలు, సూచనలను నెల రోజుల్లోగా కలెక్టర్ కార్యాలయానికి తెలుగు లేదా ఆంగ్లంలో అందజేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గెజిట్లో పేర్కొన్న మేరకు సంబంధిత ప్రతిపాదనలు ఉన్న నోటీసులను చీపురుపల్లి, విజయనగరం ఆర్డీవోలకు, నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీఓలకు కలెక్టర్ జారీ చేశారు. అభ్యంతరాలకు నవంబర్ 10వ తేదీ నుంచి నెల రోజుల గడువు వర్తిస్తుందని స్పష్టం చేశారు. జిల్లాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా నెల్లిమర్ల మండలం చీపురుపల్లి రెవెన్యూ పరిధిలోకి వెళ్లిపోయిన విషయం విదితమే.

ఓవరాల్ చాంపియన్స్‌కు అభినందనలు

ఇటీవల విజయవాడలో జరిగిన రెవెన్యూ ఉద్యోగుల క్రీడల్లో జిల్లా ఉద్యోగులు 30 అంశాలలో ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించినందుకు కలెక్టర్ సూర్యకుమారి అభినందించారు. ఈ మేరకు కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం తహసీల్దార్లతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కూడా రెవెన్యూ అసోసియేషన్ తరఫున అప్పుడప్పుడు ఇలాంటి పోటీలు జరగాలని అందువల్ల క్రీడా స్ఫూర్తి కలుగుతుందని అభిప్రాయ పడ్డారు. ఏఏ అంశాలలో ఎవరెవరు గెలుపొందారో తెలుసుకుని పేరుపేరునా అందిరినీ కలెక్టర్ అభినందించారు.

వచ్చే నెల 30న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితాను డిసెంబర్ 30న ప్రచురించనున్నట్లు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. నవంబర్ 7తో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిందని, ఆన్‌లైన్ ద్వారా, భౌతికంగా సుమారు 60 వేల దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిశీలించి డూప్లికేషన్, తప్పులున్న దరఖాస్తులను తిరస్కరిస్తామని చెప్పారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో మంగళవారం రాజకీయ పక్షాల ప్రతినిధులు, ఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితాను ఈ నెల 23న ప్రచురిస్తామని ఆ జాబితాను ఎన్నికల జిల్లా వెబ్‌సైట్‌లో పెడతామని తెలిపారు. 23 నుంచి డిసెంబర్ 9 వరకు క్లైమ్స్, అభ్యంతరాలు ఫైల్ చేసి డిసెంబర్ 25న క్లెయిమ్స్‌ను పరిష్కరిస్తామన్నారు. రాజకీయ పక్షాల నుంచి అభ్యంతరాలుంటే రెండు రోజుల్లో రాత పూర్వకంగా తెలపాలని కలెక్టర్ కోరారు.

పట్టాలమ్మకు వెండి కిరీటం బహూకరణ



పట్టాలమ్మవారు



అమ్మవారి కిరీటం ఊరేగింపుగా తీసుకొస్తున్న ధర్మకర్త గోవిందరావు తదితరులు

లక్కవరపుకోట: మండల కేంద్రం లక్కవరపుకోట గ్రామదేవత పట్టాలమ్మవారికి దాతలు మూడు కిలోల వెండి కిరీటాన్ని, ఇతర వెండి ఆభరణాలను బహూకరించారు. అమ్మవారి ఆలయ ధర్మకర్త సంఘం గోవిందరావు ఆధ్వర్యంలో పలువురు భక్తులు సుమారు రూ.3లక్షలు విరాళాలు సేకరించి అమ్మవారికి కిరీటం, వడ్డాణం తదితర ఆభరణాలను తయారు చేయించారు. ఈ మేరకు మంగళవారం ఆభరణాలను గ్రామ పురవీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించిన అనంతరం వేద పండితుడు అక్కాజోస్యుల శ్రీహరిశర్మ మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా అమ్మవారికి అలకంరించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద భారీగా అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్

డెంకాడ: సోషల్ ఇంజినీరింగ్ దాడుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సాప్ ల్యాబ్ అప్లికేషన్ సెక్యూరిటీ లీడ్, సీనియర్ డైరెక్టర్ వడ్లమూడి అనిత అన్నారు. మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీపై రెండు రోజుల పాటు జరగనున్న వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. దీనిలో ఆమె మాట్లాడుతూ సోషల్ ఇంజినీరింగ్ దాడులు ఎలా ఉన్నాయో, వాటిని నివారించవచ్చని వివరించారు. వ్యక్తిగత డేటా, తదుపరి ప్రమాదాలను క్యాప్చర్ చేయగల ఆన్‌లైన్ గేమ్‌ల కోసం ఓటీపీఎస్ లేకపోతే లింక్‌లను షేర్ చేయరాదన్నారు. కార్యక్రమంలో ట్రైనర్ సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి.హరి బాబు, డీన్ జి.ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

'అవతలివైపుకే...' పుస్తక పరిచయం


పుస్తక సమీక్ష చేస్తున్న రచయిత అప్పలరాజు

విజయనగరం టౌన్: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా శాఖ, యువ స్పందన సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక గురజాడ గ్రంథాలయం ఆవరణలో నిర్వహించిన 'అవతలివైపుకే...' కవిత్వం పుస్తక పరిచయ సభ వేడుకగా నిర్వహించారు. అరసం జిల్లా అధ్యక్షుడు జీఎస్.చలం సభాధ్యక్షత వహించారు. పుస్తక పరిచయం రత్నాల బాలకృష్ణ వహించగా, పుస్తక రచయిత ఉప్పల అప్పలరాజు సమీక్ష చేశారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. ప్రముఖ కవి, సాహితీ విమర్శకులు మానాపురం రాజా చంద్రశేఖర్ నిర్వహణలో చేపట్టిన కార్యక్రమంలో సాహితీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రంథాలయాలపై అవగాహన ర్యాలీ


గ్రంథాలయ అవగాహన ర్యాలీలో పాల్గొన్న కళాశాల విద్యార్థులు

విజయనగరం అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మహరాజా కళాశాల గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ తొలిత కళాశాల నుంచి ప్రారంభమై కోట జంక్షన్, గంటస్తంభం కూడలి మీదుగా తిరిగి కళాశాలకు ర్యాలీ చేరింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు, గ్రంథాలయ శాఖ అధ్యాపకుడు డి.ఎరుకునాయుడు, లైబ్రరీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాజులరేగలో

విజయనగరం రూరల్: కార్పొరేషన్ పరిధిలోని గాజులరేగ శాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ లక్ష్మణరావు, గాజులరేగ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే సంతృప్తి


నిరుపేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఏఐటీసీసీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ ట్రస్ట్ (ఏఐటీసీసీ) జిల్లా మహిళా కమిటీ అధ్యక్షురాలు అనితాదేవి ఆధ్వర్యంలో స్థానిక కంటోన్మెంట్ బాప్టిస్ట్ చర్చి కమ్యూనిటీ హాల్‌లో నిరుపేద మహిళలకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఐటీసీసీ వ్యవస్థాపకులు జయశాలి పిడి సుందరరావు 73వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిరుపేదలకు తమవంతు బాధ్యతగా సేవలందిస్తున్నామన్నారు. ఉపకార ధర్మం చేయడం మరువద్దు అన్న క్రీస్తు మాటను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ నిర్భాగ్యులకు సేవలందించాలని పిలుపునిచ్చారు. నిరుపేదలకు సేవలతోనే ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు. దీన్ని అందరూ గుర్తించి నిరుపేదలకు సేవలు చేయాలని ఆకాంక్షించారు. వాక్యోపదేశకులుగా సిస్టర్ వై.షీబా వ్యవహరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పట్నాన పైడిరాజు, ఏఐటీసీసీ వైస్ ప్రెసిడెంట్ స్వర్ణ, ప్రధాన కార్యదర్శి మౌనిక, సహ కార్యదర్శి పి.మేరీ, కోశాధికారి రూతు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బడ్డుకొండ


మాన్యంకల్లాలు గ్రామంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, అభివృద్ధి పనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని అక్కివరం పంచాయతీలోని అక్కివరం, యాతపేట, మాన్యం కల్లాలు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు చేకూరిన ఆర్థిక ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.20 లక్షలు అందిస్తున్నారని తెలిపారు. వీటితో పాటు అవసరమైన చోట ఇతర విభాగాల నుంచి నిధులను మంజూరు చేస్తామన్నారు. గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించినప్పుడు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోనే ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయని వివరించారు. నాడు - నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. ఆర్థిక ఇబ్బందులతో విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో అమ్మ ఒడి పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారని చెప్పారు. విడతల వారీగా పొదుపు సంఘాల మహిళలకు రుణమాఫీ డబ్బులు అందిస్తున్నారని వివరించారు. రైతుల మొదలుకుని,వృద్ధులకు అందరికీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాయం అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్ కంది కిరణ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు బాలి సత్యన్నారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు హాజరయ్యారు.

ప్రజాస్వామ్యానికి పత్రికా స్వేచ్ఛ శ్రీరామరక్ష


జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పురస్కారం ప్రధానం

విజయనగరం: ప్రజాస్వామ్యానికి పత్రికా స్వేచ్ఛ శ్రీరామరక్ష అని వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు ప్రతీ విషయంలోను సమాజాన్ని పత్రికలు జాగృతం చేస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. పాత్రికేయ వ్యవస్థ ఎంతో ఉన్నత విలువలు కలిగిన పవిత్రమైన వ్యవస్థ అని, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా కీలకపాత్రను పోషిస్తుందన్నారు. 2022 సంవత్సరానికిగాను జాతీయ పత్రికా దినోత్సవ పురస్కారాన్ని సీనియర్ పాత్రికేయులు పంచాది అప్పారావుకు ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్‌తో కలిసి శ్రీనివాసరావు పురస్కారాన్ని ప్రదానం చేసారు. కార్యక్రమంలో సంఘం జిల్లా శాఖ గౌరవ అధ్యక్షుడు కంచర్ల రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎం సుభద్రాదేవి, ఉపాధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, సీనియర్ పాత్రికేయులు లింగాల నరసింగరావు, వీఎస్ఏ కుమార్, పీజే శర్మ, ఎం.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందుండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల అమలులో మండలం అన్నింటా ముందుండాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ పథకం అమలు, పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, విద్యా శాఖ, ఉపాధిహామీ పథకం, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, తదితర అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకు వివరించాలని ప్రజాప్రతినిధులను కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, ఎంపీడీఓ వెంకటరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తృణధాన్యాలతో ఆరోగ్యం


రైల్వేస్టేషన్‌లో మిల్లెట్స్‌తో తయారుచేసిన పదార్థాల స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

విజయనగరం టౌన్: తృణధాన్యాలతోనే రైలు ప్రయాణికులకు ఆరోగ్యం సిద్ధిస్తుందని విజయనగరం పార్లమెంటు సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్‌పైన విశాఖకు చెందిన అవినాష్ సంస్థ ఆధ్వర్యంలో చిరు, తృణధాన్యాలతో తయారుచేసే వివిధ రకాల కేక్‌లు, బిస్కెట్లు, సున్నుండలు, వంటి ఆహార పదార్థాలకు సంబంధించిన స్టాల్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బెల్లాన 90శాతం మిల్లెట్స్‌తో తయారు చేసిన పదార్థాలు ఆహారపదార్థాలతో వాడుతున్నామన్నారు. అందరికీ అందుబాటు ధరలో ఉంచుతున్నామన్నారు. అవినాష్ సంస్థ ప్రతినిధి ప్రజ్ఞానంద్ మాట్లాడుతూ చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను అందరికీ అందుబాటులో ఉంచుతున్నామన్నారు. 2023లో ఐక్యరాజ్య సమితి ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్‌గా ప్రకటించిందన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని రైల్వేస్టేషన్‌లలో తృణధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలను ప్రయాణికులకు అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రేమసమాజం అధ్యక్షుడు డాక్టర్ బిఎస్ఆర్.మూర్తి, డాక్టర్ వంశీపావని, డాక్టర్ వెంకట్, సాయిపద్మ, లక్ష్మి, రామకృష్ణ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సంక్షేమ పాఠశాలకు కంప్యూటర్ల వితరణ



ఎస్పీ ఎం.దీపికకు జ్ఞాపిక బహుకరిస్తున్న మైలాన్ కంపెనీ ప్రతినిధులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న శార్వాణీ పోలీసు సంక్షేమ ఆంగ్ల పాఠశాలకు మైలాన్ కంపెనీ యాజమాన్యం కంప్యూటర్లు, ఇతర పరికరాలను మంగళవారం అందజేసింది. ఎస్పీ ఎం.దీపిక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మైలాన్ సీఎస్ఆర్ హెడ్ ఎం.డొమినికతో కలిసి కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పోలీసు సంక్షేమ పాఠశాలను సందర్శించే సమయంలో విద్యార్థులకు కంప్యూటర్ విద్యనందించేందుకు ల్యాబ్ ఉంటే బాగుంటుందని భావించి మైలాన్ యాజమాన్యాన్ని సంప్రదించామన్నారు. దీంతో వారు స్పందించి విద్యార్థులకు ఉన్నత విద్యనందించాలనే లక్ష్యంతో రూ.5 లక్షల వ్యయంతో పది కంప్యూటర్లు, ఒక కలర్ ప్రింటర్, ఇన్వర్టర్‌ను అందించారన్నారు. కార్యక్రమంలో హెచ్ఆర్ హెడ్ డాక్టర్ ఎస్ఎం.రావు, ప్లాంట్ హెడ్ ఎన్. అంజనీ కుమార్, సీనియర్ జీఎం కెజి.రావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎంఎం.సోల్మన్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, వెల్ఫేర్ ఆర్ఐ పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో కళా ఉత్సవ్ పోటీలు

నెల్లిమర్ల: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లో గల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 21, 22 తేదీల్లో కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుపతినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. నెల్లిమర్ల పట్టణంలోని వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఓకల్ మ్యూజిక్(క్లాసికల్, ట్రెడిషనల్), ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్, డ్యాన్స్(క్లాసికల్, ఫోక్), విజువల్ ఆర్ట్స్(డ్రాయింగ్, 3డి, 3డి), ఏకపాత్రాభినయం, స్వదేశీ బొమ్మలు, ఆటలు అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థుల వివరాలను సంబంధిత హెచ్ఎంలు ఈ నెల 19వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. వివరాలకు కళాశాల అధ్యాపకులు రవికుమార్ (7989350244), సూర్యారావు(8919985388), చంద్రశేఖర్(9440512438)ను సంప్రదించాలని తిరుపతినాయుడు సూచించారు.

కార్తీక వనభోజనాలతో ఐక్యత, ఆధ్యాత్మికత


కార్తీక వనభోజనం

విజయనగరం: కార్తీక వనభోజనాలు ఐక్యతకు, ఆధ్యాత్మికతకు నిలయాలని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని కస్పా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్తీకమాస వన సమారాధన విందు భోజనం కార్యక్రమాన్ని వీరు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఐక్యత నెలకొంటుందన్నారు. అందరూ ఒకటే భావం అన్న సందేశం కూడా ఈ వనభోజనాల వల్ల తెలుస్తుందని చెప్పారు. సంఘం అధ్యక్షుడు వెత్సా శ్రీనివాసరావు, నగర డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతి దేవి, సంఘం కార్యదర్శి ముత్యాల నాగేశ్వరరావు, కోశాధికారి కోలగట్ల కామేశ్వరరావు, ప్రాజెక్ట్ చైర్మన్ ముత్యాల శ్రీనివాసరావు, సిరం గవరరాజు, గ్రంధి సూర్యారావు, చెక్క కృష్ణ కాంతులతో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కళాశాలల్లో ఇంటర్మీడియెట్ సర్టిఫికెట్లు

విజయనగరం పూల్‌బాగ్: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం(జనరల్,ఒకేషనల్) కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు ఆయా కళాశాలలకు పంపించామని ఆర్ఐఓ మజ్జి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు చదువుకున్న కళాశాలలకు వెళ్లి ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్లు తీసుకోవాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లిమర్ల: ఎస్ఎఫ్ఐ 30వ జిల్లా మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆ సంఘం ప్రతినిధులు నెల్లిమర్ల పట్టణంలో మంగళవారం ఆవిష్కరించారు. డిసెంబరు 3, 4 తేదీల్లో బొబ్బిలి పట్టణంలో నిర్వహించే సభల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తోందని జిల్లా కమిటీ ప్రతినిధి అరవింద్ చెప్పారు.

ఎయిడ్స్ నియంత్రణపై వీధి నాటకం

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో ఎయిడ్స్ నియంత్రణపై మంగళవారం వీధి నాటకం ప్రదర్శించారు. ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన నాటకం ద్వారా స్థానికులకు ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించారు. వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాగవవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అసిస్టెంట్ జీపీగా చంద్రశేఖర్

విజయనగరం లీగల్ : విజయనగరం అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాదిగా నక్కిన చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. ప్రభుత్వం తరఫున సివిల్ కేసుల్లో విచారణ చేసి వాదనలు వినిపిస్తారు. చంద్రశేఖర్ స్వస్థలం గుర్ల మండలం కోటగండ్రేడు గ్రామం. 2002లో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి లా పట్టా పొందారు. అదే ఏడాది స్థానిక సీనియర్ న్యాయవాది కె.కృష్ణమూర్తి వద్ద జూనియర్‌గా వృత్తిలో చేరారు. ఈయన నియామకం పట్ల న్యాయవాదుల సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధి గ్రామసభ బహిష్కరణ


పూసపాటిరేగలో గ్రామసభ బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచ్ , ఉపసర్పంచ్, సభ్యులు

పూసపాటిరేగ: గతంలో చేసిన ఉపాధి హామీ పనులకే బిల్లులు చెల్లించలేదు, కమీషన్లు ఇవ్వలేదనే కారణంతో పనులు చేయించి ఎస్టిమేట్లు వేయలేదని పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు ఉపాధి గ్రామసభను బహిష్కరించి పంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. పూసపాటిరేగలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులు 2022 - 23 ప్రణాళిక గ్రామసభలో సర్పంచ్ టి.సీతారాం, వైస్ సర్పంచ్ మహంతి జనార్ధనరావు సభ నుంచి బయటకు వచ్చేశారు. గత ఏడాది పంచాయతీ తీర్మానంతో చేసిన పనులకు నేటికి అంచనాలు వేయలేదని, వాటికి బిల్లులు చెల్లించలేదని ఉపాధి హామీ పథకం ఏపీఓ కనకరాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజినీరింగు కన్సల్టెంటు శైలాడ రమణ లంచాలు ఇచ్చిన వారికి బిల్లులు మంజూరు చేయించారని ఆరోపించారు. లంచాలు ఇవ్వని కారణంగా తమకు బిల్లులు మంజూరు చేయలేదన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంటు శైలాడ రమణ చేతిలో ఏపీఓ కనకరాజు కీలుబొమ్మగా మారి ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధి హామీ అధికారులు తీరుతో గ్రామంలో అభివృద్ధి నిలిచిపోయిందని సభ నుంచి సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు సభ్యులు, గ్రామస్తులు బయటకు వచ్చేశారు. రెల్లివలసలో జరిగిన గ్రామసభలో సర్పంచ్ ఇజ్జరోతు అప్పలరాజు సమస్యలను ఏకరవు పెట్టారు. సచివాలయం భవనం, రైతుభరోసా కేంద్రాలు నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. ఎన్నిసార్లు తీర్మానాలు చేసినా గ్రామంలో పనులు జరగలేదని ఆరోపించారు.

క్రికెట్ క్రీడాకారుల ఎంపిక


క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సలహాదారు భానుప్రకాశ్

భోగాపురం: రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న సీఎం ప్రైజ్‌మనీ క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం ఆవరణలో క్రికెట్ క్రీడాకారుల ఎంపిక మంగళవారం నిర్వహించారు. క్రికెట్ నియోజకవర్గ ఇన్‌చార్జి లీలాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సలహాదారు పడాల భానుప్రకాశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని క్రికెట్ క్రీడాకారుల ఎంపికను ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌కు సంబంధించి నాలుగు మండలాల నుంచి 40 మంది క్రికెట్ క్రీడాకారులు పాల్గొనగా వారిలో 17 మంది క్రీడాకారులను సీఎం ప్రైజ్‌మనీ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సలహాదారు పడాల బానుప్రకాశ్, సుందర హరీష్, ప్రధానోపాధ్యాయుడు వైదా శ్రీరామ్, పీడీ నాగన్న, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సినీ నటుడు కృష్ణకు నివాళులు


సూపర్ స్టార్ కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న థియేటర్ల మేనేజర్లు, అభిమానులు

విజయనగరం టౌన్: సూపర్ స్టార్‌గా ప్రజల మన్ననలు పొంది 350 సినిమాలకు పైగా తీసి చరిత్ర పుటల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సృష్టించుకున్న సినీనటుడు కృష్ణ అకాల మృతి సినీరంగంతో పాటూ అభిమానులను కలిచివేసింది. స్థానిక ఎన్‌సీఎస్ థియేటర్‌లో అభిమాన సంఘాల ప్రతినిధులతో పాటూ థియేటర్ల యాజమాన్యాలు మంగళవారం సంతాపం వ్యక్తం చేశాయి. కృష్ణ మృతికి నివాళులర్పిస్తూ మార్నింగ్ షోను పూర్తిగా రద్దు చేశారు. అనంతరం కృష్ణ అభిమాన సంఘం నాయకుడు బొండాడ వీధికి చెందిన హుస్సేన్ మాట్లాడుతూ 1972లో పండంటి కాపురం చిత్రానికి సంబంధించి కృష్ణ న్యూపూర్ణ థియేటర్‌కి వచ్చారని గుర్తు చేసుకున్నారు. అనంతరం కృష్ణ చిత్రపటం వద్ద థియేటర్ల మేనేజర్లు పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. ఎన్‌సీఎస్ మేనేజర్ శ్రీనివాసరావు, కృష్ణా థియేటర్ మేనేజర్ ప్రసాద్, రంజని, శివ రంజని ఎస్‌వీఎస్ మేనేజర్ సాయి, హిమగిరి అప్పలనాయుడు, లీలామహల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సూపర్ స్టార్ పుస్తకాన్ని స్వయంగా ఆవిష్కరించారు

సూపర్ స్టార్ అంటే తెలుగు తెరకు కృష్ణ అనే చెప్పక తప్పదని ప్రముఖ రచయిత సముద్రాల గురుప్రసాద్ పేర్కొన్నారు. 2013లో పద్మభూషణ్ కృష్ణ సినీ జీవిత విశేషాలపై తాను రాసిన సూపర్ స్టార్ పుస్తకాన్ని కిన్నెర పబ్లికేషన్స్ అధినేత కిన్నెర రఘురామ్ ప్రచురించి పుస్తకాన్ని కృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించడం మరువలేనిదన్నారు.

సినీ రంగానికి తీరని లోటు

నెల్లిమర్ల: సూపర్ స్టార్ కృష్ణ మృతి సినీ రంగానికి తీరని లోటు అని నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో కృష్ణ సంతాప సభ మంగళవారం రాత్రి నిర్వహించారు. స్థానిక పెద్దలు, అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మద్దిల వాసు, నల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నందకిషోర్



గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన సీనియర్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ గార్లపాటి నందకిషోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నంద్యాలలో ఆదివారం జరిగిన అసోసియేషన్ వార్షిక సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు.

జర్నలిస్ట్ మూర్తిని విచారించిన సీఐడీ

సాక్షి, అమరావతి: సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు కుట్ర పన్నిన కేసులో భాగంగా టీవీ 5 జర్నలిస్ట్ మూర్తిని సీఐడీ అధికారులు మంగళవారం విచారించారు. మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో ఆయన్ను విచారణ చేశారు. కొంతకాలం క్రితం సీఎం జగన్, రాష్ట్ర ప్రభుత్వంపై నరసాపురం ఎంపీ కె.రఘురామకృష్ణరాజు అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా సమాజంలో వర్గ విద్వేషాలు రెచ్చగొట్టేందుకు యత్నించారు. ఈ కేసు విచారణలో భాగంగా మూర్తిని విచారించారు.

ఇన్‌ఫ్రా సంస్థలపై ఐటీ దాడులు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ కేంద్రంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణ ప్రాజెక్టులు చేపడుతున్న రెండు ఇన్‌ఫ్రా సంస్థలపై విశాఖపట్నం ఆదాయ పన్ను శాఖ అధికారులు దాడులు చేశారు. సారథి ఇన్‌ఫ్రా, సత్యేంద్ర ఇన్‌ఫ్రా సంస్థలు బోగస్ బిల్లులు సృష్టించి పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై ఈ నెల 14వ తేదీ నుంచి సోదాలు నిర్వహిస్తున్నారు. విశాఖపట్నంతో పాటు తణుకు, భీమవరం, రాజమండ్రి ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు చేపట్టారు. దేశంలోని పలు ప్రధాన సంస్థలకు సబ్ ఇన్‌ఫ్రా సంస్థలుగా వ్యవహరిస్తూ.. ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాజెక్టులని సదరు సంస్థలు పనులు నిర్వహిస్తుంటాయి. ఆదాయపు పన్నుని ఎగవేసేందుకు లేని ఖర్చులు చూపిస్తూ రెండు సంస్థలు కూడా రిటర్న్స్ ఫైల్ చేశారన్న సమాచారంతో విశాఖపట్నం ఐటీ విభాగాధికారులు దాడులు ప్రారంభించారు. పన్ను ఎగవేతకు సంబంధించిన ఆధారాలతో పాటు కీలక డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ సోదాలు బుధవారం కూడా కొనసాగుతాయని తెలుస్తోంది.

బైజూస్‌పై బురద రాతలు

ఆంగ్లంలోనే పాఠాలున్నాయంటూ 'ఈనాడు' అసత్యాలు

- విద్యార్థులు తెలుగు భాషనూ ఎంపిక చేసుకునేలా ఏర్పాట్లు
- సందేహాలు నివృత్తి చేసుకునే సదుపాయం ఉంది



సాక్షి, అమరావతి: ఆధునిక నైపుణ్యాలను సంతరించుకుని ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేలా బైజూస్ పాఠ్యాంశాలతో విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతుంటే 'ఈనాడు' వక్ర భాష్యాలు చెబుతోంది. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చేపట్టి వివిధ పథకాల ద్వారా విద్యార్థుల చదువులకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తున్న విషయం తెలిసిందే. గత సర్కారు హయాంలో అస్తవ్యస్తమైన విద్యా రంగాన్ని వివిధ పథకాలతో సీఎం జగన్ ముందుకు తీసుకువెళ్తున్నారు. బైజూస్ భాగస్వామ్యం ద్వారా అత్యంత నాణ్యమైన కంటెంట్‌ను విద్యార్థులకు ఉచితంగా అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వానికి మంచిపేరు వస్తుండడంతో సహించలేక ఈనాడు 'విషం చిమ్ముతోంది. ఇందులో నిజానిజాలివీ..

బైజూస్‌తో బోలెడు ప్రయోజనాలు

బట్టీ చదువుల స్థానంలో ఆహ్లాదంగా చదువుకునేలా తరగతి గదిని రూపొందించాలని జాతీయ విద్యా విధానం 2020 సూచించింది. ఈ తరహా విధానాన్ని ప్రవేశపెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం బైజూస్ కంటెంట్‌ను స్మార్ట్ ఫోన్ల ద్వారా విద్యార్థులకు అందిస్తోంది. బైజూస్ కంటెంట్ టీచర్లు, పిల్లలకు ఉపయోగపడేలా ప్రపంచ స్థాయి నాణ్యతతో రూపొందించారు. దీనివల్ల తరగతి గది బోధనలో నాణ్యత పెరగటంతో పాటు బడిలో నేర్చుకున్న అంశాలు ఇంటి వద్ద పునశ్చరణ చేయడానికి అవకాశం కలుగుతోంది. పిల్లలు ఎప్పుడైనా పాఠశాలకు హాజరు కాలేకపోతే వీలైన సమయంలో నేర్చుకునేందుకు డిజిటల్ కంటెంట్ ఉపయోగపడుతుంది. ఇందులో ఉపయోగించిన చిత్రాలు, వీడియోలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు నేర్చుకునేలా దోహదం చేస్తాయి. పాఠ్య పుస్తకాలలో ఇచ్చిన సమాచారాన్ని చిన్న విభాగాలుగా రూపొందించడం వల్ల సంక్లిష్ట అంశాలను సులువుగా నేర్చుకుంటారు. 471కి పైగా వీడియోలతో నేర్చుకునేందుకు అనువుగా ఉన్నాయి.

గొప్ప వరం..

బైజూస్ ద్వారా ఉచితంగా పాఠాలు అందించడం పేద పిల్లలకు గొప్ప వరం. ఈ లెర్నింగ్ కోసం పిల్లలందరికీ, ఉపాధ్యాయులకు కూడా ఉచితంగా ట్యాబ్‌లను సమకూరుస్తుండడం సాహసోపేత నిర్ణయం.

– ఎస్.మహేంద్రరెడ్డి, టీచర్, తంగేగుకుంట, శ్రీసత్యసాయి జిల్లా

రెండు భాషల్లో చక్కగా..

బైజూస్ వీడియో పాఠాలను అన్ని తరగతుల వారు వింటున్నారు. తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో చక్కటి ఉదాహరణలతో స్థాయికి తగ్గట్లు వీడియో అంశాలున్నాయి.

– కె.పుష్పవతి, సైన్స్ టీచర్, ఎంసీయూపీ స్కూల్, ఏలూరు

చాలా బాగుంది..

బైజూస్ కంటెంట్ చాలా బాగుంది. విద్యార్థులకు, టీచర్లకు ఎంతో సహాయపడుతుంది. వీడియోలు పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా అద్భుత అనుభూతి కలిగిస్తున్నాయి.

– సంధ్య, ప్రిన్సిపాల్, ఏపీఎమ్మెస్, అక్కివరం, విజయనగరం

అద్భుతంగా నేర్చుకుంటున్నారు...

బైజూస్ యాప్ ద్వారా పిల్లలకు వీడియో పాఠాలు చెబుతున్నాం. కంటెంట్ చాలా బాగుంది. పిల్లలు అద్భుతంగా నేర్చుకుంటున్నారు. అన్ని సబ్జెక్టులు అర్థవంతంగా, ఉపయోగకరంగా ఉన్నాయి. పిల్లలు బడికి హాజరు కాని సందర్భాల్లో ఇది చాలా సహాయపడుతుంది. సెలవు రోజుల్లో కూడా ఇంటి వద్ద పాఠ్యాంశ బోధన జరగడం అద్భుతంగా ఉంది.

– ఎం.నరసింహారెడ్డి, హెచ్.ఎమ్, జెడ్పీ హైస్కూల్ సంబేపల్లి మండలం, అన్నమయ్య జిల్లా

అబద్ధం 1 — బైజూస్ కంటెంట్ కేవలం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంది

ఇది పూర్తి అవాస్తవం. పిల్లలు తెలుగు, ఇంగ్లీషులో నేర్చుకోవడానికి వీలుగా కంటెంట్ ఉంది. భాషను ఎంపిక చేసుకునే అవకాశం విద్యార్థులకు కల్పించారు.

అబద్ధం 2 — పిల్లల సందేహాల నివృత్తికి అవకాశం లేదు

పాఠశాలలో ఉపాధ్యాయుడు పాఠం బోధించాక సంబంధిత వీడియోను విద్యార్థులు పరిశీలించిన అనంతరం ఇంకా సందేహాలుంటే మరుసటి రోజు నివృత్తి చేస్తున్నారు. వలస వెళ్లిన పిల్లలు కూడా కంటెంట్‌ను ఫోన్‌లో చూసుకొని తర్వాత స్కూలుకు వచ్చి టీచర్ ద్వారా సందేహాలు నివృత్తి చేసుకునే వెసులుబాటు ఉంది.

అబద్ధం 3 — టీచర్లకు రూ.500 చాలదు

ఈ ప్రస్తావన సరి కాదు. కంటెంట్ ఉన్న వీడియోలు ప్రయోగాలకు సంబంధించినవి మాత్రమే కాకుండా ఆ సబ్జెక్టుకు సంబంధించినవైనందున విషయ పరిజ్ఞానార్జనకు మరింత ఉపయుక్తం. టీచర్లకు వీడియోలు అర్థం కావనడం వారిని అవమానించడమే.

సత్వరం పోలవరం పూర్తిచేయడమే అజెండా

- నేడు పీపీఏ సర్వసభ్య సమావేశం
- సవరించిన అంచనాల మేరకు నిధులు ఇవ్వాలని పట్టుబట్టనున్న రాష్ట్ర ప్రభుత్వం
- సకాలంలో నిధుల విడుదలకు డిమాండ్



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ(పీపీఏ) సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన మేరకు పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయడమే అజెండాగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. పీపీఏ సీఈవో చంద్రశేఖర్ అయ్యర్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని పీపీఏ కార్యాలయంలో నిర్వహించనున్న ఈ సమావేశంలో రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి తదితరులు పాల్గొంటారు. పీపీఏ గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారం ఏడాదికి రెండుసార్లు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాలి. ప్రాజెక్ట్ పనుల పురోగతిని సమీక్షించి, సమస్యలను పరిష్కరించడం ద్వారా సత్వరమే పూర్తి చేయడానికి ఈ సమావేశాలు దోహదపడాలనేది కేంద్రం ఉద్దేశం. కానీ, ఏడాదిగా సర్వసభ్య సమావేశం నిర్వహించాలని కోరుతున్నా పీపీఏ సీఈవో చంద్రశేఖర్ అయ్యర్ స్పందించడం లేదు. ఇటీవల రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ రాసిన లేఖకు ఎట్టకేలకు స్పందించిన అయ్యర్... పీపీఏ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయడం కోసం 2017–18 ధరల ప్రకారం సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లను ఆమోదించి.. ఆ మేరకు సకాలంలో నిధులు విడుదల చేయాలని ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తేల్చి చెప్పనుంది. నిర్వాసితులకు పునరావాసం కింద చెల్లించాల్సిన పరిహారాన్ని ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానంలో వారి ఖాతాల్లో జమ చేయాలని తాము చేసిన ప్రతిపాదనను అమల్లోకి తేవాలని కోరనుంది. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, పనుల వల్ల దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ భవితవ్యం, ఈసీఆర్‌ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన గోతులను పూడ్చే విధానాలను తక్షణమే తేల్చి... ఈ సీజన్‌లో చేపట్టాల్సిన పనులపై చర్చించనుంది. ఈ సీజన్‌లో దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తిచేయడంతోపాటు వరద ప్రారంభమయ్యేలోగా ఈసీఆర్‌ఎఫ్ నిర్మాణాన్ని ప్రారంభించి, శరవేగంగా పూర్తి చేయడానికి అవసరమైన అన్ని అనుమతులు సత్వరమే వచ్చేలా చేయాలని డిమాండ్ చేయనుంది.

నీటి లభ్యత తేల్చాకే కావేరికి గోదావరి

- ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశంలో పునరుద్ఘాటించిన రాష్ట్ర ప్రభుత్వం
- రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి వచ్చాకే పనులు చేపడతామన్న కేంద్రం

సాక్షి, అమరావతి: గోదావరిలో నీటి లభ్యతను శాస్త్రీయంగా తేల్చాకే కావేరి గ్రాండ్ ఆనకట్టకు గోదావరి జలాలను తరలించేలా గోదావరి – కావేరి అనుసంధానం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది. జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) పాలక మండలి 70వ సమావేశం మంగళవారం కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ అధ్యక్షతన వర్చువల్‌గా జరిగింది. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ డాక్టర్ ఆర్కే గుప్తా, ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్ భోపాల్‌సింగ్, అన్ని రాష్ట్రాల జలవనరుల శాఖ కార్యదర్శులు, ఈఎన్‌సీలు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. నదుల అనుసంధానంపై ఈ భేటీలో సమగ్రంగా చర్చించారు. ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141 టీఎంసీల గోదావరి జలాలను తుపాకులగూడెం నుంచి నాగార్జునసాగర్, సోమశిలల్లోకి, అక్కడి నుంచి కావేరి గ్రాండ్ ఆనకట్టకు తరలించేలా రూపొందించిన గోదావరి – కావేరి అనుసంధానం డీపీఆర్‌పై చర్చించారు. ఇందులో 40 టీఎంసీల చొప్పున ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడులకు కేటాయించి, కర్ణాటకకు 9.8 టీఎంసీలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ ఈ ప్రతిపాదనను వ్యతిరేకించాయి. తమ కోటాలో నీటిని మళ్లించడానికి అంగీకరించబోమని ఛత్తీస్‌గఢ్ చెప్పింది. గోదావరి ట్రిబ్యునల్ ప్రకారం ఇతర బేసిన్‌లకు మళ్లించే గోదావరి జలాలకుగాను తమకు కృష్ణా జలాల్లో అదనపు వాటా ఇవ్వాలని మహారాష్ట్ర పట్టుబట్టింది. తమకు ఏ ప్రాతిపదికన 9.8 టీఎంసీలు కేటాయించారని కర్ణాటక ప్రశ్నించింది. తమకు అంతకంటే ఎక్కువ కేటాయించాలని డిమాండ్ చేసింది. కావేరికి గోదావరి జలాలు తరలిస్తున్నందున, కావేరి జలాల్లో 92 టీఎంసీలు తమకు ఇవ్వాలని కేరళ కోరింది. గోదావరిలో మిగులు జలాలు లేవని, శాస్త్రీయంగా అధ్యయనం చేసి నీటి లభ్యతను తేల్చాలని ఏపీ డిమాండ్ చేసింది. నీటి లభ్యతను తేల్చాకే గోదావరి జలాలను కావేరికి తరలించాలని, అప్పుడే వర్షాభావ ప్రాంతాలకు సాగు, తాగు నీరు లభిస్తుందని పేర్కొంది. గత నెల 18న బెంగళూరులో జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలపై నివేదిక రూపకల్పనలో తాము వెల్లడించిన అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సిందేనని కోరింది. తెలంగాణ కూడా ఇదే రీతిలో స్పందించింది. రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి వచ్చాకే గోదావరి–కావేరి అనుసంధానం చేపడతామని జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్ కుమార్ స్పష్టం చేశారు.

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం

- 18 నాటికి వాయుగుండంగా మారే అవకాశం
- దక్షిణ కోస్తా, రాయలసీమలో మళ్లీ వర్షాలకు ఆస్కారం

సాక్షి, విశాఖపట్నం: దక్షిణ అండమాన్, దాని పరిసర ప్రాంతాల్లో సముద్రంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో బుధవారం అండమాన్‌కు ఆనుకుని ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. అనంతరం అది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ ఈ నెల 18 నాటికి దక్షిణ బంగాళాఖాతంలో వాయుగుండంగా మారుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం రాత్రి నివేదికలో తెలిపింది. ప్రస్తుతానికి ఉన్న అంచనాల ప్రకారం ఈ వాయుగుండం మరింత బలపడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అల్పపీడనం వాయుగుండంగా బలపడిన తర్వాత



ఈ నెల 19 నుంచి దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమలో వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ నెల 18 నుంచి తీరం వెంబడి ఈదురుగాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లవద్దని ఐఎండీ సూచించింది.

ఫార్మసిస్టు గ్రేడ్‌-2 పోస్టుల తుది జాబితా విడుదల

విజయనగరం ఫోర్ట్: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీల భర్తీకి సంబంధించి ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చిన ల్యాబ్‌టెక్నీషియన్ గ్రేడ్‌-2, ఫార్మసిస్టు గ్రేడ్‌-2 పోస్టు, జిల్లా లేబొరేటరీలో ల్యాబ్ అసిస్టెంట్ పోస్టుకు ఫైనల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటికి సంబంధించిన నియామక పత్రాలను త్వరలోనే అందిస్తామన్నారు.

జాబ్‌మేళాతో ఉపాధి

- స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ సాయికుమార్

పార్వతీపురం: చినమేరంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 18న నిర్వహించనున్న జాబ్ మేళాతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ వి.సాయికుమార్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడుతూ చెన్నై, హైదరాబాద్, తుని, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, శ్రీసిటీ వంటి నగరాల్లోని కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఎంపికైన పదోతరగతి నుంచి బీటెక్ వరకు చదివిన విద్యార్థులకు నెలకు రూ.10వేల నుంచి రూ.30 వేలు వరకు వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు వారి బయోడేటా, ఒరిజనల్ సర్టిఫికేట్స్, జెరాక్సులు, ఫొటోలు తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 89788 78557, 63051 10947, 63034 93720, 85559 09899 నంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రతీ శనివారం హౌసింగ్ డే

కొత్తవలస: ఇక నుంచి వారంలో ప్రతీ శనివారం హౌసింగ్‌డే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జీఓ విడుదల చేసిందని హౌసింగ్ డీఈ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతీ శనివారం మండల స్థాయి అధికారులు గ్రామాల్లోని జగనన్న లేవుట్‌లను సందర్శిస్తారని పేర్కొన్నారు. లే అవుట్‌లలో నిర్మాణాల తీరు,మౌలిక సదుపాయాల కల్పన, బిల్లుల చెల్లింపులు తదితర అంశాలను పరిశీలించి, ఏమైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరిస్తారని తెలిపారు. ఎస్.కోట నియోజకవర్గం పరిధిలో కొత్తవలస, ఎల్.కోట, జామి, ఎస్.కోట, వేపాడ మండలాల్లో 100 జగనన్న లేఅవుట్‌లలో 3,756 ఇళ్లు మంజూరు చేసినట్లు వివరించారు. ఈ నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు హౌసింగ్ డే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫీడ్ బ్యాక్ మెకానిజంతో

సేవల మెరుగుదల



పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్ సూర్యకుమారి

- వృత్తిని ప్రేమించడం ద్వారానే ఉత్తమ ఫలితాలు
- వైద్యారోగ్య శాఖ అధికారులతో కలెక్టర్

విజయనగరం అర్బన్:

వైద్య రంగంలో సేవల మెరుగుదలకు ఫీడ్ బ్యాక్ మెకానిజం దోహదం పడుతుందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర బృందం పర్యటించి జిల్లాలో సేవలపై సంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో మంగళవారం తన చాంబర్‌లో వైద్యారోగ్య శాఖ పరిధిలోని వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. వైద్య రంగంలో అందుతున్న సేవలపై సమీక్షించారు. వైద్యపరమైన సేవలపై ప్రజల స్పందన ఎలా ఉందని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల అభిప్రాయాలను సేకరిస్తూ ఉత్తమ సేవలందించాలని దానికి తగ్గట్టు ఫీడ్ బ్యాక్ మెకానిజం విధానాన్ని అందరూ అనుసరించాలని కలెక్టర్ సూచించారు. వైద్య వృత్తి చాలా పవిత్రమైనదని పేర్కొన్నారు.

ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించాలంటే అందరూ సమన్వయంతో పని చేయాల్సి ఉందన్నారు. రోగులు ప్రైవేటు ఆస్పత్రులు కాకుండా ప్రభుత్వ ఆస్పత్రులు వచ్చేలా మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల్లో నమ్మకాన్ని కలిగించాలన్నారు. నెల్లిమర్ల, భోగాపురం, బొబ్బిలి కేంద్రాల్లో వైద్య సేవలను మరింత మెరుగుపర్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వైద్యారోగ్య శాఖ పరిధిలో చేపట్టిన నాడు – నేడు అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలోని ఆస్పత్రుల నుంచి జిల్లా కేంద్ర ఆస్పత్రి వరకు సేవలను విస్తృతం చేయాలని పూర్తి స్థాయిలో మౌలిక వసతులను కల్పించాలని పేర్కొన్నారు.

విజయగాథల కోసం మ్యాగజైన్

జిల్లా పరిధిలో జరిగే వైద్యపరమైన అభివృద్ధి పనుల గురించి, ప్రజలకు అందించే సేవల గురించి తెలియజేసేలా ఇన్ హౌస్ మ్యాగజైన్ అందుబాటులోకి వస్తే బాగుంటుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఇతర ఆస్పత్రుల్లో ఉత్తమ సేవలందించే సిబ్బంది గురించి వైద్యాధికారుల గురించి వాటిలో విజయగాథలను ప్రచురించడం ద్వారా బాగా పనిచేసిన వారిని మరింత ప్రోత్సహించాలని సూచించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వారోత్సవాల్లో భాగంగా న్యుమోనియాపై అవగాహన కల్పిస్తూ వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రచురించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ సూర్యకుమారి తన చాంబర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. రక్తహీనత లేని ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత అటు ప్రజలపై ఇటు అధికారులపై ఉందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమీక్షలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీరమణకుమారి, డీసీహెచ్ఎస్ డాక్టర్ నాగభూషణరావు, డీఐఓ డాక్టర్ నారాయణరావు, మలేరియా అధికారిణి డాక్టర్ తులసీ, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సత్యప్రభాకర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ఇతర వైద్యాధికారులు, ఏపీ వైద్య విధాన పరిషత్ ప్రతినిధులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

చీపురుపల్లి:

జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో పట్టణానికి చెందిన ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. స్థానిక కళాశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో వారి ని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ, అధ్యాపకులు అభినందించారు. ఈ నెల 14న జిల్లా కేంద్రంలోని సాంస్కృతిక కళాశాలలో నిర్వ హించిన పోటీల్లో డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జె.నవ్య(ప్రథమ), కె.రమాదేవి(ద్వితీయ) స్థానాల్లో నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన నవ్యకు రూ.8 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన రమాదేవికి రూ.4 వేల నగదు బహుమతితో పాటు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అంతేకాకుండా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎన్ఎస్ఎస్ పీఓ, తెలుగు అధ్యాపకుడు బి.విజయేశ్వరరావు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ జ్వాలాముఖి, వైస్ ప్రిన్సిపాల్ బి.గోవిందరావు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణాజీ

మత్తుతో జీవితం చిత్తు



బొబ్బిలి: మాట్లాడుతున్న ఎస్ఈబీ సీఐ జైభీమ్

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో జరుగుతున్న 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పుస్తక ప్రదర్శనతో పాటు మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. ఖైనీ, గుట్కా, గంజాయి, నల్లమందు వంటి మత్తు పదార్థాలను సేవించి, జీవితం చిత్తు చేసుకోవద్దని విద్యార్థులు, యువతకు వక్తలు సూచించారు. అందరూ ఆదర్శవంతమైన జీవనం సాగించి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. – సాక్షి నెట్‌వర్క్



రామభద్రపురం: పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈఓ తిరుమలప్రసాద్

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం పూల్‌బాగ్: జిల్లాలో ఏడు సీజనల్ హాస్టల్స్ నిర్వహణకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ వీఏ స్వామినాయుడు మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. అర్హత గల ఎన్‌జీఓలు ఈ నెల 15 నుంచి 19లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

యువతకు ఆదర్శప్రాయుడు బిర్సా ముండా

- గిరిజన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్:

అటవీ జాతుల స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా యువతకు ఆదర్శనీయుడని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ టీవీ కట్టిమణి అన్నారు. స్థానిక వర్సిటీ ప్రాంగణంలో మంగళవారం బిర్సా ముండా జయంతిని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో బిర్సా ముండా పాత్ర కీలకమైనదిగా పేర్కొన్నారు. భారత పార్లమెంట్‌లోని సెంట్రల్‌హాల్‌లో ఆయన చిత్రపటాన్ని ఉంచాలన్నారు. అనంతరం అన్సంగ్ హీరోస్ ఆఫ్ ఇండియా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎంవీఎస్ గుప్త, గౌరీప్రసాద్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ కట్టిమణి

సాక్షి
ఫ్యామిలీ
శ్రీకాకుళం
బుధవారం ॥ 16-11-2022





డేర్ చేసి వెళ్లాడు.. డాషింగ్‌గా నిలిచాడు... సూపర్‌స్టార్.
ఊరికి మొనగాడు... పల్లెటూరి రైతు. పిస్టల్ పేల్చే గూఢచారి.
అశ్వారూఢుడు కౌబాయ్. బుర్రిపాలెం బుల్లోడు.
సినీ కరెన్సీ నోటు మీద 350 సినిమాల సంతకం.
ప్రేక్షక జన కేతనం అతడే.
అభిమానుల జయ కేతనం అతడే.

సాహసమే అతడి ఊపిరి

అరచేతిలో రివాల్వర్ అందంగా అమరిన నటుడు ఒకడున్నాడు. పేరు కృష్ణ.

•••

1962లో తొలి బాండ్ సినిమా 'మిస్టర్ నో' రిలీజ్ అయ్యింది. షేన్ కానరీ హీరో. తర్వాత నాలుగేళ్లకు అలాంటి సినిమా తీయాలని నిర్మాత డూండీకి అనిపించింది. హీరో ఎవరు? ఎన్.టి.ఆర్... ఊహూ. ఏ.ఎన్.ఆర్.. కాదు. 'తేనె మనసులు' సినిమా చూశాడాయన. క్లయిమాక్స్‌లో కారు చేజ్. స్కూటర్ వేగంగా నడుపుతున్న కొత్త హీరో నదురు బెదురు లేకుండా డూప్ జోలికి పోకుండా చేజ్ చేసి ఒక్క గెంతులో కారులో దూకాడు. డేరింగ్ డేషింగ్ స్టంట్. ఇతడే నా బాండ్ అనుకున్నాడు డూండీ. 'గూఢచారి 116' రిలీజైంది. స్కూటర్ మీద నుంచి కారు మీదకు గెంతిన ఒక్క గెంతు ఆ నటుణ్ణి సూపర్‌స్టార్‌ని చేసింది.

షేన్ కానరీ గొప్పవాడు. 32 ఏళ్లకు బాండ్ అయ్యాడు. కృష్ణ మరీ గొప్పవాడు. 23 ఏళ్లకే బాండ్ అయ్యాడు.

•••

తెనాలిలో కుర్రకారు చూడాల్సిన సినిమాలంటే ఇంకేం ఉంటాయి. అయితే ఎన్.టి.ఆర్. లేకుంటే ఏ.ఎన్.ఆర్. కృష్ణ ఎన్.టి.ఆర్ ఫ్యాన్. ఏలూరులో ఫిజిక్స్ మెయిన్‌గా బిఎస్సీ చదువుతూ ఎన్.టి.ఆర్ సినిమాలు చూసి మైమరిచాడు. 60 సినిమాలు పూర్తి చేసుకున్న ఏ.ఎన్.ఆర్‌ను సి.ఆర్.రెడ్డి కాలేజీకి సన్మానానికి పిలిస్తే ఆయనకు దక్కిన రాజభోగం గమనించాడు. 'సినిమాకు ఇంత యోగమా' అనుకున్నాడు. చెప్పాలంటే తెనాలి గాలిలోనే ఏదో కళ ఉంది. కృష్ణ ఊరు- బుర్రిపాలెంకు అది నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. కనుక గాలి గట్టిగా తగిలింది. సినిమా గాలి.

•••

'ఆడబతుకు', 'మంగమ్మ శపథం', 'దేవత' 1965లో రిలీజైన ఎన్.టి.ఆర్ సినిమాలు. 'ఆత్మగౌరవం', 'ప్రేమించి చూడు', 'సుమంగళి' ఏ.ఎన్.ఆర్ చిత్రాలు. ఇద్దరూ 42 ఏళ్ల వయసులో ఉన్నారు. పోటాపోటీగా కొత్తదనం కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. కాని అప్పటికే తరం మారి, తలకట్టు మారి, తెలుగు తెర కొత్త ముఖం కోసం ఎదురు చూస్తూ ఉంది. అభిమానులు సంఘాలు పెట్టుకోవడానికి కొత్త హీరో అన్వేషణలో ఉన్నారు. తెలుగు నేలపై గాలి మారిందని చెప్పడానికి ఒకడు రావాలి. అదే సంవత్సరం 22 ఏళ్ల కృష్ణ తొలి సినిమా 'తేనె మనసులు' రిలీజ్ అయ్యింది. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు అందరూ కొత్తవాళ్లతో 'తేనె మనసులు' తీసి హిట్ కొట్టాడు. ఆశ్చర్యం. దేవ్ ఆనంద్ పోలికలున్న రామ్మోహన్‌కు పేరొచ్చింది. అచ్చెరువు. ఏ పోలికలు లేని ఒరిజనల్ రూపు, ఊపు ఉన్న నటుడికే ఆ తర్వాత పట్టం దక్కింది. పట్టం దక్కినవాడు కృష్ణ.

•••

ఎన్.టి.ఆర్‌కు ఒక సంస్థానం ఉంది. తమ్ముడు త్రివిక్రమ రావు పక్కన ఉన్నాడు. పుండరీ కాక్షయ్య ఉన్నాడు. నిర్మాతల సమృద్ధి ఉంది. అక్కినేనికి దుక్కిపాటి, విక్టరీ మధుసూదన రావు, వి.బి.రాజేంద్రప్రసాద్, ఆదుర్తి ఉన్నారు. కృష్ణకు? ఉన్నవల్లా ధైర్యం, సాహసం, పట్టుదల, పంతం. రోజూ లేవగానే మేకప్ వేసుకుని సెట్‌లో ఉండాలి. చెవులకు యాక్షన్, కట్ వినిపించాలి. ఊళ్లో ఏదో ఒక హాల్లో తన సినిమా ఆడుతూ ఉండాలి. అందుకు ఏం చేయాలి? నిర్మాత నుంచి సినిమా పుడుతుంది. నిర్మాతకు ఇబ్బంది రాకపోతే తనకు ఏ ఇబ్బందీ రాదు. ఆ సూత్రం తెలిశాక కృష్ణ నిర్మాతల హీరో అయ్యాడు. రేపు షూటింగ్. డబ్బు లేదు. తానే ఏర్పాటు చేసేవాడు. రిలీజయ్యాక సినిమా పోయింది. రెమ్యూనరేషన్ వదులుకున్నాడు. ఎవరో నిర్మాత గొల్లుమంటున్నాడు. పిలిచి డేట్స్ ఇచ్చాడు. కృష్ణకు కూడా ఇప్పుడు మెల్లగా ఒక సంస్థానం ఏర్పడింది. ఇద్దరు తమ్ముళ్లు ఆదిశేషగిరిరావు, హనుమంతరావు తోడు నిలిచారు. డూండీ, వి.రామచంద్రరావు, కె.ఎస్.ఆర్.దాస్, ఆరుద్ర, త్రిపురనేని మహారథి తన పక్షం అయ్యారు. నెక్స్ట్ ఏంటి? కృష్ణ ఒకటి గమనించాడు... ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్‌లు నిర్మాతలు వస్తే హీరోలుగా నటిస్తారు. రాకపోతే తామే నిర్మాతలై హీరోలుగా నటిస్తారు. అంటే వారు హీరోలుగా నటిస్తూనే ఉంటారు. తాను కూడా నిర్మాతగా మారితే? తన హీరోయిజంను తానే నిరూపించుకుంటే?

అదిగో డెక్కల చప్పుడు చేస్తూ నురగలు కక్కుతూ దౌడు తీస్తున్న గుర్రం. పైన ఎర్ర టోపి, చేత రివాల్వర్‌తో కృష్ణ. సినిమా పేరు ఏమిటా అని పల్లెటూళ్లో పాదచారి ఆగి పోస్టర్ చూశాడు. మోసగాళ్లకు మోసగాడు!

•••

'అమరవీడు' సంస్థానం ఫ్రెంచ్ సేనల వశం అయ్యాక ఇద్దరు విశ్వాసపాత్రులు ఆ సంస్థానం నిధిని అడవిలో దాచారు. దాని కోసం మోసగాళ్లు వేటాడుతున్నారు. వారిని తలదన్నే మోసం చేసి నిధిని ప్రజలకు చేర్చాలి. అదీ 'మోసగాళ్లకు మోసగాడు' కథ. మన దేశంలో ఆలమందల్ని పిల్లనగ్రోవితో కట్టడి చేస్తారు. అమెరికాలో గుర్రాలతో కాపు కాస్తారు. ఆ కౌబాయ్‌లు మనకు లేరు. ఆ వాతావరణం మనది కాదు. సినిమా జాతకం చిటికెలో తేల్చే చక్రపాణి 'ఈ సినిమా ఎవరికి అర్థమవుతుందయ్యా' అని చికాకు పడ్డాడు సెట్‌కొచ్చి. కాని తీసెడివాడు కృష్ణ. మన దేశంలో తొలి కౌబాయ్ సినిమా. అదీ కలర్‌లో. మద్రాసులో రైలుకు మూడు ప్రత్యేక డబ్బాలు తగిలించి యూనిట్ రాజస్థాన్‌కు చేర్చి షూటింగ్ జరిపితే గుర్రాలు సకిలించాయి. తుపాకులు గర్జించాయి. రక్తం చిమ్మింది. శత్రువులు మట్టి కరిచారు. నిధి ప్రజలకు చేరింది. 'మోసగాళ్లకు మోసగాడు' 1971లో విడుదలైతే ప్రేక్షకులు గుప్పిళ్ల కొద్దీ చిల్లర, మడతలు పడ్డ రూపాయి నోట్లు కౌంటర్లో ఇచ్చి టికెట్లను పెరుక్కొని హాల్లో సీట్లు వెతుక్కోడానికి పరిగెత్తారు. చక్రపాణి జోస్యం తొలిసారి పొల్లుపోయింది.

కృష్ణ ఇప్పుడెవరనుకున్నారు?


ఆంధ్రా జేమ్స్‌బాండ్ కృష్ణ. ఆంధ్రా కౌబాయ్ కృష్ణ. డేరింగ్ డాషింగ్ కృష్ణ.

•••

ఘంటసాలకు నాటుమందు పడలేదు. ప్రాణం మీదకొచ్చింది. పరిస్థితి అర్థమైన అక్కినేని రామకృష్ణను కనుగొన్నాడు. ఘంటసాల స్థానంలో రామకృష్ణను అక్కినేని ఎంకరేజ్ చేస్తే శోభన్‌బాబు, కృష్ణంరాజు కూడా అతణ్ణే ఎంచుకున్నారు. ఎన్.టి.ఆర్‌కు ఈ టెన్షనే లేదు. రఫీనే రంగంలో దించగలడు. కాని కృష్ణకు ఒక గొంతు కావాలి. పాటల్లో తనకో సపోర్ట్ కావాలి. ఇండస్ట్రీకి ఎవరో కొత్త గాయకుడు వచ్చి స్ట్రగుల్ అవుతున్నాడని విని పిలిపించారు. 'మీరు వర్రీ కాకండి. ఎంత లేదన్నా నాకు సంవత్సరానికి నాలుగు సినిమాలుంటాయి. అన్నిటికీ మీరే పాడండి. నా సింగర్‌గా ఉండండి' అని హామీ ఇచ్చాడు. ఆ కొత్త గాయకుడు ఉత్సాహంగా కృష్ణకు పాడాడు. 'విశాల గగనంలో చందమామా... ప్రశాంత సమయములో కలువలేమా'.... విన్న ప్రేక్షకులు, రేడియో శ్రోతలు తలలు ఊపారు. తనివి తీరడం లేదని కార్డు ముక్కలు రాసి పోస్ట్‌డబ్బాలో పడేశారు. ఆ కొత్త గాయకుడు ఇంకా ఉల్లాసంగా పాడాడు. 'తనివి తీరలేదే... నా మనసు నిండలేదే'... అలా కృష్ణ, తర్వాతి కాలంలో ఎస్.పి.బాల సుబ్రహ్మణ్యంగా తెలిసిన ఆ కొత్త గాయకుడు స్థిరపడి అనేక జూబ్లీల కాలం ప్లాటినమ్ డిస్కులతో గమకాలాడారు.

•••













ఎన్.టి.ఆర్‌కు 'పాతాళభైరవి' ఉంది. అక్కినేనికి 'దేవదాసు' ఉంది. స్టార్‌లుగా కొనసాగాలంటే ప్రయత్నం, కృషి సరిపోతుంది. కాని సుదీర్ఘ కాలం నిలబడాలంటే నటుడుగా ప్రూవ్ చేసుకోవాలి. మాగ్నమ్ ఓపస్ ఉండాలి. తనకు అదేమిటి అనే ఆలోచన వచ్చింది కృష్ణకు. 'అసాధ్యుడు' సినిమాలో అల్లూరి సీతారామరాజుగా పాటలో కనిపించినప్పటి నుంచి ఆ పాత్ర మీద మనసు ఉంది. ఆ సినిమా తీయాలన్న సంకల్పం ఉంది. కాని అందుకు గేట్ అడ్డం ఉంది. ఆ గేట్ పేరు ఎన్.టి.ఆర్. ఎప్పటి నుంచో ఆయన అల్లూరి సీతారామరాజు తీస్తానంటున్నాడు. తీయడం లేదు. కృష్ణ ఆగదల్చుకోలేదు.

కృష్ణ నటించు 'అల్లూరి సీతారామరాజు'.

ఈ వార్త ఇండస్ట్రీ అంతా గుప్పుమంది. ఆ తర్వాత వార్తలే వార్తలు. 30 రోజుల పాటు విశాఖ ఏజెన్సీలో షూటింగ్ అట. యూనిట్ కోసం చింతపల్లిలో 5 ఎకరాల జొన్నచేను కొని సాపు చేసి కాలనీ కట్టారట. ఫీల్డులోని కేరెక్టర్ ఆర్టిస్టులంతా ఇందులో నటిస్తున్నారట. మన్యం వీరుడి కోసం కృష్ణ ఎంతకైనా ఖర్చు చేయడానికి సిద్ధ పడ్డాడట. అన్నింటికి మించి సినిమా స్కోప్‌లో తీస్తున్నారట. 1973 డిసెంబర్‌లో షూటింగ్ మొదలైతే కారెక్టర్ ఆర్టిస్టులంతా చింతపల్లిలో ఉండటం చేత మద్రాసులో రెండువారాలు షూటింగులు ఆగిపోయాయి. అదీ ఆ సినిమా తడాఖా.

మెల్లమెల్లగా పోస్టర్లు, అల్లూరి గెటప్ బయటకు వచ్చాయి. ఖాకీ చెడ్డీ, మోచేతుల వరకూ తెల్ల చొక్కా, పైన ముతక తువ్వాలు, చేతి బెత్తంతో జనులకు కనిపించిన అల్లూరి సీతారామరాజు తెలుగు వారికి మాత్రం సినిమా వారు తమ ఊహలకు తగ్గట్టుగా తీర్చిదిద్దిన ఆహార్యం వల్ల ఇప్పుడున్న రూపానికి మారిపోయాడు. ఎన్.టి.ఆర్ ప్రోద్బలంతో అల్లూరికి ఆ సినీ రూపం ఇచ్చిన ఆర్టిస్ట్ మాధవపెద్ది గోఖలే. అన్నట్టు అతనిదీ కృష్ణ ఊరే. తెనాలి.

•••

'ఈ సర్వసంగ పరిత్యాగికి రాజు కావాలనే కోరికా? రూథర్‌ఫర్డ్... నేనే కాదు. మా భారతీయులు ఎవ్వరూ ఏనాడూ ఇతరులను జయించాలని రాజ్యాలను స్థాపించాలని కోరలేదు. ఎప్పుడూ ఇతరులే ఈ రత్నగర్భపై ఆశపడ్డారు. దుర్జన దండయాత్రలతో రణరక్తసిక్తమైన నా దేశంలో రాజ్యాలు స్థాపించారు. రాళ్లల్లో కలిసిపోయారు. యవనులు, హూణులు, మ్లేచ్ఛుల చరిత్ర ఎలా అంతమైందో మీ చరిత్ర అలానే అంతమవుతుంది'...

అల్లూరి సీతారామరాజు డైలాగులతో హాల్లో జనం ఉద్వేగపడుతున్నారు. కన్నీరు కారుస్తున్నారు. ఆవేశపడుతున్నారు. పౌరుషంతో ఉప్పొంగుతున్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అల్లూరి మావాడు. ఆ పాత్రకు జీవం పోసిన కృష్ణ మావాడు.

1974లో విడుదలైన అల్లూరి సీతారామరాజు సూపర్ డూపర్ హిట్ అయ్యింది.

కృష్ణ పేరు ముందు ఇప్పుడు 'నట' చేరింది. 'నటశేఖర' కృష్ణ.

•••

అక్కినేని, ఎన్.టి.ఆర్ నిర్మాతలుగా ఉంటూ కృష్ణతో సినిమాలు తీయలేదు. కృష్ణ తాను నిర్మాతగా అక్కినేని, ఎన్.టి.ఆర్‌లతో సినిమాలు తీశాడు. ఎన్.టి.ఆర్‌తో తీసిన 'దేవుడు చేసిన మనుషులు' పెద్ద హిట్. అక్కినేనితో 'హేమాహేమీలు' తీశాడు. అక్కినేని, ఎన్.టి.ఆర్‌లను ఫలానా సినిమా తీయవద్దని కృష్ణ ఎప్పుడూ అనలేదు. కాని కృష్ణ తీస్తున్న సినిమాల విషయంలో వారు ఇరువురూ అభ్యంతరం చెప్పారు. ఎన్.టి.ఆర్ కృష్ణను పిలిచి 'అల్లూరి సీతారామరాజు', 'కురుక్షేత్రం' సినిమాలు విరమించమని కోరాడు. కృష్ణ 'దేవదాసు' తీస్తే అక్కినేని పోటీగా తన 'దేవదాసు'ను రీరిలీజ్ చేశాడు. కృష్ణతో నటించే సినిమాలలో తనకు ప్రాధాన్యం ఉండటం లేదని పేపర్ ప్రకటన ఇచ్చి మరీ శోభన్‌బాబు తప్పుకున్నాడు.

కృష్ణ ఆగలేదు. ఆగడం కృష్ణకు తెలియదు.
నూరవ చిత్రం... రెండు వందలవ చిత్రం...
ఇప్పుడతడు సూపర్‌స్టార్ కృష్ణ.

•••

'బృహన్నల' వేషం వేయడానికి బాడీ లాంగ్వేజ్ కోసం నృత్య శిక్షణ తీసుకున్నాడు ఎన్.టి.ఆర్. 'దేవదాసు' రూపం కోసం అన్నపానీయాలు మానేశాడు అక్కినేని. కృష్ణ అలాంటి నటుడు కాదు. అతడు ఎంతో అందమైన అమాయకమైన నటుడు. అప్పటికప్పుడు చేయదగింది చేసి ప్రేక్షకులకు కనెక్ట్ చేస్తే చాలు అనుకుంటాడు. అందుకే మార్నింగ్ కాల్షీట్‌లో గూఢచారిగా మారి భూమి మీద స్కైలాబ్ పడకుండా కాపాడతాడు. మధ్యాహ్నం కాల్షీట్‌లో ఓడ కెప్టెన్‌గా సముద్రం అడుగున ఉన్న నిధిని బయటకు తీస్తాడు. 'పాడిపంటల' రైతు అతడే. 'నేనొక ప్రేమపిపాసిని' అని పాడే భగ్న ప్రేమికుడు అతడే. పాత్రను అమాయకపు నిజాయితీతో చేరవేస్తాడు కనుకనే ప్రేక్షకులు విపరీతంగా అభిమానించారు. 'ఏకలవ్య' సినిమాలో 'మోగింది ఢమరుకం మేల్కొంది హిమనగం' పాటలో శాస్త్రీయ నృత్యం చేస్తాడు కృష్ణ. అది చూసి ప్రేక్షకులు వచ్చీరాని నృత్యం చేసే సొంత పిల్లల్ని కావలించుకున్నట్టు కృష్ణను కావలించుకుంటారు. అదే కృష్ణ విజయం.

•••

నటులుగా ఉంటూ దర్శకులుగా పెద్ద హిట్స్ ఇచ్చిన రాజ్ కపూర్, ఎన్.టి.ఆర్‌ల వరుసలో కృష్ణ నిలుస్తాడు. 'సింహాసనం' అందుకు ఉదాహరణ. నటుడుగా ఉంటూనే నిర్మాతగా రెండు భాషల్లో (తెలుగు, హిందీ) కృష్ణ తీసినన్ని సినిమాలు తీసినవారు లేరు. ఎంత వయసు వచ్చినా ఇమేజ్ చెక్కు చెదరకుండా కాపాడుకోవడం కృష్ణకు సాధ్యమైంది. కారెక్టర్ ఆర్టిస్టుగా కృష్ణ కొన్ని సినిమాలు చేశాడు. కాని జనం మాత్రం 'హీరో కృష్ణ' అని మాత్రమే పిలిచారు.

•••

అనవసర వివాదాలు, వాచాలత్వాలు లేకుండా కృష్ణ జీవితం ఎంతో హుందాగా గడిచింది. 'యాక్షన్' అనగానే బెబ్బులిలా మారే ఈ నటుడు తెర వెనుక మితభాషిగా, క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా కనిపిస్తాడు. భార్య విజయ నిర్మలను ఇంటికి పరిమితం చేయాలనుకోక దర్శకురాలిగా ప్రోత్సహించి ప్రపంచంలో అత్యధిక సినిమాలు తీసిన మహిళా దర్శకురాలిగా నిలిపాడు. ఎక్కడ సంపాదించాడో అక్కడే ఖర్చు పెట్టాడు. కన్నపిల్లల్ని తిరిగి సినిమా రంగానికే అప్పజెప్పాడు.

గాలివాటానికి దొర్లిపోయే మనుషులు చరిత్రలో నిలవొచ్చు.

కాని ఎదురుగాలిని సవాలు చేస్తూ చరిత్రను సృష్టిస్తారు కొందరు.

కృష్ణది అలాంటి కోవ. చేవ.

అందుకే తెలుగువారికి ఎప్పటికీ అతడు డేరింగ్ డాషింగ్ కృష్ణ.

– కె.































డేరింగ్ అండ్ డాషింగ్

ఆయన తొలి జేమ్స్ బాండ్.. తొలి కౌబాయ్.. తొలి 70ఎమ్ఎమ్‌నీ అందించారు.. తొలి పూర్తి సినిమా స్కోప్ చిత్రాలనూ చూపించారు. ఇన్ని ప్రయోగాలు చేశారు కాబట్టే సూపర్ స్టార్ కృష్ణ 'డేరింగ్ అండ్ డాషింగ్'. కృష్ణ చేసిన 'ఫస్ట్ ఆఫ్ ఇట్స్ కైండ్' అనదగ్గ చిత్రాల గురించి తెలుసుకుందాం.

తొలి జేమ్స్ బాండ్.. 'గూఢచారి 116'

'ఐయామ్ బాండ్.. జేమ్స్ బాండ్' అంటూ జేమ్స్ బాండ్ రెచ్చిపోతుంటే ప్రేక్షకులకు కలిగిన థ్రిల్ అంతా ఇంతా కాదు. కానీ ఇంగ్లిష్ మాట్లాడే ఈ జేమ్స్ బాండ్ తెలుగులో రెచ్చిపోతే ఆ థ్రిల్ పదింతలు అవుతుంది. తెలుగు తెరకు కృష్ణ తొలి జేమ్స్ బాండ్ అయ్యారు. 'గూఢచారి 116' (1966)లో గూఢచారిగా కృష్ణ చేసిన సాహసాలకు ప్రేక్షకులు ఘనవిజయం అందించారు. ఈ చిత్రానికి ఎం. మల్లికార్జున రావు దర్శకుడు. ఈ సినిమా తర్వాత 'జేమ్స్ బాండ్ 777, ఏజెంట్ గోపి, రహస్య గూఢచారి, గూఢచారి 117' వంటి అరడజను పైా సినిమాల్లో నటించారు కృష్ణ.

తొలి పాపులర్ కౌబాయ్: మోసగాళ్లకు మోసగాడు

1971కి ముందు వరకూ కౌబాయ్ అంటే హాలీవుడ్ సినిమాలు చూడాల్సిందే. కానీ హాలీవుడ్ చిత్రం 'మెకన్నాస్ గోల్డ్' చూశాక, తెలుగు కౌబాయ్‌ని చూపించాలనుకున్నారు కృష్ణ. ఆ సినిమాతో పాటు 'ఫ్యూ డాలర్స్ మోర్', 'గుడ్ బ్యాడ్ అండ్ అగ్లీ' లాంటి హాలీవుడ్ చిత్రాలను కలుపుకుని ఓ కథగా చేయమని, దర్శకుడు ఆరుద్రకి చెప్పారు. తన సోదరులు ఆదిశేషగిరిరావు, హనుమంత రావులకు నిర్మాణ బాధ్యతలు అప్పజెప్పారు. దర్శకుడిగా కేఎస్ఆర్‌దాస్‌ని నియమించారు. ముందు ఈ చిత్రానికి 'అదృష్ట రేఖ' అని టైటిల్ అనుకున్నారు. కానీ తర్వాత 'మోసగాళ్లకు మోసగాడు' అని ఫిక్స్ చేశారు. కౌబాయ్‌గా కృష్ణ విజృంభించారు. అప్పటికి కృష్ణ సినిమాల బడ్జెట్ 5 లక్షలు లోపే. కానీ 'మోసగాళ్లకు మోసగాడు'ని దాదాపు 7 లక్షల బడ్జెట్‌తో తీస్తే, ఐదింతలు వసూళ్లతో సంచలనం సృష్టించింది. ఈ చిత్రం ఆంగ్లంలో 'ది ట్రెజర్ హంట్'గా అనువాదం కావడం విశేషం.

తొలి పూర్తి కలర్ సినిమా స్కోప్: అల్లూరి సీతారామరాజు

స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితకథతో తన నూరవ సినిమా చేయాలనుకున్నారు కృష్ణ. డిస్ట్రిబ్యూటర్స్ మాత్రం డ్యూయట్లు ఉండవు, ఎంటర్‌టైన్‌మెంట్ ఉండదు, పైగా ఒకే రకమైన కాస్ట్యూమ్‌తో కృష్ణలాంటి మాస్ హీరో అడవుల చుట్టూ తిరిగితే ఎవరు చూస్తారు? అన్నారు. అయినా అల్లూరి పాత్ర చేయడంతో పాటు ఈ చిత్రాన్ని నిర్మించడానికి నడుం బిగించారు కృష్ణ. దర్శకుడు వి. రామచంద్ర రావుతో సినిమా ఆరంభించారు. అయితే హఠాత్తుగా రామచంద్ర రావు ఆరోగ్యం క్షీణించింది. చనిపోయే ముందు కృష్ణతో 'మిగతా సినిమాని నువ్వే పూర్తి చెయ్' అన్నారు రామచంద్ర రావు. ఫైట్స్‌ని దర్శకుడు కేఎస్ఆర్‌దాస్‌తో తీయించి, మిగతా సినిమాకి తానే దర్శకత్వం వహించారు కృష్ణ. 1974 మే 1న 'అల్లూరి సీతారామరాజు' విడుదలై, ఎన్నో రికార్డులను నెలకొల్పింది. తెలుగులో తొలి పూర్తి కలర్ సినిమా స్కోప్‌గా నిలిచింది. ఈ సినిమాని 'ఇంక్విలాబ్ జిందాబాద్' పేరుతో హిందీలోకి అనువదించారు.

తొలి 70 ఎంఎం సినిమా: సింహాసనం

అప్పటివరకు తిరుగులేని కథానాయకుడిగా కొనసాగుతున్న కృష్ణ 'సింహాసనం' సినిమాతో దర్శకుడిగా మారారు. తెలుగులో ఇది తొలి 70 ఎంఎం సినిమా. అవుట్‌డోర్‌లో భారీ సెట్స్ వేసిన తొలి తెలుగు సినిమా కూడా ఇదే. ఈ సినిమాలో నటించడంతోపాటు కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం-నిర్మాణం-ఎడిటింగ్ బాధ్యతలను కృష్ణ నిర్వర్తించారు. పైగా ద్విపాత్రాభినయం కూడా. 1986లో విడుదలైన ఈ చిత్రం అప్పటి 'ప్రేమాభిషేకం' రికార్డును బ్రేక్ చేసింది. తొలి వారంలో దాదాపు 1.5 కోట్లకు పైగా వసూలు చేసి, మొత్తంగా 4.5 కోట్లు వసూళ్లతో సంచలనం సృష్టించింది.

తొలి నాటకం

సినిమాల్లో హీరోగా అవకాశాలు రావాలంటే నాటకరంగంలో రాణింపు అవసరమని అప్పట్లో కృష్ణకు హీరో ఎన్టీఆర్, దర్శక-నిర్మాత-నటుడు ఎల్వీ ప్రసాద్ చెప్పారట. దీంతో ఏదైనా నాటకంలో తన నటనా నైపుణ్యాన్ని చూపించాలని కృష్ణ నిర్ణయించుకున్నారు. ఆ సమయంలో తెనాలికి చెందిన కొడాలి గోపాలరావు అనే నాటక రచయిత 'చేసిన పాపం కాశీకి వెళ్ళినా!?' అనే నాటకాన్ని మద్రాసులో సినీ ప్రముఖుల సమక్షంలో ప్రదర్శించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. గోపాలరావును ఎలాగో కలుసుకున్నారు కృష్ణ. అయితే ఈ నాటకంలో సెకండ్ హీరో వేషం (మొదటి హీరో శోభన్‌బాబు) అని కృష్ణకు చెప్పారు. కృష్ణ సరే అన్నారు. మద్రాసులోని వాణీ మహల్‌లో ప్రదర్శితమైన ఈ నాటకంలో కృష్ణ నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఆ తర్వాత 'ఛైర్మన్' అనే నాటకంలో కృష్ణను హీరోగా తీసుకున్నారు కొడాలి గోపాలరావు. బాగా రిహార్సల్స్ చేసి ఈ నాటకాన్ని విజయవాడలో ప్రదర్శించారు. కృష్ణకు ఇంకా మంచి పేరొచ్చింది. ఆ తర్వాత ఇదే నాటకాన్ని వివిధ నాటక సంస్థలు పలుమార్లు ప్రదర్శించాయి.

కోర్టు కష్టాలు!

కృష్ణ కెరీర్‌లో 184వ సినిమా 'అంతం కాదిది ఆరంభం!'. విజయకృష్ణా మూవీస్‌లో విజయ నిర్మల దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా కన్నడ హిట్ 'అంత'కు రీమేక్. 'అంత' సినిమా తెలుగు రీమేక్ హక్కులతో పాటు హిందీ, తమిళ రీమేక్ హక్కులను కూడా కృష్ణ తీసుకున్నారు.



తెలుగులో కృష్ణ హీరోగా నటించగా, తమిళంలో శివాజీ గణేశన్, హిందీలో జితేంద్ర హీరోలుగా చేశారు. 'అంతం కాదిది ఆరంభం' సినిమాకు సెన్సార్ వాళ్లు దాదాపు 290 కట్స్ చెప్పారట. వీటిని సరి చేసుకుని, ఈ సినిమాను రిలీజ్ చేశారు కృష్ణ. తెలుగులో సూపర్ హిట్‌గా నిలిచింది. కానీ హిందీ వెర్షన్ 'మేరీ ఆవాజ్ సునో'కు కష్టాలు ఎదురయ్యాయి. విడుదలైన రెండు వారాలకు 'మేరీ ఆవాజ్ సునో'లోని విలన్ పేరు ఉత్తరాదిలోని అప్పటి ఓ రాజకీయ నాయకుడి పేరుకు దగ్గరగా ఉందని ఈ సినిమాను బ్యాన్ చేసింది అప్పటి సెంట్రల్ గవర్నమెంట్. దాంతో ముంబై లోని బయ్యర్లు అక్కడి పద్మాలయా ఆఫీస్‌కు వెళ్లి ఇబ్బందిపెట్టారట. దాంతో స్పెషల్ రిట్ పిటిషన్‌తో ముందుగా ముంబై కోర్టును ఆశ్రయించారు కృష్ణ. ఆ తర్వాత కలకత్తా, ఆ నెక్స్ట్ ఢిల్లీ.. ఇలా 9 హైకోర్టులను ఆశ్రయించగా, 'మేరీ ఆవాజ్ సునో'పై నిషేధాన్ని ఎత్తివేశారు. నిర్మాతగా ఈ ఘటనను తాను ఎప్పటికీ మర్చిపోలేనని కృష్ణ పలు సందర్భాల్లో పేర్కొన్నారు.

తొలి అవకాశం చేజారిందిలా...

హీరో అవకాశాల కోసం కృష్ణ గట్టిగా ప్రయత్నాలు చేస్తున్న సమయంలో దర్శక-నిర్మాత, నటుడు ఎల్వీ ప్రసాద్ నుంచి ఓ కబురొచ్చింది. 'కొడుకులు-కోడళ్ళు' సినిమాలో హీరో ఆఫర్ అది. ఎగ్జయిట్‌మెంట్‌తో మద్రాస్ వెళ్లారు కృష్ణ. అయితే అక్కడికి వెళ్లిన తర్వాత కృష్ణకు తెలిసింది ఏంటంటే.. ఆయనది హీరో వేషం కాదు. నలుగురు హీరోల్లో ఓ లీడ్ రోల్. సోలో హీరోగా ఇండస్ట్రీకి పరిచయం అవుదామనుకున్న కృష్ణకు ఈ విషయం కాస్త ఇబ్బందిగా అనిపించింది. కానీ వచ్చిన అవకాశాన్ని వదులుకోకూడదని కృష్ణ ఈ సినిమా రిహార్సల్స్‌లో కూడా పాల్గొన్నారు. అయితే ఈ సినిమా ఆగిపోయింది. చేసేది లేక కృష్ణ తిరిగి తెనాలి వెళ్లిపోయారు.

హిట్ పెయిర్



హీరోగా 365కి పైగా సినిమాలు చేశారు కృష్ణ. అయితే కృష్ణ సరసన ఎక్కువగా జోడీ కట్టింది మాత్రం ఆయన భార్య విజయ నిర్మలనే. దాదాపు 50 సినిమాల్లో కృష్ణ-విజయ నిర్మల జోడీ ప్రేక్షకులను కనువిందు చేసింది. ఆ తర్వాత దాదాపు 45 సినిమాల్లో జంటగా నటించారు కృష్ణ-జయప్రద. ఆ నెక్స్ట్ శ్రీదేవితో 31 సినిమాల్లో జోడీ కట్టారు కృష్ణ.

● దాదాపు 50 రీమేక్ చిత్రాల్లో కృష్ణ నటించారు. వీటిలో హిందీ రీమేక్స్ 17 ఉన్నాయి. అలాగే 18 నవలా చిత్రాల్లో హీరోగా నటించారు. 18 మల్టీస్టారర్ మూవీస్ ఆయన కెరీర్‌లో ఉన్నాయి.

తండ్రీకొడుకుల చిత్రాలు



'పోరాటం'లో కృష్ణ, మహేశ్‌బాబు

కుమారులు రమేశ్, మహేశ్‌లను తన సినిమాలతోనే పరిచయం చేశారు కృష్ణ. తండ్రితో కలిసి మహేశ్ నటించిన తొలి చిత్రం 'పోరాటం'. ఆ తర్వాత కృష్ణ హీరోగా నటించిన 'కొడుకు దిద్దిన కాపురం, గూఢచారి 117, ముగ్గురు కొడుకులు, శంఖారావం' వంటి చిత్రాల్లో మహేశ్ నటించారు. 'అల్లూరి సీతారామరాజు, దొంగలకు దొంగ, మనుషులు చేసిన దొంగలు, అన్నదమ్ముల సవాల్' చిత్రాల్లో రమేశ్

కృష్ణ పాతిక సినిమాల్లో డ్యూయల్ రోల్స్, ఏడు సినిమాల్లో ట్రిపుల్ రోల్స్ చేశారు. అలాగే 1965 నుంచి 2009 వరకు కృష్ణ నటించిన సినిమా ప్రతి ఏడాది రిలీజ్ అవుతూనే ఉంది. ఇలా 44 ఏళ్ల పాటు ప్రతి ఏడాది ఓ నటుడి సినిమా రిలీజ్ కావడం అనేది చిన్న విషయం కాదు.
ఇక 1972లో కృష్ణ హీరోగా నటించిన చిత్రాలు 18 రిలీజ్ కావడం విశేషం.

కృష్ణ దర్శకత్వంలో...

కృష్ణ దర్శకత్వంలో 16 సినిమాలు వచ్చాయి. ఆయన దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'సింహాసనం'. ఆ తర్వాత 'శంఖారావం, కలియుగ కర్ణుడు, ముగ్గురు కొడుకులు, కొడుకు దిద్దిన కాపురం, రిక్షావాలా, అన్నా-తమ్ముడు, బాలచంద్రుడు, నాగాస్త్రం, ఇంద్ర భవనం, అల్లుడు దిద్దిన కాపురం, రక్తతర్పణం, మానవుడు-దానవుడు, పండంటి సంసారం' చిత్రాలు కృష్ణ దర్శకత్వంలో రూపొందాయి. హిందీలో కృష్ణ రెండు సినిమాలకు దర్శకత్వం వహించారు. అవే... 'సింఘాసన్' (తెలుగులో 'సింహాసనం'.. హిందీలో జితేంద్ర హీరో), 'ఇష్క్ హై తుమ్ సే' (తెలుగు మ్యూజికల్ హిట్ 'సంపంగి'కి హిందీ రీమేక్).

కృష్ణకు అద్భుతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఒక రకంగా చెప్పాలంటే అభిమాన సంఘాలనే కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది ఆయన అభిమానులే. కృష్ణకి 2500 అభిమాన సంఘాలు ఉండటం విశేషం.

తీరని కోరికలు

వృత్తి జీవితంలో కృష్ణకు కొన్ని తీరని కోరికలు ఉన్నాయి. ఛత్రపతి శివాజీ అంటే కృష్ణకి ఇష్టం. 'డాక్టర్-సినీ యాక్టర్', 'నంబర్‌వన్' చిత్రాల్లో శివాజీ పాత్రలు చేశారు కృష్ణ. కానీ ఓ సినిమా అంతా ఛత్రపతి శివాజీలా కనిపించాలన్నది ఆయన కోరిక. అలాగే మనవడు గౌతమ్‌తో నటించాలని ఉండేది. 'కౌన్ బనేగా కరోడ్‌పతి' తరహా షో చేయాలని ఉండేది. ఇవి నెరవేరకుండానే దివికేగారు.

మంచితనానికి మరో పేరు

మంచితనానికి మరో పేరు కృష్ణ అని ఇండస్ట్రీలో ఆయన్ను కొనియాడుతుంటారు. కృష్ణ ఎప్పుడూ నిర్మాత శ్రేయస్సు గురించే ఆలోచించేవారు. చేసిన సినిమా ఫ్లాప్ అయితే పూర్తి పారితోషికం తీసుకోకపోవడం లేదా కొత్త సినిమాకు కాల్షీట్స్ కేటాయించడం, అవసరమైతే సదరు నిర్మాతకు తానే పూచికత్తుగా ఉండి ఫైనాన్స్ ఇప్పించడం వంటివి చేశారు కృష్ణ. నిర్మాణ రంగంలో ఎందరో కొత్త నిర్మాతలకు అవకాశాలు. వారు ఇండస్ట్రీలో నిలదొక్కుకునేందుకు సహాయాలు చేశారు కృష్ణ. నిర్మాణరంగంలోనే కాదు.. దర్శకత్వ విభాగంలోనూ కృష్ణ మంచితనం గుభాళిస్తుంది. కృష్ణ కెరీర్‌లో 'అల్లూరి సీతారామరాజు' సినిమా ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. అయితే... ఈ సినిమా దర్శకుడు వి. రామచంద్రరావు చిత్రీకరణ దశలోనే మరణించారు. దీంతో మిగతా సినిమా దర్శకత్వ బాధ్యతలను కృష్ణ చేపట్టారు. కానీ స్క్రీన్‌పై దర్శకుడిగా వి. రామచంద్రరావు పేరు ఉంటుంది. అలాగే కెరీర్ ఆరంభంలో తనకు హెల్ప్ చేసిన దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు, నిర్మాత డూండీ, నాటక రంగంలో హెల్ప్ చేసిన రచయిత కొడాలి గోపాలరావు, నటుడు కొంగర జగ్గయ్యలకు పలుమార్లు సహాయాలు చేశారు కృష్ణ. ఇక ఆర్థికంగా నష్టపోయిన తోటి నటీనటులకు కూడా అవసరమైనప్పుడు కృష్ణ అండగా ఉన్నారు. ఇటు సేవా కార్యక్రమాల్లోనూ తనదైన ముద్రవేశారు కృష్ణ. 1972లో ఆంధ్రప్రదేశ్ కరువులో ఉన్నప్పుడు విరాళాలు సేకరించి, సహాయనిధికి ఇచ్చారు కృష్ణ.

సంక్రాంతి సెంటిమెంట్

కృష్ణ హీరోగా నటించిన 11వ చిత్రం 'అసాధ్యుడు'. వి. రామచంద్రరావు దర్శకత్వం వహించారు. నెల్లూరు కాంతారావు నిర్మించారు. ఈ చిత్రాన్ని సంక్రాంతికి రిలీజ్ చేయాలని కాంతారావు నిర్ణయించుకున్నారట. అయితే ఎన్టీఆర్ నటించిన 'ఉమా చండీ గౌరీ శంకరుల కథ' సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు అప్పటికే ప్రకటించేశారు. అయితే మొండి మనిషిగా పేరున్న నెల్లూరు కాంతారావు 1968 జనవరి 12న 'అసాధ్యుడు' సినిమాని విడుదల చేశారు. 'ఉమా చండీ గౌరీ శంకరుల కథ' సినిమా ఆశించిన ఫలితం సాధించలేదు. కానీ 'అసాధ్యుడు' చిత్రం ఘనవిజయం సాధించింది. అలా తొలిసారి సంక్రాంతి బరిలో సూపర్‌హిట్ అందుకున్నారు కృష్ణ. ఇక అప్పటి నుంచి ఆయనకు సంక్రాంతి సెంటిమెంట్‌ని ఆపాదించారు దర్శక-నిర్మాతలు, అభిమానులు. ఆ సెంటిమెంట్‌కి తగ్గట్టే సంక్రాంతికి విడుదలైన ఆయన సినిమాలన్నీ దాదాపు హిట్టయ్యాయి. నాలుగు దశాబ్దాల కృష్ణ సినీ కెరీర్‌లో దాదాపు 30 చిత్రాలు సంక్రాంతికి విడుదల కావడం విశేషం.



విజయకృష్ణా ఫిలింస్

కృష్ణ రెండో భార్య విజయ నిర్మలకి దర్శకత్వంపై మక్కువ. ఈ విషయాన్ని కృష్ణతో చెబితే.. 'ముందు సొంతంగా సినిమా తీసి నిరూపించుకో.. అప్పుడే బయటి సంస్థల నుంచి అవకాశాలు వస్తాయి' అన్నారు. 'విజయకృష్ణా ఫిలింస్' బ్యానర్‌ని స్థాపించి, చిన్న బడ్జెట్‌లో సినిమా తీయాలనుకున్నారు. మలయాళంలో 'కవిత' అనే సినిమాకి తొలిసారి దర్శకత్వం వహించి విజయం అందుకున్నారు విజయనిర్మల. ఆ తర్వాత ఇదే బ్యానర్‌లో కృష్ణ హీరోగా విజయ నిర్మల దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'మీనా' సూపర్‌హిట్‌గా నిలిచింది.

పద్మాలయా ఫిలింస్

1969, 1970లో కృష్ణ నటించిన సినిమాలు ఏడాదికి 15 చొప్పున విడుదలయ్యాయి. అంత బిజీగా ఉన్నా, అధిక శాతం హిట్లు ఉన్నా.. తన అభిరుచికి తగ్గట్టు సినిమాలు చేయాలనుకుని పెద్ద కుమార్తె పద్మ పేరుతో పద్మాలయా ఫిలింస్ స్థాపించి, తొలి సినిమాగా 'అగ్నిపరీక్ష' (1970) నిర్మించారు. హీరోగా కృష్ణకి ఇది 47వ చిత్రం. ఈ సినిమా నిర్మాణానికి కృష్ణ తన పెద్ద తమ్ముడు ఆదిశేషగిరి రావును పిలిపించారు. నిర్మాతగా తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, బెంగాలీ భాషల్లో కృష్ణ దాదాపు 50 సినిమాలు నిర్మించారు.



కొల్లేటి కాపురం... సాహసోపేతం

కొల్లేరు అనే పదం వింటే పూర్వపు రోజుల్లో హడల్. తరచూ తుఫాన్ల వల్ల కొల్లేరు ఉగ్రరూపం దాల్చి ఊళ్లకు ఊళ్లను తుడిచిపెట్టేది. పెద్దల పెత్తనంవల్ల పేదల బతుకులు చితికిపోతుండేవి. ఈ పరిస్థితులను ఇతివృత్తంగా తీసుకుని దర్శకుడు కేబీ తిలక్ 'కొల్లేటి కాపురం' సినిమాను 1976లో తెరకెక్కించారు. కృష్ణ, ప్రభ హీరోహీరోయిన్లు. కృష్ణ పశువుల డాక్టరు పాత్రలో మెప్పించారు. ఈ సినిమాలో కొల్లేరు ప్రాంత నాయకుడు సైదు గంగరాజుతో పాటు పలు గ్రామాల ప్రజలు చిన్న చిన్న పాత్రలు చేశారు. కొల్లేరు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నప్పుడు కృష్ణ సాహసం చేసి, నటించి శభాష్ అనిపించుకున్నారు. తర్వాత కాలంలో ఇదే ప్రాంతానికి ఆయన ఎంపీగా సేవలందించారు.

ప్రముఖుల సంతాపం

నాకు ఆప్తుడు, సోదర సమానుడు అయిన కృష్ణ దివికేగడం చాలా విచారకరమైన విషయం. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి.
– కె. విశ్వనాథ్

కృష్ణగారి మరణం తెలుగు చిత్రపరిశ్రమకు తీరని లోటు. ఆయనతో నేను మూడు సినిమాలకు వర్క్ చేశాను. ఆ జ్ఞాపకాలు నాకు ఎప్పటికీ గుర్తుంటాయి. ఆయన ఆత్మకు శాంతి కలగాలి. వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. – రజనీకాంత్

తెలుగు చలన చిత్రపరిశ్రమకు ఓ ఐకాన్ అయిన కృష్ణగారి మరణంతో ఓ శకం ముగిసిపోయింది. నా సోదరుడు మహేశ్‌బాబు మూడోసారి (ఈ ఏడాది జనవరిలో మహేశ్ బ్రదర్ రమేష్‌బాబు మరణం, సెప్టెంబరులో మహేశ్ తల్లి ఇందిరా దేవి మరణం...మంగళవారం తండ్రి కృష్ణ మృతిని ఉద్దేశిస్తూ...) దుఃఖానికి లోనయ్యాడు. మరింత మానసిక ధైర్యాన్ని మహేశ్ కూడగట్టుకోవాలని కోరుకుంటున్నాను.
– కమల్‌హాసన్

సూపర్‌స్టార్ కృష్ణగారు మనల్ని వదిలి వెళ్లిపోవడం నమ్మశక్యం కావడం లేదు. ఆయన మంచి మనసు కలిగిన హిమాలయ పర్వతం. సాహసానికి ఊపిరి, ధైర్యానికి పర్యాయపదం. ధైర్యం, సాహసం, పట్టుదల, మానవత్వం, మంచితనం.. వీటి కలబోత కృష్ణగారు. అటువంటి మహామనిషి తెలుగు చిత్ర పరిశ్రమలోనే కాదు.. భారత సినీ పరిశ్రమలోనే అరుదు. తెలుగు సినీ పరిశ్రమ సగర్వంగా తలెత్తుకోగల అనేక సాహసాలు చేసిన కృష్ణగారికి అశ్రు నివాళి. నా సోదరుడు మహేశ్‌బాబుకు, ఆయన కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సంతాపం.
– చిరంజీవి

కృష్ణగారు తన నటనతో ప్రేక్షకుల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారు. నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా, స్టూడియో అధినేతగా చిత్ర పరిశ్రమకు ఆయన అందించిన సేవలు మరువలేనివి. నాన్నగారు (ఎన్టీఆర్), కృష్ణగారు కలసి అనేక చిత్రాలకు పని చేశారు. ఆయనతో నేను నటించడం మర్చిపోలేని అనుభూతి. కృష్ణగారు లేనిలోటు సినీ పరిశ్రమకు, అభిమానులకు ఎప్పటికీ తీరనిది. – బాలకృష్ణ

నిర్భయంగా ప్రతి జానర్‌ను ప్రయత్నించిన వ్యక్తి కృష్ణగారు. తెలుగు సినిమాల నిజమైన కౌబాయ్. ఆయనతో సమయం గడిపితే నాలో సానుకూల దృక్పథం పెరిగిపోతుంది.
– నాగార్జున

కృష్ణగారి మరణవార్త విని చాలా బాధపడ్డాను. ప్రతి విషయంలోనూ ఆయన సూపర్‌స్టారే. సిల్వర్‌స్క్రీన్‌పై ఆయనలా మరొకరు లేరు.
– వెంకటేశ్

కృష్ణగారు అజాతశత్రువు. చాలా గొప్ప మనసు ఉన్న వ్యక్తి. అటువంటి వ్యక్తిని కోల్పోవడం సినిమా పరిశ్రమకే కాదు.. అందరికీ తీరని లోటు. ఇక ఇండస్ట్రీలో పెద్ద దిక్కు ఎవరూ లేరు. రామారావు, నాగేశ్వర రావు, శోభన్‌బాబు, కృష్ణంరాజుగార్లు వెళ్లిపోయారు. నటీనటులుగా వారు చూపిన ప్రతిభ, చేసిన సహాయాలు అందరూ గుర్తుపెట్టుకోవాలి. కృష్ణ హీరోగా నటించిన కొన్ని సినిమాలకు నేను అసిస్టెంట్ (కత్తుల రత్తయ్య), అసోసియేట్ డైరెక్టర్ (దీర్ఘ సుమంగళిభవ) గా చేశాను. ఆ తర్వాత 70 సినిమాల్లో విలన్ పాత్రలు పోషించాను. నన్ను భక్తా అని ఎంతో ప్రేమతో పిలిచేవారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలి. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.
– మోహన్‌బాబు

చిత్రసీమలో సూపర్‌స్టార్ బిరుదుకి సార్థకత చేకూర్చిన కృష్ణగారు తుదిశ్వాస విడిచారనే విషయం తెలిసి ఆవేదన చెందాను. కథానాయకుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా, స్టూడియో అధినేతగా కృష్ణగారు చేసిన సేవలు చిరస్మరణీయాలు. తెలుగు సినిమా పురోగమన ప్రస్థానంలో ఆయన నూతన పరిజ్ఞానాన్ని పరిచయం చేశారు. సినిమా రంగ అభివృద్ధిని కాంక్షించే కృష్ణగారి మరణం తీరని లోటు.
– పవన్ కల్యాణ్

కృష్ణగారంటే సాహసానికి మరోపేరు. ఎన్నో ప్రయోగాత్మక చిత్రాలు, విలక్షణమైన పాత్రలే కాకుండా సాంకేతికంగా కూడా తెలుగు సినిమాకు ఎన్నో విధానాలను పరిచయం చేసిన ఆయన ఘనత చిరస్మరణీయం. – ఎన్టీఆర్

కృష్ణగారు ఇక లేరని తెలిసి నా హృదయం ముక్కలైంది. ఓ లెజెండ్‌గా ఆయన జర్నీ అందరికీ గుర్తుంటుంది – రామ్‌చరణ్

తెలుగు సినిమా పరిశ్రమకు కృష్ణగారు చేసిన సేవలు మాటల్లో చెప్పలేం. అంతటి అద్భుత సేవ చేశారు. అన్ని రకాలుగా నిజమైన సూపర్ స్టార్ – అల్లు అర్జున్

కృష్ణగారి మరణంతో ఒక గొప్ప శకం ముగిసింది. కృష్ణగారు డేరింగ్ అండ్ డాషింగ్ హీరో. సినిమా ఇండస్ట్రీలో ఏదో సాధిద్దామని వచ్చిన ఎందరినో ప్రోత్సహించారు. నాలాంటి వారికి కూడా అవకాశాలు కల్పించారు. కృష్ణగారి వ్యక్తిత్వానికి సెల్యూట్ చేయాల్సిందే.
– ఆర్. నారాయణమూర్తి

కృష్ణగారు కల్మషం లేని వ్యక్తి. నిర్మాతలకు చాలా అనుకూలంగా ఉంటారు. ఇండస్ట్రీలో ఆయన ల్యాండ్ మార్క్ పర్సన్.
– సురేష్‌బాబు

సూపర్‌స్టార్ కృష్ణ మరణించడంతో చలనచిత్ర సీమలో ఒక శకం ముగిసింది. కేవలం నటుడుగానే కాదు.. నాకు మంచి స్నేహితుడు, నా కుటుంబానికి ఆప్తుడు. దేవుడు చేసిన మనిషిని దేవుడే తన దగ్గరకు పిలిపించుకున్నాడు.
– కె. రాఘవేంద్రరావు

తెలుగు సినిమాకు కృష్ణగారు ఎంతగానో సేవ చేశారు. మూడువందలకుపైగా సినిమాల్లో నటించడమే కాదు..దర్శక-నిర్మాతగా కూడా కీర్తి గడించారు. సినిమాల పట్ల ఆయనకున్న ప్రేమ, అభిరుచి వల్లే కొత్త సాంకేతికతను ఇండస్ట్రీకి పరిచయం చేయగలిగారు. తెలుగు సినిమాలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు.
– రాజమౌళి

పదిహేను రోజుల క్రితమే ఆయన్ను కలవడం జరిగింది. నేను నటించి, నిర్మించిన చిత్రం 'అందరు బాగుండాలి..అందులో నేనుండాలి' సినిమాను కృష్ణగారు చూసి మెచ్చుకున్నారు. కృష్ణగారితో నాకు దాదాపు పాతిక సినిమాలు చేసే అదృష్టం కలిగింది. 'సీతాకోకచిలుక' సినిమాలో నాకు చాన్స్ రావడానికి కారణం కృష్ణ, విజయనిర్మలగార్లే. – అలీ

తెలుగువీరలేవరా, ఎన్‌కౌంటర్, సంభవం..ఇలా కృష్ణగారితో నేను చాలా సినిమాలు చేశాను. ఏడాదిలో పది సినిమాల షూటింగ్స్‌లో పాల్గొనడం, రోజులో మూడు షిఫ్టుల్లో వర్క్ చేసిన కళామతల్లి ఏకైక ముద్దుబిడ్డ కృష్ణగారే. సినీ రంగంలో దిగ్గజాలైన ఎన్టీఆర్, ఏయన్నార్, కృష్ణంరాజుగార్ల తర్వాత ఇప్పుడు కృష్ణగారు కూడా మరణించారు. దీంతో ఇండస్ట్రీకి పెద్ద దిక్కులేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది.
– రోజా

వేణుగోపాలుడు సాక్షిగా...



కైకలూరు నియోజకవర్గం కోటకలిదిండి గ్రామంలో మీసాల వేణుగోపాల స్వామి దేవాలయం ఉంది. ఇందులో కృష్ణుడి విగ్రహానికి మీసాలు ఉంటాయి. వివాహం జరగాలని ఈ గుడిలో కోరుకుంటే నెరవేరుతుందని స్థానికుల నమ్మకం. ఈ నేపథ్యంలో ముళ్లపూడి రమణ కథతో బాపు దర్శకత్వం వహించిన మొదటి తెలుగు చిత్రం 'సాక్షి' (1967). హీరోగా కృష్ణ, హీరోయిన్లుగా విజయనిర్మల, విజయలలిత, హాస్య నటుడు రాజబాబు ఈ చిత్రంలో నటించారు. చిత్రంలో 'అమ్మ కడుపు చల్లగా' అనే పాటను ఈ గుడిలోనే చిత్రీకరించారు. సినిమా కథలో భాగంగా కృష్ణ ఈ గుడిలోనే విజయనిర్మలకు తాళి కడతారు. ఈ పాట చిత్రీకరణ సమయంలో హాస్య నటుడు రాజబాబు దేవుడి మహిమతో మీరూ వివాహం చేసుకుంటారేమో అని ఛలోక్తి విసిరారు. అన్నట్టుగానే 1969లో తిరుపతిలో కృష్ణ, విజయనిర్మల వివాహం చేసుకున్నారు. కలిదిండి వేణుగోపాలుడి మహిమను స్వయంగా విజయనిర్మల తమ వివాహం సందర్భంగా చెప్పడంతో హైదరాబాదు, ఇతర ప్రాంతాల నుంచి యువతీయువకులు మీసాల వేణుగోపాల స్వామిని దర్శించుకోవడం మొదలుపెట్టారు.



కృష్ణ భౌతికకాయానికి ప్రముఖుల నివాళి



సాక్షి బిజినెస్

బుధవారం
16-11-2022

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 249	నిఫ్టీ ▲ 74
61,873	18,403

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్‌	11,449	▲	253
డోజోన్స్‌	33,707	▲	171
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,369	▼	16
డాక్స్‌	14,379	▲	65
షాంఘై	3,134	▲	51
నికాయ్‌	27,990	▲	28

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	52,823 ▲ 393
బంగారం (99.5 స్వచ్ఛత)	52,611 ▲ 391
వెండి (కేజీ)	62,270 ▲ 687

ఎస్‌బీఐ రుణ రేటు పెంపు

న్యూఢిల్లీ: బ్యాంకింగ్‌ దిగ్గజం– స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఎస్‌బీఐ) నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణరేటు (ఎంసీఎల్‌ఆర్‌)ను అన్ని కాలపరిమితులపై 15 బేసిస్‌ పాయింట్ల వరకూ (100 బేసిస్‌ పాయింట్లు ఒక శాతం) పెంచింది. దీనితో గృహ, ఆటో, వ్యక్తిగత రుణాలు మరింత భారం కానున్నాయి. నవంబర్‌ 15 నుంచి తాజా రేట్లు అమల్లోకి వస్తాయని బ్యాంక్‌ పేర్కొంది. బ్యాంక్‌ తాజా నిర్ణయంతో సాధారణంగా రుణాలకు అనుసంధానమయ్యే ఏడాది రేటు 10 బేసిస్‌ పాయింట్లు పెరిగి 7.95 శాతం నుంచి 8.05 శాతానికి చేరింది. రెండేళ్లు, మూడేళ్ల రుణ రేట్లు కూడా ఇదే స్థాయిలో పెరిగి వరుసగా 8.25 శాతం, 8.35 శాతాలకు చేరాయి.

హోసూరులో అతిపెద్ద ఐఫోన్‌ తయారీ ప్లాంట్‌



న్యూఢిల్లీ: దేశంలో యాపిల్‌ ఐఫోన్ల తయారీకి సంబంధించి అతిపెద్ద ప్లాంట్‌ కర్ణాటకలోని హోసూరులో టాటా ఎలక్ట్రానిక్స్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు కానుంది. దీని ద్వారా 60వేల మందికి ఉపాధి లభించనుంది. ఈ వివరాలను కేంద్ర టెలికం, ఐటీ శాఖా మంత్రి అశ్వని వైష్ణవ్‌ వెల్లడించారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా మంత్రి మాట్లాడారు. ఐఫోన్ల తయారీపై రాంచీ, హజారీబాగ్‌కు చెందిన ఆరువేల మంది గిరిజన మహిళలకు శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

16-11-2022	
విశాఖ	520-00
చిత్తూరు	558-00
ఈస్ట్‌, వెస్ట్‌ గోదావరి	517-00
విజయవాడ	517-00
రిటైల్‌ ధర (డజను)	78.00
15-11-2022 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	504-00
వరంగల్‌	506-00
రిటైల్‌ ధర	5.65

సరికొత్త శిఖరంపై సెన్సెక్స్‌

- కలిసొచ్చిన జాతీయ, అంతర్జాతీయ సానుకూలతలు
- ఇంట్రాడేలో ఏడాది గరిష్టానికి సూచీలు
- 18,400 పైకి నిఫ్టీ



ముంబై: స్టాక్‌ సూచీలకు నష్టాలు ఒకరోజుకే పరిమితమయ్యాయి. జాతీయ, అంతర్జాతీయ సానుకూల సంకేతాల అండతో మళ్లీ లాభాల బాట పట్టాయి. ఫ్లాట్‌గా ట్రేడింగ్‌ను ప్రారంభించిన సూచీలు రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ లాభ, నష్టాల మధ్య కదలాడాయి. ఆరంభ నష్టాలను భర్తీ చేసుకున్న సూచీలు ఇంట్రాడేలో ఏడాది గరిష్టాన్ని తాకాయి. రిటైల్‌, హోల్‌సేల్‌ ద్రవ్యోల్బణం దిగి రావడంతో రానున్న రోజుల్లో ఆర్‌బీఐ సరళతర ద్రవ్య విధాన వైఖరికి మొగ్గుచూపొచ్చని ఆశలు మార్కెట్‌ వర్గాల్లో నెలకొన్నాయి. రూపాయి బలపడటం, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు సెంటిమెంట్‌ను బలపరిచాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచీ సానుకూల సంకేతాలు అందాయి. సెన్సెక్స్‌ ఉదయం ఆరు పాయింట్ల స్వల్ప లాభంతో 61,630 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 326 పాయింట్లు బలపడి 61,956 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. అలాగే 61,436 పాయింట్ల వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 249 పాయింట్లు పెరిగి జీవితకాల గరిష్టం 61,873 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 33 పాయింట్ల లాభంతో 18,362 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. రోజంతా 144 పాయింట్ల పరిధిలో కదలాడి 18,426 వద్ద 52 వారాల గరిష్టాన్ని నమోదు చేసింది. మార్కెట్‌ ముగిసే సరికి 74 పాయింట్లు బలపడి 18,403 వద్ద ముగిసింది. బ్యాంకింగ్‌, ఆటో, ఫైనాన్స్‌, ఇంధన షేర్లు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఎఫ్‌ఎంసీజీ, మీడియా, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు 12 రోజుల వరుస కొనుగోళ్ల తర్వాత అమ్మకాలు జరిపారు. నికరంగా రూ.221 కోట్లు షేర్లను విక్రయించారు. దేశీ ఇన్వెస్టర్లు కూడా రూ.549 కోట్ల విలువైన షేర్లను అమ్మారు. ఆసియా, యూరప్‌ మార్కెట్లు, యూఎస్‌ స్టాక్‌ ఫ్యూచర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. డాలర్‌ మారకంలో రూపాయి విలువ 37 పైసలు బలపడి 80.91 స్థాయి వద్ద స్థిరపడింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ఫ్యూజన్‌ మైక్రోఫైనాన్స్‌ షేరు లిస్టింగ్‌లో మెప్పించలేకపోయింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.368)తో పోలిస్తే రెండుశాతం డిస్కౌంట్‌తో రూ.360.50 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో మరింత అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ఇంట్రాడేలో 13% క్షీణించి రూ.321 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 12శాతం నష్టంతో రూ.325 వద్ద స్థిరపడింది.
- అర్హత కలిగిన ఇన్వెస్టర్లకు బోనస్‌ షేర్లను జారీ చేయడంతో నైకా షేరు తొమ్మిదిశాతం నష్టపోయి రూ.192 వద్ద ముగిసింది.

ఓఎన్‌జీసీ లాభంలో క్షీణత

- క్యూ2లో రూ. 12,826 కోట్లు
- షేరుకి రూ. 6.75 డివిడెండ్‌



న్యూఢిల్లీ: ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం ఓఎన్‌జీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-2) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జూలై-సెప్టెంబర్‌(క్యూ2)లో నికర లాభం 30 శాతం క్షీణించి రూ. 12,826 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 18,348 కోట్లు ఆర్జించింది. అనూహ్య(విండ్‌ఫాల్‌) లాభాల పై ప్రభుత్వం పన్ను విధింపు ప్రభావం చూపింది. మొత్తం ఆదాయం మాత్రం 57%పైగా జంప్‌చేసి రూ.38,321 కోట్లకు చేరింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 6.75 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. కంపెనీలో ప్రభుత్వానికి దాదాపు 59 శాతం వాటా ఉంది.

విక్రయ ధరలు అప్‌

ఉత్పత్తి చేసిన ప్రతీ బ్యారల్‌ చమురుకు స్థూలంగా 95.49 డాలర్లు లభించినట్లు ఓఎన్‌జీసీ పేర్కొంది. గత క్యూ2లో ఇది 69.36 డాలర్లు మాత్రమే. రష్యా- ఉక్రెయిన్‌ యుద్ధం నేపథ్యంలో ముడి చమురు ధరలు భారీగా ఎగసిన విషయం విదితమే. అయితే ప్రభుత్వం పెరిగిన ధరలపై జూలై 1 నుంచీ కొత్తగా విండ్‌ఫాల్‌ పన్ను విధించింది. ప్రస్తుత సమీక్షా కాలంలో రూ. 6,400 కోట్లమేర ప్రత్యేక అదనపు ఎక్సైజ్‌ సుంకాన్ని చెల్లించినట్లు కంపెనీ ఫైనాన్స్‌ డైరెక్టర్‌ పోమిలా జస్పాల్‌ పేర్కొన్నారు. వెరసి ప్రతీ బ్యారల్‌కు 75-76 డాలర్లు లభించినట్లు తెలియజేశారు. ఇక నేచురల్‌ గ్యాస్‌పై ఒక్కో ఎంబీటీయూకి 6.1 డాలర్లు లభించగా.. గత క్యూ2లో కేవలం 1.79 డాలర్లు పొందింది. ఈ కాలంలో చమురు ఉత్పత్తి 5.47 మిలియన్‌ టన్నుల నుంచి 5.36 ఎంటీకి తగ్గింది. గ్యాస్‌ ఉత్పత్తి సైతం 5.46 బిలియన్‌ ఘనపు మీటర్ల నుంచి 5.35 బీసీఎంకు మందగించింది. ఈ ఏడాది తొలి అర్ధభాగంలో కేజీ బేసిన్‌లో ఆరు డిస్కవరీలకు తెరతీసింది.

ఫలితాల నేపథ్యంలో ఓఎన్‌జీసీ షేరు ఎన్‌ఎస్‌ఈలో 2.3 శాతం బలపడి రూ. 142 వద్ద ముగిసింది.

వాట్సాప్‌ ఇండియా హెడ్‌ బోస్‌ రాజీనామా

మెటా పబ్లిక్‌ పాలసీ హెడ్‌ సైతం ఇదే బాట



న్యూఢిల్లీ: వాట్సాప్‌ ఇండియా హెడ్‌గా ఉన్న అభిజిత్‌ బోస్‌ తన పదవికి రాజీనామా సమర్పించారు. అలాగే, మెటా (వాట్సాప్‌, ఫేస్‌బుక్‌ మాతృ సంస్థ) ఇండియా పబ్లిక్‌ పాలసీ హెడ్‌గా పనిచేస్తున్న రాజీవ్‌ అగర్వాల్‌ సైతం రాజీనామా చేశారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 11,000 మందిని మెటా తొలగించిన రోజుల వ్యవధిలోనే, భారత్‌లో కీలక స్థానాల్లో ఉన్న వీరు పదవులకు గుడ్‌బై చెప్పడం గమనార్హం. ఈ పరిణామాల నేపథ్యంలో, మెటా ఇండియా పబ్లిక్‌ పాలసీ బాధ్యతలను శివ్‌నాథ్‌ తుక్రాల్‌కు మెటా అప్పగించింది. ప్రస్తుతం తుక్రాల్‌ వాట్సాప్‌ ఇండియా, ఇన్‌స్టాగ్రామ్‌ పబ్లిక్‌ పాలసీ హెడ్‌గా పనిచేస్తున్నారు. ''వాట్సాప్‌ ఇండియా తొలి చీఫ్‌గా పనిచేసి, అద్భుతమైన సేవలు అందించినందుకు అభిజిత్‌ బోస్‌కు ధన్యవాదాలు'' అంటూ వాట్సాప్‌ హెడ్‌ విల్‌ క్యాత్‌ కార్ట్‌ పేర్కొన్నారు. 2019 ఫిబ్రవరిలో బోస్‌ వాట్సాప్‌ ఇండియా హెడ్‌గా చేరారు.

రెండేళ్ల తర్వాత ఎగుమతులు 'మైనస్‌'

- అక్టోబర్‌లో 17 శాతం డౌన్‌
- 29.78 బిలియన్‌ డాలర్లుగా నమోదు
- దిగుమతులు 6 శాతం పెరిగి 56.69 బిలియన్‌ డాలర్లకు..
- వెరసి 26.91 బిలియన్‌ డాలర్లకు చేరిన వాణిజ్యలోటు



న్యూఢిల్లీ: భారత్‌ ఎగుమతులు రెండేళ్ల తర్వాత అక్టోబర్‌లో క్షీణతను చవిచూశాయి. సమీక్షా నెల్లో అసలు వృద్ధిలేకపోగా 17 శాతం పడిపోయి (2021 ఇదే నెలతో పోల్చి) 29.78 బిలియన్‌ డాలర్లుగా నమోదయ్యాయి. గ్లోబల్‌ డిమాండ్‌ పడిపోవడం దీనికి నేపథ్యం. ద్రవ్యోల్బణం,, కరెన్సీ విలువల్లో విపరీతమైన ఒడిదుడుకులు, భౌగోళిక ఉద్రిక్తతలు వంటి అంశాలూ భారత్‌ ఎగుమతులకు ప్రతికూలంగా నిలిచాయి. ఇక ఇదే నెల్లో దిగుమతులు 6 శాతం పెరిగి 56.69 బిలియన్‌ డాలర్లుగా నమోదయ్యాయి. దీనితో ఎగుమతులు-దిగుమతులు మ ధ్య నికర వ్యత్యాసం-వాణిజ్యలోటు 26.91 బిలియన్‌ డాలర్లుగా ఉంది. వాణిజ్య మంత్రిత్వశాఖ విడుదల చేసిన గణాంకాల్లో కొన్ని ముఖ్యాంశాలు చూస్తే..

- రత్నాలు-ఆభరణాలు (21.56%), ఇంజనీరింగ్‌ (21.26%), పెట్రోలియం ఉత్పత్తులు (11.28%), రెడీమేడ్‌ వస్త్రాలు-టెక్స్‌టైల్స్‌ ((21.16%), రసాయనాలు (16.44%), ఫార్మా (9.24%), సముద్ర ఉత్పత్తులు (10.83%), తోలు (5.84%) సహా కీలక ఎగుమతి రంగాలు అక్టోబర్‌లో ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి.
- అయితే ఆయిల్‌ సీడ్స్‌, ఆయిల్‌మీల్స్‌, ఎలక్ట్రానిక్‌ గూడ్స్‌, పొగాకు, టీ, బియ్యం ఎగుమతుల సానుకూల వృద్ధిని నమోదుచేశాయి.
- ఆర్థిక వృద్ధి, దేశీయ వినియోగం పెరగడం కూడా దిగుమతుల పురోగతికి దోహదపడుతోంది.
- మొత్తం దిగుమతుల్లో చమురు బిల్లు 29.1 శాతం వృద్ధితో 15.8 బిలియన్‌ డాలర్లుగా ఉంది.
- పసిడి దిగుమతుల విలువ 27.47 శాతం తగ్గి 3.7 బిలియన్‌ డాలర్లకు చేరింది.

ఏప్రిల్‌-అక్టోబర్‌ మధ్య వృద్ధి 12.55 శాతం

కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఏడు నెలలూ (ఏప్రిల్‌-అక్టోబర్‌) మధ్య ఎగుమతులు 12.55 శాతం పెరిగి 263.35 బిలియన్‌ డాలర్లుగా నమోదయ్యాయి. ఇక దిగుమతులు ఇదే కాలంలో 33.12 శాతం పెరిగి 436.81 బిలియన్‌ డాలర్లుగా ఉన్నాయి. వెరసి వాణిజ్యలోటు 173.46 బిలియన్‌ డాలర్లుగా నమోదయ్యింది. 2021 ఇదే కాలంలో వాణిజ్యలోటు 94.16 బిలియన్‌ డాలర్లు. గత ఆర్థిక సంవత్సరం ఎగుమతుల విలువ దాదాపు 400 బిలియన్‌ డాలర్లు. 2022-23లో ఈ లక్ష్యం 450 బిలియన్‌ డాలర్లు. అయితే ప్రస్తుత ఆర్థిక, భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో ఈ లక్ష్యం సాధన కష్టమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అమెజాన్‌లో 10 వేల ఉద్యోగాలు కట్‌..

న్యూయార్క్‌: టెక్నాలజీ కంపెనీల్లో ఉద్యోగాల్లో కోతల పర్వం కొనసాగుతోంది. తాజాగా ట్విట్టర్‌, ఫేస్‌బుక్‌ల తరహాలోనే ఈ-కామర్స్‌ దిగ్గజం అమెజాన్‌ కూడా రాబోయే రోజుల్లో దాదాపు 10,000 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్నట్లు తెలుస్తోంది. కంపెనీ కార్పొరేట్‌ ఉద్యోగుల సంఖ్యలో ఇది మూడు శాతం కాగా అంతర్జాతీయంగా ఉన్న సిబ్బంది సంఖ్యలో ఒక్క శాతం కన్నా తక్కువని న్యూయార్క్‌ టైమ్స్‌ (ఎన్‌వైటీ) ఒక కథనాన్ని ప్రచురించింది. వాయిస్‌ అసిస్టెంట్‌ అలెక్సాతో పాటు డివైజ్‌ల విభాగం, రిటైల్‌, మానవ వనరుల విభాగంలో ఈ కోతలు ఉండనున్నాయని పేర్కొంది. కొన్నాళ్లుగా అమెజాన్‌లో ఈ ధోరణులు కనిపిస్తూనే ఉన్నాయని ఎన్‌వైటీ తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌ నుండి సెప్టెంబర్‌ మధ్యకాలంలో అమెజాన్‌ 80,000 పైచిలుకు సిబ్బందిని తగ్గించుకున్నట్లు పేర్కొంది. వీరిలో ఎక్కువ మంది గంటల ప్రాతిపదికన పని చేసేవారే ఉన్నట్లు వివరించింది. చిన్న బృందాలకు సంబంధించి రిక్రూట్‌మెంట్‌ను సెప్టెంబర్‌లోనే నిలిపివేసిందని, అలాగే అక్టోబర్‌లో కీలకమైన రిటైల్‌ వ్యాపారంలోనూ 10,000 పైచిలుకు ఖాళీలను భర్తీ చేయకుండా ఆపేసిందని ఎన్‌వైటీ పేర్కొంది. అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థలో పరిస్థితులు బాగా లేకపోవడంతో వ్యాపారాన్ని వేగంగా క్రమబద్ధీకరించుకునేలా అమెజాన్‌పై ఒత్తిడి పెరిగిపోతోందని వివరించింది. ఎలాన్‌ మస్క్‌ చేతికి వచ్చిన తర్వాత మైక్రోబ్లాగింగ్‌ సైట్‌ ట్విట్టర్‌లో దాదాపు సగం మంది ఉద్యోగులు ఉద్వాసనకు గురైన సంగతి తెలిసిందే. మెటా (ఫేస్‌బుక్‌ మాతృ సంస్థ) కూడా 11,000 మంది పైచిలుకు సిబ్బందిని తొలగించనున్నట్లు ప్రకటించింది.

సాక్షి స్పోర్ట్స్‌



జొకోవిచ్‌ శుభారంభం

పురుషుల టెన్నిస్‌ సీజన్‌ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌లో సెర్బియా స్టార్‌ జొకోవిచ్‌ శుభారంభం చేశాడు. ఇటలీలో జరుగుతున్న ఈ టోర్నీలో 'రెడ్‌ గ్రూప్‌' మ్యాచ్‌లో జొకోవిచ్‌ 6-4, 7-6 (7/4)తో మూడో ర్యాంకర్‌ సిట్సిపాస్‌ (గ్రీస్‌)పై గెలిచాడు. సిట్సిపాస్‌పై జొకోవిచ్‌కిది వరుసగా తొమ్మిదో విజయం. 'గ్రీన్‌ గ్రూప్‌' మ్యాచ్‌లో స్పెయిన్‌ స్టార్‌ రాఫెల్‌ నాదల్‌ 3-6, 4-6తో ఫెలిక్స్‌ అలియాసిమ్‌ (కెనడా) చేతిలో ఓడిపోయాడు. ఇదే గ్రూప్‌లో టేలర్‌ ఫ్రిట్జ్‌ తదుపరి మ్యాచ్‌లో గెలిస్తే నాదల్‌ టోర్నీ నుంచి నిష్క్రమిస్తాడు.

అర్జున్‌, ప్రజ్ఞానంద పరాజయం

చాంపియన్స్‌ టూర్‌ ఫైనల్స్‌ చెస్‌ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్‌, ప్రజ్ఞానంద తొలి రౌండ్‌లో ఓడిపోయారు. అమెరికాలో ఈ టోర్నీ జరుగుతోంది. తొలి రౌండ్‌ మ్యాచ్‌లో అర్జున్‌ 0.5-2.5తో క్రిస్టాఫ్‌ డూడా (పోలాండ్‌) చేతిలో... ప్రజ్ఞానంద 1.5-2.5తో షఖ్రియార్‌ (అజర్‌బైజాన్‌) చేతిలో ఓడారు.



జర్మనీ జట్టు

పూర్వ వైభవంపై జర్మనీ దృష్టి

గ్రూప్‌ 'ఇ'లో నాలుగుసార్లు చాంపియన్‌ • స్పెయిన్‌ను నిలువరిస్తే ముందుకు ఖాయం

ప్రపంచకప్‌ ఫుట్‌బాల్‌ టోర్నీ చరిత్రలో అత్యధికంగా 109 మ్యాచ్‌లు ఆడిన జట్టుగా బ్రెజిల్‌తో సమానంగా జర్మనీ నిలిచింది. బ్రెజిల్‌ ఐదుసార్లు విశ్వవిజేతగా నిలిస్తే, జర్మనీ నాలుగుసార్లు ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. అయితే 2104లో నాలుగోసారి ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన తర్వాత జర్మనీ ఆటలో తిరోగమనం కనిపిస్తోంది. 2018 ప్రపంచకప్‌లో జర్మనీ గ్రూప్‌ దశలోనే నిష్క్రమించడంతో అందరూ ఆశ్చర్యపోయారు. అనంతరం యూరో టోర్నీలోనూ జర్మనీ ప్రిక్వార్టర్‌ ఫైనల్‌ను దాటలేకపోయింది. ఈ నేపథ్యంలో 'ఖతర్‌'లో జర్మనీ ప్రయాణం ఎంతవరకు సాగుతుందో చెప్పలేని స్థితి. -సాక్షి క్రీడా విభాగం



జర్మనీ

మాజీ చాంపియన్‌ స్పెయిన్‌తో మ్యాచ్‌ను మినహాయిస్తే... గ్రూప్‌ 'ఇ'లోని ఇతర జట్లయిన కోస్టారికా, జపాన్‌లపై జర్మనీ విజయం సాధిస్తే తదుపరి దశకు అర్హత పొందడం ఖాయమనుకోవాలి. గుండోగన్‌, జమాల్‌ ముసియాలా, కాయ్‌ హవెర్ట్జ్‌, లెరాయ్‌, మార్కో రెయిస్‌ కీలక ఆటగాళ్లు.

ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన: నాలుగుసార్లు చాంపియన్‌ (1954, 1974, 1990, 2014). **'ఫిఫా' ర్యాంక్‌:** 11. **అర్హత ఎలా:** యూరోప్‌ క్వాలిఫయింగ్‌లో గ్రూప్‌ 'జె' విజేత.

స్పెయిన్‌

సమన్వయంతో ఆడటంలో స్పెయిన్‌ ఆటగాళ్లు సిద్ధహస్తులు. గత ఆరేళ్లలో ఆ జట్టు ఆడిన మ్యాచ్‌ల్లో రెండు గోల్స్‌ తేడాతో ఓడిపోయిన ఒక్క మ్యాచ్‌ కూడా లేదు. ఈ ప్రపంచకప్‌లో తమ గ్రూప్‌లో జర్మనీతో మ్యాచ్‌ ఆ జట్టుకు కీలకం కానుంది. పెడ్రీ, ఫెరాన్‌ టోరెస్‌, మొరాటా, సిమోన్‌ కీలక ఆటగాళ్లు.

ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన: చాంపియన్‌ (2010). **'ఫిఫా' ర్యాంక్‌:** 7. **అర్హత ఎలా:** యూరోప్‌ క్వాలిఫయింగ్‌లో గ్రూప్‌ 'బి' విజేత.

జపాన్‌

వరుసగా ఏడో ప్రపంచకప్‌లో ఆడుతున్న జపాన్‌ మూడుసార్లు గ్రూప్‌ దశలో నిష్క్రమించగా, మూడుసార్లు ప్రిక్వార్టర్‌ ఫైనల్లో వెనుదిరిగింది. ఆసియా క్వాలిఫయింగ్‌ రెండో రౌండ్‌లో జపాన్‌ ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లోనూ గెలిచింది. మంగోలియాపై 14-0తో, మయన్మార్‌పై 10-0తో నెగ్గిన జపాన్‌ రెండో రౌండ్‌లో ఏకంగా 46 గోల్స్‌ కొట్టి కేవలం రెండు గోల్స్‌ సమర్పించుకుంది. మూడో రౌండ్‌లో రెండో స్థానంలో నిలిచి ప్రపంచకప్‌ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. దైచి కమాడా కీలక ఆటగాడు. జర్మనీ, స్పెయిన్‌లతో మ్యాచ్‌ ఫలితాలే ఈసారి జపాన్‌ ప్రస్థానాన్ని నిర్ణయిస్తాయి.

ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన: ప్రిక్వార్టర్‌ ఫైనల్‌ (2002, 2010, 2018). **'ఫిఫా' ర్యాంక్‌:** 24. **అర్హత ఎలా:** ఆసియా క్వాలిఫయింగ్‌లో మూడో రౌండ్‌ గ్రూప్‌ 'బి' రన్నరప్‌.

కోస్టారికా

ఆరోసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న కోస్టారికా అద్భుతంగా రాణిస్తే తప్ప ఈసారి గ్రూప్‌ దశను దాటే అవకాశాలు కనిపించడంలేదు. జర్మనీ, స్పెయిన్‌లలో ఒక జట్టును ఓడిస్తే తప్ప కోస్టారికా ముందుకు వెళ్లడం కష్టమే. అర్సెనల్‌ జట్టుకు ఆడే జోయల్‌ క్యాంప్‌బెల్‌ కీలక ఆటగాడు.

ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన: క్వార్టర్‌ ఫైనల్‌ (2014). **'ఫిఫా' ర్యాంక్‌:** 31. **అర్హత ఎలా:** ఉత్తర, మధ్య అమెరికా, కరీబియన్‌-ఓసియానియా క్వాలిఫయింగ్‌ ప్లే ఆఫ్‌ మ్యాచ్‌ విజేత.

విలియమ్సన్‌కు సన్‌రైజర్స్‌ గుడ్‌బై

- డ్వేన్‌ బ్రేవో, మయాంక్‌ అగర్వాల్‌, పూరన్‌లను తప్పించిన జట్లు
- ఆట నుంచి తప్పుకొని కోచ్‌గా మారిన కీరన్‌ పొలార్డ్‌
- ఐపీఎల్‌-2023 వేలం కోసం ఆటగాళ్ల విడుదల



పొలార్డ్‌



విలియమ్సన్‌

న్యూఢిల్లీ: ఎనిమిది సీజన్లుగా సన్‌రైజర్స్‌ హైదరాబాద్‌ (ఎస్‌ఆర్‌హెచ్‌) జట్టులో భాగమైన కెప్టెన్‌ కేన్‌ విలియమ్సన్‌తో అనుబంధాన్ని ఫ్రాంచైజీ ముగించింది. ఐపీఎల్‌-2023 వేలానికి ముందు తమ జట్టు నుంచి విలియమ్సన్‌ను తప్పించాలని సన్‌రైజర్స్‌ యాజమాన్యం నిర్ణయించింది. వచ్చే సీజన్‌ కోసం నిర్వహించే వేలం కోసం ప్రస్తుత జట్ల నుంచి తాము విడుదల చేసే ఆటగాళ్ల జాబితాను సమర్పించాలని ఆయా జట్లను గవర్నింగ్‌ కౌన్సిల్‌ కోరింది. అందుకు మంగళవారం వరకు గడువు ఇచ్చింది. దాంతో 10 ఫ్రాంచైజీలు తమ జాబితాలను సమర్పించాయి. విలియమ్సన్‌ 2015 నుంచి హైదరాబాద్‌ టీమ్‌తో ఉన్నాడు. 76 మ్యాచ్‌లలో 126.03 స్ట్రయిక్‌ రేట్‌తో 2101 పరుగులు చేసిన కేన్‌... 46 మ్యాచ్‌లలో కెప్టెన్‌గా వ్యవహరించాడు. 2018లో వార్నర్‌పై నిషేధం ఉన్న సమయంలో కెప్టెన్‌గా జట్టును రన్నరప్‌గా నిలిపిన అతను గత రెండు సీజన్లుగా ఘోరంగా విఫలమయ్యాడు. వెస్టిండీస్‌ కెప్టెన్‌గా పేలవ ఫామ్‌లో ఉన్న నికోలస్‌ పూరన్‌ను కూడా సన్‌రైజర్స్‌ వదిలేసుకుంది. వీరిద్దరిని తప్పించడంతో రైజర్స్‌ ఖాతాలో వేలం కోసం ఏకంగా రూ. 24.75 కోట్లు చేరాయి.

2011 నుంచి చెన్నై సూపర్‌ కింగ్స్‌ (సీఎస్కే)తోనే ఉన్న ఆల్‌రౌండర్‌ డ్వేన్‌ బ్రేవోను కూడా ఆ జట్టు తప్పించగా... 13 సీజన్ల పాటు జట్టులో భాగమై ముంబై ఇండియన్స్‌ 5 ఐపీఎల్‌ టైటిల్స్‌, 2 చాంపియన్స్‌ లీగ్‌ టైటిల్స్‌ గెలవడంలో కీలకపాత్ర పోషించిన పొలార్డ్‌ కూడా ఆటగాడిగా రిటైర్మెంట్‌ ప్రకటించాడు. అయితే అతడు తమ జట్టుకు చేసిన సేవలను గుర్తిస్తూ పొలార్డ్‌ను బ్యాటింగ్‌ కోచ్‌గా ముంబై ఫ్రాంచైజీ ఎంపిక చేసింది. ఐపీఎల్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన విదేశీ ఆటగాడు కావడంతో పాటు ఒకే టీమ్‌కు ప్రాతినిధ్యం వహించిన అరుదైన జాబితాలో కూడా పొలార్డ్‌ ఉన్నాడు. పంజాబ్‌ కింగ్స్‌ జట్టుకు గత ఏడాది కెప్టెన్‌గా వ్యవహరించిన మయాంక్‌ను కూడా ఆ జట్టు వదిలేసింది. గత సీజన్‌ మధ్యలో రిటైర్మెంట్‌ ప్రకటించి మళ్లీ వెనక్కి తీసుకున్న అంబటి రాయుడును మాత్రం చెన్నై కొనసాగించడం విశేషం. డిసెంబర్‌ 23న కొచ్చిలో జరిగే మినీ వేలంలో ఈ ఖాళీలను ఆయా జట్లు భర్తీ చేసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో జట్టులో గరిష్టంగా 25 మంది ఆటగాళ్లకు అవకాశం ఉండగా, వేలం మొత్తం రూ. 95 కోట్లు దాటరాదు.

ఆయా జట్లు విడుదల చేసిన ఆటగాళ్ల పేర్లు

కోల్‌కతా (16 మంది): కమిన్స్‌, బిల్లింగ్స్‌, నబీ, కరుణరత్నే, ఫించ్‌, హేల్స్‌, అమాన్‌, శివమ్‌ మావి, అభిజిత్‌, అజింక్య రహానే, అశోక్‌ శర్మ, బాబా ఇంద్రజిత్‌, ప్రథమ్‌ సింగ్‌, రమేశ్‌ కుమార్‌, రసిఖ్‌ సలామ్‌, షెల్డన్‌ జాక్సన్‌.

ముంబై (13 మంది): పొలార్డ్‌, స్యామ్స్‌, ఫాబియాన్‌ అలెన్‌, మెరిడిత్‌, మిల్స్‌, అన్‌మోల్‌ప్రీత్‌, ఆర్యన్‌ జుయల్‌, బాసిల్‌ థంపి, జైదేవ్‌ ఉనాద్కట్‌, మయాంక్‌ మర్కండే, మురుగన్‌ అశ్విన్‌, రాహుల్‌ బుద్ధి (హైదరాబాద్‌), సంజయ్‌ యాదవ్‌.

హైదరాబాద్‌ (12 మంది): విలియమ్సన్‌, పూరన్‌, షెఫర్డ్‌, అబాట్‌, సుచిత్‌, ప్రియం గార్గ్‌, సమర్థ్‌, సౌరభ్‌ దూబే, శశాంక్‌, శ్రేయస్‌ గోపాల్‌, సుశాంత్‌ మిశ్రా, విష్ణు వినోద్‌.

రాజస్తాన్‌ (9 మంది): మిచెల్‌, నీషమ్‌, కౌల్టర్‌ నైల్‌, వాన్‌ డర్‌ డసెన్‌, బాష్‌, అనునయ్‌, కరుణ్‌ నాయర్‌, శుభమ్‌, తేజస్‌.

పంజాబ్‌ (9 మంది): ఒడెన్‌ స్మిత్‌, హోవెల్‌, మయాంక్‌ అగర్వాల్‌, వైభవ్‌, ఇషాన్‌ పొరెల్‌, అన్ష్‌, ప్రేరక్‌, సందీప్‌ శర్మ, రితిక్‌.

చెన్నై (8 మంది): డ్వేన్‌ బ్రేవో, మిల్నే, జోర్డాన్‌, ఉతప్ప, నిశాంత్‌, భగత్‌ వర్మ (హైదరాబాద్‌), ఆసిఫ్‌, జగదీశన్‌.

లక్నో (7 మంది): హోల్డర్‌, టై, చమీర, లూయిస్‌, అంకిత్‌ రాజ్‌పుత్‌, మనీశ్‌ పాండే, షహబాజ్‌ నదీమ్‌.

గుజరాత్‌ (6 మంది): ఫెర్గూసన్‌, గుర్బాజ్‌, డ్రేక్స్‌, జేసన్‌ రాయ్‌, గురుకీరత్‌, ఆరోన్‌.

ఢిల్లీ (5 మంది): సీఫెర్ట్‌, శార్దుల్‌, కేఎస్‌ భరత్‌, అశ్విన్‌ హెబర్‌ (ఆంధ్ర), మన్‌దీప్‌.

బెంగళూరు (5 మంది): బెహ్రెన్‌డార్ఫ్‌, రూథర్‌ఫోర్డ్‌, అనీశ్వర్‌, లవ్‌నిత్‌, సీవీ మిలింద్‌ (హైదరాబాద్‌).

అభిషేక్‌, భరత్‌ సెంచరీలు: 261 పరుగులతో ఆంధ్ర ఘన విజయం



అభిషేక్‌ రెడ్డి



భరత్‌



తన్మయ్‌

బెంగళూరు: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్‌ హజారే ట్రోఫీలో ఆంధ్ర తొలి విజయం నమోదు చేసింది. గ్రూప్‌ 'సి'లో భాగంగా అరుణాచల్‌ ప్రదేశ్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 261 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 367 పరుగులు చేసింది. అభిషేక్‌ రెడ్డి (133 బంతుల్లో 136; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు), కోన శ్రీకర్‌ భరత్‌ (84 బంతుల్లో 100 నాటౌట్‌; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలతో చెలరేగారు. అనంతరం అరుణాచల్‌ ప్రదేశ్‌ 38 ఓవర్లలో 106 పరుగులకే కుప్పకూలింది. కమ్షు(18)దే అత్యధిక స్కోరు. అయ్యప్ప 3 వికెట్లు పడగొట్టగా... షోయబ్‌, హరిశంకర్‌, ఆశిష్‌ తలా 2 వికెట్లు తీశారు. పరుగుల పరంగా ఈ టోర్నీ చరిత్రలో ఆంధ్రకిదే పెద్ద విజయం.

తన్మయ్‌ అగర్వాల్‌ శతకం...

న్యూఢిల్లీ: సౌరాష్ట్రతో జరిగిన గ్రూప్‌ 'ఎ' మ్యాచ్‌లో హైదరాబాద్‌ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ముందుగా సౌరాష్ట్ర 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 312 పరుగులు చేసింది. హార్విక్‌ దేశాయ్‌ (120 బంతుల్లో 102; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకం సాధించాడు. సంకేత్‌ 4 వికెట్లు పడగొట్టగా, అనికేత్‌ రెడ్డికి 3 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత హైదరాబాద్‌ 48.5 ఓవర్లలో 5 వికెట్లకు 314 పరుగులు చేసింది. ఓపెనర్లు తన్మయ్‌ అగర్వాల్‌ (119 బంతుల్లో 124; 14 ఫోర్లు, 2 సిక్స్‌లు), రోహిత్‌ రాయుడు (97 బంతుల్లో 83; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 214 పరుగులు జోడించి హైదరాబాద్‌ విజయాన్ని సులువుగా మార్చగా, తిలక్‌ వర్మ (45; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించాడు.

అమన్‌ రావు సెంచరీ



సాక్షి, హైదరాబాద్‌: బీసీసీఐ అండర్‌-19 టోర్నీ (కూచ్‌ బెహర్‌ ట్రోఫీ)లో భాగంగా ఉప్పల్‌ స్టేడియంలో హైదరాబాద్‌, సౌరాష్ట్ర మధ్య జరిగిన నాలుగు రోజుల మ్యాచ్‌ 'డ్రా'గా ముగిసింది. రెండో ఇన్నింగ్స్‌లో 422 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్‌ చివరి రోజు ఆట ముగిసే సమయానికి 97 ఓవర్లలో 5 వికెట్లకు 290 పరుగులు చేసింది. అమన్‌ రావు (217 బంతుల్లో 156 నాటౌట్‌; 19 ఫోర్లు, 5 సిక్స్‌లు) కీలక సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో సౌరాష్ట్ర 290, హైదరాబాద్‌ 226 పరుగులు చేయగా... సౌరాష్ట్ర తమ రెండో ఇన్నింగ్స్‌ను 9 వికెట్లకు 357 పరుగుల వద్ద డిక్లేర్‌ చేసింది. ఆరు జట్లున్న గ్రూప్‌ 'బి'లో ఉన్న హైదరాబాద్‌ ఒక మ్యాచ్‌లో గెలిచి, ఒక మ్యాచ్‌ను 'డ్రా' చేసుకొని ఎనిమిది పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

క్లుప్తంగా

ఎన్జీ రంగా వర్సిటీ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యాన ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.పూర్ణిమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ నుంచి చిరుధాన్యాలు, వర్మికంపోస్ట్, సెరికల్చర్, బయో ఫెర్టిలైజర్స్ కోర్సులను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కోర్సుల వ్యవధి 8 వారాలు అని పేర్కొన్నారు. ఆసక్తి గల యువత, మహిళలు, నిరుద్యోగులు ఒక్కో కోర్సుకు రూ.1,500 ఫీజు చెల్లించి డిసెంబర్ ఒకటో తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఆండ్రాయిడ్ ఫోన్ లేదా కంప్యూటర్ కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్‌ను గానీ 8008788776, 8309626619, 9110562727 సెల్ నంబర్లను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గానీ సంప్రదించాలని సూచించారు. ఈ కోర్సులు పూర్తి చేసినవారు స్వయం ఉపాధి పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

బీఎస్సీలో 'ఎన్‌ఆర్‌ఐ' సీట్ల దరఖాస్తుకు గడువు పెంపు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో బీఎస్సీ వ్యవసాయం, కమ్యూనిటీ సైన్స్‌లో ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్ల భర్తీకి మూడవ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌ఆర్‌ఐ కోటాలో దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు గడువు తేదీని నవంబర్ 25వ తేదీ వరకూ పెంచినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఆయా కోర్సుల్లో చేసుకునే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా విశ్వవిద్యాలయానికి చేరేలా పంపాలని తెలిపారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్‌ను సంప్రదించాలని కోరారు.

విఐటీ-ఏపీ ఆధ్వర్యంలో నేషనల్ హ్యాకథాన్

అమరావతి: విఐటీ-ఏపీ ఆధ్వర్యంలో ఈ నెల 12,13న జాతీయ హ్యాకథాన్ నిర్వహించినట్లు వర్సిటీ యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో 300 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమాన్ని ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీఈవో దాసరి రామకృష్ణ ప్రారంభించారు. అలాగే, హ్యాకథాన్ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ (ఏపీఐఎస్)తో విఐటీ-ఏపీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కార్యక్రమంలో టెక్ మహేంద్ర సంస్థ ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, వర్సిటీ రిజిస్ట్రార్ ఎం.జగదీశ్ చంద్ర, వర్సిటీ ఐఐఈసీ డైరెక్టర్ డాక్టర్ అమిత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



సాక్షి, హైదరాబాద్: మధుమేహ వ్యాధి ప్రబలడానికి కారణాలు, నివారణ చర్యలపై అవగాహన పెంచడానికి విజయవాడలోని వీజీఆర్ డయాబెటిక్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, శ్రీ చైతన్య స్కూల్ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు భారీ సంఖ్యలో విజేతలుగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీల్లో 40358 మంది విద్యార్థులు పాల్గొనగా.. 2295 మంది విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా మంగళవారం విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో విజేతలను ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అభినందించారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, వీజీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ చైర్మన్ కె.వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. విజేతలను శ్రీ చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు అభినందించారు.

ప్రత్యేక అవసరాల పిల్లల అభివృద్ధికి కృషి

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్

సాక్షి అమరావతి: పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సర్వతోముఖాభివృద్ధికి పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాయని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఎస్.సురేష్ కుమార్ చెప్పారు. మంగళవారం విజయవాడలో జరిగిన సహిత విద్యకు సంబంధించి ఒక రోజు కార్యశాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మండలాల్లో దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రాల ద్వారా విద్యను అందిస్తున్నామని తెలిపారు. సమగ్ర శిక్షా ఎస్‌పీడీ బి.శ్రీనివాసరావు, ఏఎస్పీడీ డాక్టర్ కె.వి.శ్రీనివాసులు, ప్రభుత్వ పాఠ్య పుస్తకాల ప్రచురణ సంచాలకులు రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మేధస్సు!



వైద్య రంగం స్వరూపాన్ని మార్చే శక్తి 'ఏఐ' సొంతం

- అసాధారణ అంశాలు ఇట్టే గుర్తింపు
- రోగ నిర్ధారణ పరీక్షల విశ్లేషణ సామర్థ్యం
- రోబోటిక్ సర్జరీల్లో కచ్చితత్వం వృద్ధి
- క్లినికల్ డేటాలో నాణ్యత
- వినూత్న ఆవిష్కరణలకు అవకాశం
- ఆసుపత్రులపై తగ్గనున్న పని ఒత్తిడి

(ఎం.విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి)

కోవిడ్ మహమ్మారి విసిరిన సవాళ్లకు సాంకేతిక పరిజ్ఞానం పరిష్కారాలు చూపిస్తోంది. వైద్య, ఆరోగ్య రంగం స్వరూపాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పూర్తిగా మార్చేస్తోంది. అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని ముందే హెచ్చరిక జారీ చేయడం, తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను వివరించడం, మెడికల్ పారామీటర్స్‌ను విశ్లేషించడం, జబ్బు రాకుండా నివారించడం, రోగాలను గుర్తించడంలో కచ్చితత్వం, డాక్టర్ల అపాయింట్‌మెంట్స్ ఖరారు, మందుల వాడకాన్ని ఎప్పటికప్పుడు గుర్తు చేయడం.. ఎన్నో పనులను సులభంగా, చౌకగా చేయడానికి ఏఐ శక్తినిస్తోంది.

రూపు మారుతున్న వైద్య రంగానికి సప్త మార్గాలు

పేషెంట్ కేంద్రం వైద్యారోగ్యరంగం విప్లవాత్మక మార్పులవైపు అడుగులు వేస్తోంది. సరికొత్త లక్ష్యాల దిశగా సాగుతున్న ప్రయాణంలో 7 అంశాలు ప్రధానంగా ఉన్నాయి.

వేరియబుల్స్, యాప్స్

స్మార్ట్‌వాచ్‌ల లాంటి వేరియబుల్స్, యాప్స్ వ్యక్తుల ఆరోగ్య సూచీలను డేటాను సేకరించి, ప్రాసెస్ చేసి, ఆయా వ్యక్తులకు రియల్‌టైంలో సలహాలు/హెచ్చరికలు జారీ చేస్తాయి. ఉదాహరణకు మధుమేహ స్థాయిలని ట్రాక్ చేసి పర్సనలైజ్డ్, రియల్‌టైం సూచనలు, సలహాలు ఇస్తాయి. ధరించిన వ్యక్తికే కాకుండా మనం సూచించిన దగ్గరి వ్యక్తులకు, ఫ్యామిలీ డాక్టర్‌కు కూడా ఈ సూచనలు చేరవేస్తుంది.

ముందుగా గుర్తించడం

స్మార్ట్‌వాచ్‌లు, బయోసెన్సర్స్, ఫిట్‌నెస్ ట్రాకర్స్ మన గుండె కొట్టుకుంటున్న తీరు, ఊపిరి తీసుకుంటున్న విధానాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, అసాధారణ తీరు ఉంటే వెంటనే యూజర్‌కు విషయాన్ని చెబుతుంది. విషమ పరిస్థితులు ఏర్పడి చేయిదాటి పోకముందే ముందస్తు హెచ్చరికలను నోటిపై చేస్తుంది. యాక్సలరోమీటర్ బ్రేస్‌లెట్స్, స్మార్ట్‌బెల్ట్స్.. వృద్ధులు పట్టుకోల్పోవడం, డీహైడ్రేషన్‌కు గురవటం, కిందపడిపోవడం లాంటి అంశాల గురించి బంధువులు, వైద్యులు, అత్యవసర వ్యవస్థకు నోటిఫికేషన్ జారీ చేయగలుగుతాయి. తక్షణ సాయం అందించే 108 లాంటి అంబులెన్స్ వ్యవస్థకు స్థలం, పరిస్థితిని తెలియజేసే నోటిఫికేషన్లు రావడం వల్ల తక్షణం బాధితులను ఆసుపత్రికి చేర్చి వైద్య సహాయం అందించడానికి వీలవుతుంది. విలువైన ప్రాణాలను రక్షించడానికి ఏఐ అవకాశం కల్పిస్తుంది. నిర్ణీత సమయంలో ఏ పరిస్థితులు తలెత్తాయనే అంశాలను రికార్డు చేసి విశ్లేషించే సామర్థ్యం కూడా 'ఏఐ' ఉన్న ఉపకరణాలకు ఉంటుంది.

వైద్యులు, సిబ్బందికి సహాయకారిగా..

వైద్యులు, సిబ్బందికి సహాయకారిగా పనిచేసే ఉపకరణాలు అందుబాటులోకి రానున్నాయి. రోగులు చెబుతున్న విషయాన్ని, డాక్టర్ సూచించిన మెడికేషన్‌ను నోట్ చేసుకొని కేస్‌షీట్‌ను జనరేట్ చేయడమే కాకుండా క్లినికల్ డేటాను తప్పులు లేకుండా రికార్డు చేయగలిగే ఉపకరణాలు వచ్చే దశాబ్దంలో అన్ని ఆసుపత్రుల్లో మనకు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. వైద్యులు, సిబ్బంది మీద పని ఒత్తిడి తగ్గి రోగి మీద ఎక్కువగా దృష్టి కేంద్రీకరించడానికి ఇవి ఉపయోగపడతాయి. ఆసుపత్రుల్లో ఈ 'వర్చువల్ అసిస్టెన్స్' మార్కెట్ 2027 నాటికి దాదాపు 3 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా.

ఫలితాల విశ్లేషణ

రోగ నిర్ధారక పరీక్షల ఫలితాలను ఇప్పటికీ సంప్రదాయ పద్ధతుల్లో మాన్యువల్‌గా విశ్లేషిస్తున్నారు. ఫలితాలను నూరు శాతం కచ్చితత్వంతో విశ్లేషించే సామర్థ్యం 'ఏఐ'కి ఉంది. శాంపిల్‌ను లోడ్ చేస్తే ఫలితాల విశ్లేషణ నివేదిక త్వరలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. ఇది సాకారమైతే రోగ నిర్ధారణ పరీక్షల్లో మానవ తప్పిదాలను పూర్తిగా నివారించి కచ్చితత్వం ఊహించని స్థాయికి పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

వర్చువల్ కన్సల్టేషన్



డాక్టర్లతో వర్చువల్‌గా మాట్లాడి చికిత్స పొందడానికి ఏఐ ఆధారిత అప్లికేషన్లు ఉపయోగపడతాయి. డాక్టర్ అపాయింట్‌మెంట్‌ను నిర్ధారించడం మొదలు సలహా తీసుకోవడం, మందులు ఇంటికి డెలివరీ, మందులు వాడుతున్న విధానం, డోసేజ్‌ను మానిటర్ చేయడం, రోగుల ఫీడ్‌బ్యాక్ డాక్టర్లకు చేరవేయడం.. ఇప్పుడు ఏఐ అప్లికేషన్లు చేయగలుగుతున్నాయి.

వైద్య రంగం మీద ఒత్తిడి తగ్గుతుంది



- **వినూత్న ఆవిష్కరణకు అవకాశం:** సాంకేతిక పరిజ్ఞానం పెరగడం వల్ల ఇటు రోగులకు సులభంగా వైద్య సేవలు పొందే అవకాశం రావడంతో పాటు, అటు వైద్య రంగంలో వినూత్న ఆవిష్కరణలు వస్తాయి. ఆసుపత్రులు, హెల్త్‌కేర్ సిబ్బంది మీద ఒత్తిడి తగ్గుతుంది. రోగాల నివారణ మీద ఎక్కువ సమయం వెచ్చించడానికి డాక్టర్లకు సమయం దొరుకుతుంది.
- వైద్య, ఆరోగ్య వ్యవస్థ సామర్థ్యం, చికిత్స అందించే వేగం పెరగడానికి 'ఏఐ' దోహదం చేస్తుంది. ఫలితంగా తక్కువ వ్యయంతో ఎక్కువ మందికి మెరుగైన చికిత్స అందించడం ప్రభుత్వాలకు సాధ్యమవుతుంది.
- **రోగుల సాధికారత:** రోగి వైద్యం కోసం ఆసుపత్రి మొట్లు ఎక్కిన దగ్గర నుంచి చికిత్స ముగిసే వరకు ప్రతి అంశం రికార్డు అవుతుంది. మళ్లీ జబ్బు చేసినప్పుడు అంతకు ముందు ఏ చికిత్స తీసుకున్నారనే విషయం డాక్టర్‌కు అందుబాటులోకి ఉంటుంది. ఆసుపత్రికి రాకుండా కూడా చికిత్స పొందడానికి రోగికి అవకాశం ఉంటుంది.

రోబోటిక్ సర్జరీ

సర్జరీల్లో రోబోలను ఉపయోగించడం ఇప్పుడు అసాధారణ విషయం కాదు. తెలుగు రాష్ట్రాల్లోని చాలా ఆసుపత్రుల్లో రోబోటిక్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయి. న్యూయార్క్ స్టేట్ యూనివర్సిటీలో జరిగిన పరిశోధనలో కిడ్నీ సర్జరీల్లో రోబోలనువాడటం వల్ల సక్సెస్ రేట్ 52 శాతం పెరిగిందని తేలింది. పూర్తిస్థాయిలో 'ఏఐ' బ్యాకింగ్ ఉన్న రోబోటిక్ సర్జరీలు ప్రపంచవ్యాప్తంగా గణనీయంగా పెరిగి డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది మీద ఒత్తిడి తగ్గుతుందని అంచనా వేస్తున్నారు.

రిహాబిలిటేషన్

చికిత్సలో రిహాబిలిటేషన్ ముఖ్యమైన అంశం. సర్జరీ/చికిత్స పూర్తయిన తర్వాత సక్రమంగా మెడికేషన్ కొనసాగించాలి. 'ఏఐ' యాప్స్, ఉపకరణాలు 'కేర్ మేనేజ్‌మెంట్'లో కీలకం కానున్నాయి. రోగులు కోలుకుంటున్న తీరును ఎప్పటికప్పుడు అంచనా వేయడానికి, వైద్యుల సూచనల మేరకు మందులు వేసుకోమని గుర్తు చేయడానికి ఇవి ఉపయోగపడతాయి. రోగుల ఫీడ్‌బ్యాక్ తీసుకొని డాక్టర్లకు చేరవేసి 'మెడికేషన్'లో మార్పులు చేర్పులను రోగికి అందించగలవు. వైద్యరంగం పరిశోధనకు కూడా ఈ డేటా ఉపయోపడుతుంది. ఇదంతా ఇప్పటికి ఊహాజనితంగా ఉన్నా వాస్తవరూపం దాల్చే రోజు దగ్గర్లోనే ఉందని టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

తిరుపతిలో సీఎం కప్ ఫైనల్స్

వచ్చే ఏడాది జనవరిలో నిర్వహణకు ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సీఎం కప్ క్రీడా పోటీల ఫైనల్స్ నిర్వహణకు ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మండల, నియోజకవర్గ స్థాయి పోటీలు ముగిశాయి. 5 జిల్లాల్లో (ఉమ్మడి జిల్లాలు) జిల్లా స్థాయి పోటీలు పూర్తయ్యాయి. తాజాగా మిగిలిన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ)ల్లోనూ పోటీలు ప్రారంభమయ్యాయి. కోవిడ్ కారణంగా ఆలస్యమైన 2021–22 'సీఎం కప్' పోటీలను విజయవంతం చేసే దిశగా శాప్ ముందుకెళ్తోంది. ఒలింపిక్స్ మాదిరిగా అన్ని క్రీడాంశాల ఫైనల్స్‌ను వచ్చే ఏడాది జనవరి నెలాఖరున తిరుపతిలో నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తోంది. గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ పేరుతో శాప్ భారీ క్రీడా టోర్నీకి తెర దీసింది. 14 క్రీడాంశాల్లో 4 దశల్లో పోటీలు నిర్వహిస్తోంది. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, తదితర విభాగాల్లో 175 నియోజకవర్గాల క్రీడాకారులను భాగస్వాములను చేస్తోంది. ప్రస్తుతం కృష్ణా, గుంటూరు, నెల్లూరు, వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, ప్రకాశం, చిత్తూరు (ఉమ్మడి జిల్లాల్లో)లో జిల్లా స్థాయి పోటీలు జరుగుతున్నాయి. అన్ని జిల్లాల్లోని విజేత జట్లు ఫైనల్స్‌లో తలపడనున్నాయి.

అట్టహాసంగా సీఎం కప్ ఫైనల్స్

జిల్లా జట్లతో రాష్ట్ర స్థాయి పోటీలు సిద్ధంగా ఉండాలంటూ ఆయా డీఎస్‌ఏ సీఈవోలు, చీఫ్ కోచ్‌లకు ఆదేశాలిచ్చాం. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం కప్ ఫైనల్స్ నిర్వహిస్తాం. స్టేట్ ఒలింపిక్స్ మాదిరిగా ఒకే ప్రాంతంలో అన్ని పోటీలను ఏర్పాటు చేస్తాం. సీఎం కప్‌తో గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ కూడా బయటకు వస్తుంది.

– బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, శాప్ చైర్మన్

అక్షయ పాత్రకు ఎల్ఐసీ విరాళం

మంగళగిరి: గుంటూరు జిల్లా ఆత్మకూరులోని అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు భారత జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) రూ.25 లక్షల విరాళాన్ని అందజేసింది. మంగళవారం అక్షయ పాత్ర కార్యాలయంలో ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎల్ఐసీ రీజనల్ మేనేజర్ విద్యానంద, మచిలీపట్నం సీనియర్ డివిజనల్ మేనేజర్ కేపీ రామకృష్ణ అక్షయ పాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు వంశీధర్‌దాస్‌కు విరాళం అందజేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అందించేందుకు అవసరమైన రెండు వాహనాల కొనుగోలు కోసం ఈ విరాళాన్ని అందజేసినట్టు ఎల్ఐసీ ఆర్ఎం తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజర్ రాజేష్‌బాబు, డివిజన్ మేనేజర్లు లక్ష్మణరావు, దుర్గాప్రసాద్, మంగళగిరి శాటిలైట్ మేనేజర్ లలిత, తెనాలి ఏబీఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

హెన్రీ క్రిస్టీనా కుల ధ్రువీకరణను మళ్లీ తేల్చండి

- గుంటూరు జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం
- మూడు నెలల గడువు

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా పరిషత్ (జెడ్పీ) చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టీనా, ఆమె భర్త కత్తెర సురేష్ కుమార్‌ల కులాన్ని మరోసారి తేల్చాలని గుంటూరు జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. వారి కుల ధ్రువీకరణపై పిటిషనర్ తాజాగా సమర్పించే ఆధారాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పింది. ఈ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది. నిర్ణయం తీసుకునే ముందు క్రిస్టీనా, సురేష్‌ల వాదన కూడా వినాలని కలెక్టర్‌కు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ దొనడి రమేశ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్రిస్టీనా, సురేష్ ఎస్సీలు కారని, అయినా ఎస్సీలుగా చలామణి అవుతున్నారని, వారి కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ కొల్లిపర గ్రామానికి చెందిన మంద్రు సరళ



కుమారి గత ఏడాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ మంగళవారం మరోసారి విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది జడా శ్రవణ్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. క్రిస్టీనా, సురేష్ కుమార్ బాప్టిజం తీసుకోవడం ద్వారా క్రైస్తవ మతంలోకి మారారని, అందువల్ల వారికి ఎస్సీ రిజర్వేషన్ వర్తించదని తెలిపారు. వారికిచ్చిన కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేయాలన్న పిటిషనర్ ఫిర్యాదును కలెక్టర్ తోసిపుచ్చారన్నారు. వారు బాప్టిజం తీసుకున్నట్లు అప్పట్లో ఆధారాలు దొరకలేదని, ఇప్పుడు ఆ ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు.

సలహాదారులుగా ఎవరిని నియమించాలో ప్రభుత్వ ఇష్టం

చంద్రశేఖర్‌రెడ్డి నియామక ఉత్తర్వులపై స్టే సాధ్యం కాదు

సాక్షి, అమరావతి: సలహాదారులుగా ఎవరిని నియమించుకోవాలన్నది పూర్తిగా ప్రభుత్వ ఇష్టమని హైకోర్టు స్పష్టం చేసింది. ఇందులో ఇతరుల జోక్యానికి తావు లేదంది. సలహాదారును మీరు ఎంచుకోలేరని పిటిషనర్‌కు తేల్చి చెప్పింది. ప్రభు త్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం)గా ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి నియామక ఉత్తర్వుల అమలును నిలిపివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. చంద్రశేఖర్‌రెడ్డి నియామకంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అందులో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్య కార్యదర్శితో పాటు చంద్రశేఖర్‌రెడ్డికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరి 23కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ సలహాదారుగా చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం గత ఏడాది జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన విశ్రాంత ఉద్యోగి ఎస్.మునయ్య దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సీజే ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది పీవీజీ ఉమేశ్ వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసిన చంద్రశేఖర్‌రెడ్డిని ఉద్యోగుల సంక్షేమం విషయంలో సలహాదారుగా ప్రభుత్వం నియమించిందని తెలిపారు. ఉద్యోగులతో సమన్వయం చేయడం ఆయన బాధ్యత అని చెప్పారు. వాస్తవానికి ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రస్తుతం కొన్ని వ్యవస్థలు పనిచేస్తున్నాయని, సలహాదారును నియమించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. సలహాదారుగా ఎవరిని నియమించాలన్నది ప్రభుత్వ ఇష్టమని తెలిపింది. ఇందులో జోక్యం చేసుకునే హక్కు ఇతరులకు లేదంది. చంద్రశేఖర్‌రెడ్డి నియామక ఉత్తర్వులపై స్టే ఇవ్వాలన్న ఉమేశ్ అభ్యర్థనను కూడా ధర్మాసనం తిరస్కరించింది.

ఎంబీబీఎస్ యాజమాన్య కోటా సీట్ల కేటాయింపు

809 సీట్లు రాష్ట్ర విద్యార్థులకే..

సాక్షి, అమరావతి: 2022–23 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ యాజమాన్య కోటా (బీ కేటగిరీ) సీట్ల భర్తీకి తొలి దశ కౌన్సెలింగ్‌లో విద్యార్థులకు సీట్ల కేటాయింపు పూర్తయింది. సీట్లు పొందిన విద్యార్థుల జాబితాను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మంగళవారం విడుదల చేసింది. యాజమాన్య కోటా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న 3,021 మందితో తుది మెరిట్ జాబితా విడుదల చేయగా ఇందులో 1,042 మందికి సీట్లు కేటాయించారు. తొలి దశలోనే బీ కేటగిరీ సీట్లన్నీ భర్తీ అయ్యాయి. ఇందులో 233 సీట్లలో ఏపీతో పాటు, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు అవకాశం కల్పించారు. మిగిలిన 809 సీట్లలో కేవలం ఏపీ విద్యార్థులకు మాత్రమే అడ్మిషన్లు లభించాయి.

బీఎస్సీ నర్సింగ్‌లో నేటి నుంచి వెబ్ ఆప్షన్‌లు

పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ కోర్సులో రాష్ట్ర కోటా సీట్ల భర్తీకి రెండో దశ వెబ్ కౌన్సెలింగ్‌కు బుధవారం నుంచి వెబ్ ఆప్షన్‌ల నమోదు ప్రారంభం కానుంది. ఉదయం 10 గంటల నుంచి శుక్రవారం సాయంత్రం 4 గంటల్లోగా వెబ్ ఆప్షన్‌లు నమోదు చేసుకోవాలి. https://ugpostbasic.ntruhs admissions.com వెబ్‌సైట్‌లో తుది జాబితాలో పేర్లున్న విద్యార్థులు ఆప్షన్‌లు నమోదు చేసుకోవాలి. ఇదిలా ఉండగా నంద్యాల జిల్లాలో ఓ ప్రైవేట్ కళాశాలలో అడ్మిషన్లకు అనుమతులు లభించాయి.

రిపోర్ట్ చేయని వారు 208 మంది..

ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లకు తొలి దశ కౌన్సెలింగ్‌లో 3,289 మందికి సీట్లు కేటాయించారు. వీరిలో 208 మంది విద్యార్థులు నిర్ణీత సమయంలోగా కళాశాలల్లో రిపోర్ట్ చేయలేదు. వీరి వివరాలను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మంగళవారం ప్రకటించింది.

మోసగాళ్లతో జాగ్రత్త

- హైకోర్టు రిజిస్ట్రార్ సంతకంతో నకిలీ నియామకపత్రం జారీ
- న్యాయమూర్తుల పేర్లు చెబుతూ డబ్బుల వసూలుకు ప్రయత్నాలు
- తీవ్రంగా స్పందించిన హైకోర్టు... పోలీసులకు ఫిర్యాదు
- అలాంటి వారి మాయలో పడొద్దని అభ్యర్థులకు హెచ్చరిక
- ఉద్యోగ సమాచారం కోసం హైకోర్టు వెబ్‌సైట్‌ను అనుసరించాలని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: హైకోర్టుతోపాటు దిగువ కోర్టుల్లో భారీగా పోస్టుల భర్తీకి హైకోర్టు నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో దానిని సొమ్ము చేసుకునేందుకు మోసగాళ్లు రంగంలోకి దిగారు. డబ్బు ఇస్తే ఉద్యోగం గ్యారెంటీ... అంటూ అభ్యర్థులను బురిడీ కొట్టిస్తున్నారు. ఏకంగా హైకోర్టు రిజిస్ట్రార్ల సంతకాలను ఫోర్జరీ చేసి ఉద్యోగ నియామక పత్రాలు జారీ చేసేస్తున్నారు. కొన్నిచోట్ల హైకోర్టు న్యాయమూర్తులు, అధికారుల పేర్లు వాడుతూ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు తమ దృష్టికి రావడంతో హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఇటీవల నకిలీ ఉద్యోగ నియామకపత్రాలను జారీ చేసిన మోసగాళ్లతోపాటు వారి నుంచి నియామకపత్రం పొందిన ఒక వ్యక్తిపై కూడా గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కోర్టుల్లో ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడిన 15మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో మోసగాళ్లకు, వారి బారిన పడుతున్న అభ్యర్థులకు హైకోర్టు గట్టి హెచ్చరికలు చేస్తూ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పే మోసగాళ్లు, కుట్రదారుల చేతిలో మోసపోవద్దంటూ అభ్యర్థులను హైకోర్టు హెచ్చరించింది. న్యాయమూర్తులు, అధికారుల పేర్లు చెప్పి డబ్బులు వసూలు చేసే వ్యక్తులు, వారికి సహకరించేవారిపైనా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించే ఏ వ్యక్తిని కూడా విడిచిపెట్టే సమస్యే లేదని స్పష్టం చేసింది. ఉద్యోగాల విషయంలో తప్పుడు వార్తలను, పోస్టులను వ్యాప్తి చేసే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఉద్యోగాల భర్తీకి సంబంధించిన సమాచారం కోసం అభ్యర్థులు హైకోర్టు వెబ్‌సైట్‌ను మాత్రమే అనుసరించాలని సూచించింది. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసపు మాటలు చెప్పే వ్యక్తులు, నకిలీ నియామక పత్రాలు ఇచ్చే వారు తారసపడితే వారి గురించి హైకోర్టుకు ఫిర్యాదు చేయాలని తెలిపింది. ఆ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ (పరిపాలన) ఆలపాటి గిరిధర్ మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు.

బాలికపై లైంగికదాడి కేసులో 20 ఏళ్ల జైలు

విజయవాడ స్పోర్ట్స్: మైనర్ బాలికపై లైంగికదాడికి ఒడిగట్టిన 55 ఏళ్ల వ్యక్తికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయవాడ స్పీడ్ ట్రయిల్ ఫర్ పోక్సో కోర్టు న్యాయమూర్తి డాక్టర్ ఎస్.రజని మంగళవారం తీర్పు చెప్పారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన 55 ఏళ్ల షేక్ నాజర్‌వలి లైంగిక దాడికి పాల్పడ్డాడు. 2016 డిసెంబర్ రెండో తేదీ రాత్రి ఏడు గంటలకు అదే గ్రామంలో జరిగిన ఈ ఘటనపై సంబంధిత గన్నవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో 13 మంది సాక్షులను న్యాయమూర్తి విచారించారు. బాధితురాలి తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వి.నారాయణరెడ్డి కోర్టుకు వాదనలు వినిపించారు. విచారణ అనంతరం సెక్షన్ 6 ఆఫ్ పోక్సో యాక్ట్ కింద నేరం రుజువు కావడంతో ముద్దాయి షేక్ నాజర్‌వలికి జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానాను న్యాయమూర్తి విధించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.